10-07Pg1exHMNWJQE.qxd:10-07Pg1exHMNWJQE.qxd 1/1/02 6:25 AM Page 1



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

10-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 160 పేజీలు: 16 వెల: 6.50

ఆ ఉత్పత్తులకు సుంకాల్లేవ్

మోడీ పర్యటనకు ముందు న్యూజిలాండ్ ప్రకటన

5లో

ఖమేనీకి జన నీరాజనం

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

భారత్-ఆస్ట్రేలియా స్నేహానికి భారతీయ సమాజమే బలమైన స్తంభం

'మెల్‌బోర్న్ మీట్స్ మోడ్డీలో ప్రధాని మోడీ

ఇరు దేశాల సంబంధాలను క్రికెట్‌తో పోలిక

వన్డే మ్యాచ్‌లా సమావేశాల అజెండా

టి20లా ఇండియా-ఆసీస్ నిర్ణయాలు

టెస్ట్ మ్యాచ్‌లా ఇరుదేశాల భాగస్వామ్యం

భారతీయ మిత్రుడు అల్బనీస్ అంటూ ప్రశంసలు

ఆస్ట్రేలియా ప్రధానితో మోడీ ద్వైపాక్షిక చర్చలు

అణు ఇంధనం నుంచి రక్షణ వరకు కీలక ఒప్పందాలు

భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం సుగమం

స్వదేశానికి చేరిన మూడు ప్రాచీన పురావస్తువులు

'మెల్‌బోర్న్ మీట్స్ మోడ్డీలో ప్రవాసభారతీయులకు ప్రధాని మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అభివాదం

మెల్‌బోర్న్, జులై 9: ఆస్ట్రేలియా పర్యటనలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మెల్‌బోర్న్‌లో అఖండ స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో పాల్గొన్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోడ్డీ' కార్యక్రమంలో ప్రధాని మోడీ భారత్- ఆస్ట్రేలియా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాలోని భారతీయ సమాజం రెండు దేశాల మధ్య స్నేహ బంధానికి ముఖ్యమైన శక్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. భారత్- ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కేవలం ప్రభుత్వాల మధ్యమాత్రమే కాకుండా ప్రజల మధ్య అనుబంధంతో మరింత బలపడుతున్నాయని మోడీ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 30 వేల మంది హాజరయ్యారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం, మద్దతు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధాని మోడీ తన ప్రసంగంలో భారతీయ సమాజాన్ని భారత్- ఆస్ట్రేలియా స్నేహానికి 'బలమైన స్తంభాలలో ఒకటి'గా అభివర్ణించారు. 'మెల్‌బోర్న్‌లోని భారతీయ సమాజం మధ్య ఉండటం ఎంతో ఉత్సాహంగా ఉంది. వారి శక్తి, ఉత్సాహం సాటిలేనివి. వారు భారత్‌ఆస్ట్రేలియా స్నేహానికి కీలకమైన బలమైన స్తంభాలు' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రసంగంలో ప్రధాని మోడీ క్రికెట్‌ను కూడా ప్రస్తావిస్తూ భారత్- ఆస్ట్రేలియా సంబంధాలను క్రీడతో పోల్చారు. మెల్‌బోర్న్‌వంటి క్రీడానగరంలో క్రికెట్ గురించి మాట్లాడకుండా ఉండటం సాధ్యంకాదని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. క్రికెట్ రెండు దేశాల మధ్య ఒక 'దౌత్య భాష'గా మారిందని చెప్పారు. భారత్- ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని క్రికెట్ ఫార్మాట్లతో పోల్చిన ప్రధాని, 'మన సమావేశాల అజెండా వన్డే మ్యాచ్‌లా స్పష్టంగా ఉంటుంది. నిర్ణయాలు టి20లా వేగంగా ఉంటాయి. మన భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్‌లా దీర్ఘకాలికంగా, బలంగా ఉంటుంది' అని అన్నారు. ఈ వ్యాఖ్యలకు ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. భారత్- ఆస్ట్రేలియా సంబంధాలు గత కొన్నేళ్లలో మరింత బలపడుతున్నాయని ప్రధానమంత్రి >>2

ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- వైసిపి తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫొటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్థించిన రావణ్‌కు వైసిపి ఆర్థిక సాయం
- ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికి ఉన్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నారు
- బనగానపల్లె సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

గురువారం బనగానపల్లె ప్రజా వేదికలో పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి జనార్ధన్ రెడ్డి

నంద్యాల, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సిఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములు గత పాలకులు 22ఏ కిందచేర్చారు. వివాదాలుసృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తుల్ని కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జఠిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. గత పాలకులు ప్రజల భూమిపత్రాలపైన, సర్వేరాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు. ఆ ఫొటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజ ముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఎపిని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో మ్యూటేషన్ ద్వారా >>2

సౌత్ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

నాలెడ్జ్ ఎకానమీగా ఎపి

దక్షిణ కొరియా సహకారమందించాలి

10జిడబ్ల్యు డేటా సెంటర్ మౌలిక సదుపాయాల్లో భాగస్వామ్యం వహించండి

స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించండి

యువతను ఫ్యూచర్ స్కిల్ వర్క్ ఫోర్స్‌గా మార్చేందుకు సహకరించండి

సౌత్ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉప మంత్రి కామ్సూన్ కాంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు సౌత్‌కొరియా సహకారంఅందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. గురువారంఆయన దక్షిణ కొరియాలో ఐదవ రోజు పర్యటనలో భాగంగా సౌత్ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉప మంత్రి కామ్సూన్ కాంగ్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ యువతను భవిష్యత్తుకు సిద్ధమయ్యే డీప్ టెక్ వర్క్‌ఫోర్స్‌గా తయారుచేయడానికి కొరియా విశ్వవిద్యాలయాలు సహకారం అందించా లనికోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 2029నాటికి 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యానికి మద్దతుగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, పాదరక్షల >>2

వాస్తు కళాకారులకు
ఆరోగ్య పరీక్షలు

సంప్రదాయ కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కళను కాపాడాలంటే ముందు కళాకారుడిని కాపాడాలి

'ఎక్స్' వేదికగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. వాస్తు కళాకారులకు తానిచ్చిన వాగ్దానాన్ని అనుసరించి క్షేత్రస్థాయిలో కళాకారుల కోసం ఆరోగ్య శిబిరాల నిర్వహణ ప్రారంభించినట్లు వివరించారు. ఇటీవల విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. గురువారం 'ఎక్స్' వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణనైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తి పట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకు >>2

నేడు ముంబయికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ 2లో

గోదావరి పరవళ్లు

పోశమ్మ తల్లి గర్భ గుడిని తాకిన వరద నీరు

దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం జులై 9 ప్రభాత వార్త: గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షలకు గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరటంతో గొందూరు గండి పోశమ్మ ఆలయం వద్ద క్రమేపి వరద నీటి మట్టం పెరుగుతూ వస్తుంది. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆలయ ప్రాంగణంలోనికి భారీగా వరద నీరు చేరింది. ఇదిలా ఉంటే ఇంకా గోదావరి పెరగవచ్చు అని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో ఆలయ శిఖరాలను వరద నీరు తాకిన వైనాలు ఉన్నాయి. భక్తుల రక్షణ, భద్రత దృష్యా అమ్మవారి దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మలుగుల శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి నది వరద ఉధృతి తగ్గి, నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టిన తర్వాతే తిరిగి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ వర్గాలు స్పష్టం చేశాయి. దర్శనాలు పునఃప్రారంభమయ్యే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆలయ వర్గాలు తెలిపాయి. అప్పటివరకు భక్తులెవరూ పోశమ్మ తల్లి ఆలయానికి రావద్దని ఆలయ చైర్మన్ ఎమ్. శ్రీనివాస రెడ్డి, మరియు కార్యనిర్వాహణాధికారి ఉమ్మడి ప్రకటనలో భక్తులకు సూచించారు.

ప్రస్తుతం గోదావరి నది ప్రమాదకర స్థాయిల్లో, అతి వేగంగా ప్రవహిస్తోంది. కావున స్థానికులు, భక్తులు, పర్యాటకులు ఎవరూ కూడా గోదావరి నది ఒడ్డుకు గానీ, నది పరివాహక ప్రాంతాల్లోకి గానీ వెళ్లకూడదని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా నది వద్ద నిలబడి ఫోటోలు తీసుకోవడం, సెల్ఫీలు దిగడం వంటి పనులు ప్రాణాంతకమని. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని ఆలయ కమిటీ కోరింది.

నిధులు మంజూరు అయినా నీళ్ల పాలేనా?

పోలవరం నిర్వాసితులు గ్రామాలు ఖాళీ చేసి దాదాపు ఐదేళ్లు కావస్తుంది. అప్పటి నుంచి ఏటా గోదావరి కి వరద వస్తే తల్లి పోశమ్మ నీట మునగ వల్సిందే. భక్తులు మొర విన్న ప్రభుత్వంలో పెద్దలు అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి రూ 207కోట్లు రూపాయలు మంజూరు చేస్తూ ప్రకటన కూడా చేశారు. టెండర్లో జాప్యమో గోదావరికి వరదలు సంభవిస్తే పనులకు ఆటంకం ఏర్పడుతుందని భావించారో ఆలయ నిర్మాణం కాస్త ప్రతిపాదన లోనే ఆగిపోయింది.

గిరిజనుల ఆడపడుచు గా ప్రసిద్ధి చెందిన పోశమ్మ ఆలయం పునఃనిర్మాణం పై ఆలస్యం జరగటం పై గిరిజనులు మండి పడుతున్నారు.నిధులు మంజూరు అయి నాలుగు నెలలు కావస్తున్నా భక్తుల్లో పలు విమర్శలు వస్తున్నాయి. త్వరితగతిన ఆలయ పునఃనిర్మాణం >>2

షుగర్ పేషెంట్లకు శుభవార్త

'అవిక్లీ' వచ్చేసింది

వారానికో ఇంజెక్షన్ తీసుకుంటే చాలు

భారత్ మార్కెట్‌లోకి మెడిసిన్ విడుదల

కొపెన్ హ్యాగన్,జులై 9: మధుమేహం చికిత్సలో కీలక ముందడుగు పడింది. ప్రపంచంలోనే వారానికి ఒక్కసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నార్డిస్క్ 'అవిక్లీ' పేరుతో ఈ ఇన్సులిన్‌ను విడుదల చేసింది. టైప్1, టైప్2 మధుమేహంతో బాధపడే వారికి ఇది ఉపయోగపడనుంది. సాధారణంగా ఇన్సులిన్ తీసుకునే రోగులు రోజూ ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. కొత్తగా వచ్చిన అవిక్లీతో వారానికి ఒక్కసారి ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. దీంతో ఏడాదికి 365 ఇంజెక్షన్ల స్థానంలో కేవలం >>2

గురువారం ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల

రైతుల సమస్యలన్నీ ప్రణాళికతో
పరిష్కరిస్తున్నాం

- రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు
- ఈ ఖరీఫ్ నుంచి పిపి బ్యాగుల వాడకం
- 48 గంటల్లోగా ధాన్యం రవాణా సొమ్ము జమ
- ఎపి పౌర సరఫరాల సంస్కరణలు దేశానికే ఆదర్శం
- 10 శాతం నూకల బియ్యం దేశ వ్యాప్తంగా ప్రజాపంపిణీలో అమలుకు కేంద్రం సన్నద్ధం
- మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ,జులై9.ప్రభాతవార్తప్రతినిధి: ఒకే యేడాదిలో ఖరీఫ్, రబీలో కలిపి రికార్డు స్థాయిలో 74 లక్షల మెటల్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11.50లక్షల రైతుల వద్ద నుంచి ఈ ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొన్న డబ్బులను 24 గంటల్లోపే రైతుల ఖాతాలో జమ చేశామని మంత్రి స్పష్టం చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు గోతాల సమస్య తీర్చేలా సరికొత్త సంస్కరణలు తీసుకువస్తామన్నారు. అలాగే ఎల్‌నినో ప్రభావంపై ఈ నెలాఖరుకు అంచనా వస్తుందని, దాని అనుగుణంగా తదుపరి ప్రణాళికలు సిద్ధం చేస్తామని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల >>2

సుప్రీం చెంతకు సాయికృష్ణ కేసు

సిఐ నాగరాజు కస్టడీలో షరతులు తొలగించాలని సిట్ పిటిషన్

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో నిందితుడు సస్పెండయిన సిఐ నాగరాజు కస్టడీలో షరతుల అంశంపై సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సిఐ నాగరాజును ఇప్పటికే సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపిన ఎపి ప్రభుత్వం నియమించిన సిట్‌కు ఆయన కస్టడీ విషయంలో మాత్రం హైకోర్టులో అనుకున్న రీతిలో తీర్పు రాలేదు. నాగ >>2

'పవర్'లో రాజీలేదు

నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఎల్ నినోతో తగ్గనున్న జలవిద్యుత్ ఉత్పత్తి

పటిష్టంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహించాలి

అధికారులకు ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ విజయానంద్

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా తీర్చడంతో పాటు, ఆలస్యమైన నైరుతి రుతుపవనాలు, సాధారణం కంటే గణనీయంగా తక్కువగా నమోదైన వర్షపాతం నేపథ్యంలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యుత్ సంస్థలను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతఅని విజయానంద్ పునరుద్ఘాటించారు. సమర్థవంతమైన వనరుల నిర్వహణ, అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించడం, >>2

వెనెజులాలోని లాగ్వైరాలో అమెరికా మానవతా సహాయాన్ని అందుకుంటున్న భూకంప బాధితులు

ప్రణాళికతో పరిష్కరిస్తున్నాం

>> ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి,ట్రాక్,ట్రేస్ విధానం ద్వారా రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు.గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

దేశం మెచ్చిన సంస్కరణలు

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్ర సంస్కరణలను అభినందించి దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు నిర్ణయించడం మనం సాధించిన అతి పెద్ద విజయం. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు అందించే బియ్యం(పీడీఎస్) లో 10 శాతం మాత్రమే నూకలు (బ్రోకెన్ రైస్) వచ్చేలా, బియ్యం నాణ్యంగా ఉండేలా రాష్ట్రం తీసుకున్న నిర్ణయం కేంద్రాన్ని ఆకర్షించింది. దీనివల్ల ప్రజా పంపిణీలో అందిస్తున్న బియ్యం నాణ్యత పెరిగి, వాడకం అధికం అవుతుంది. గతంలో 25 శాతం నూకలు వచ్చే బియ్యం పంపిణీ జరిగేది. దీంతో విరిగిపోయిన బియ్యం ప్రజలు తినేందుకు, తీసుకునేందుకు ఇష్టపడేవారు కాదు. ఫలితంగా బియ్యం పక్కదారి పట్టేవి. అయితే రాష్ట్రంలో తీసుకొచ్చిన 10 శాతం నూకలు ఉండే బియ్యం విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇటీవల కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అడిగిన వెంటనే కేంద్రం అందిస్తున్న సాయం కూడా పౌర సరఫరాల శాఖ సేవలను మరింత మెరుగుపరుస్తోందన్నారు.

'పవర్'లో రాజీలేదు

>> థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణను పటిష్ఠంగా అమలు చేయడం, అన్ని విద్యుత్ సంస్థల మధ్య సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించగలమనే పూర్తి విశ్వాసాన్ని విజయానంద్ వ్యక్తం చేశారు.

ఎపిజెన్‌కో ఇంచార్జ్ మేనేజింగ్ డైరెక్టర్, ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, ఎపిజెన్‌కో డైరెక్టర్లు ఎం.సుజయ్ కుమార్, పి.అశోక్ కుమార్ రెడ్డి, వి.ఉషా, ఎపిసిపిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో హైడల్ విద్యుత్ ఉత్పత్తిపై నైరుతి రుతుపవనాల మందగమనంతో పాటు తక్కువ వర్షపాతం తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన పేర్కొన్నారు. గత యేడాది ఇదే కాలంలో రోజుకు 25 నుంచి 30 మిలియన్ యూనిట్ల వరకు హైడల్ విద్యుత్ ఉత్పత్తి జరిగిందని, ప్రస్తుతం జలాశయాలకు తగినంత నీటి ప్రవాహం లేకపోవడంతో అది రోజుకు కేవలం 5 నుంచి 6 మిలియన్ యూనిట్లకు మాత్రమే పరిమితమైందన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సిఇఎ) అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసిందని, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విద్యుత్ సంస్థలు వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత వివేకంతో వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఉండే పీక్ అవర్స్‌లో మాత్రమే హైడల్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీనివల్ల నీటి నిల్వలను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు విద్యుత్ వ్యవస్థ స్థిరత్వాన్ని కూడా కాపాడవచ్చన్నారు. హైడల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గనున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమవుతుందని ఆయన స్పష్టం చేశారు. వార్షిక మరమ్మతులు (ఓవర్‌హాల్) జరుగుతున్న యూనిట్లు మినహా మిగిలిన అన్ని థర్మల్ యూనిట్లను పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలని ఎపిజెన్‌కోను ఆదేశించారు. ప్లాంట్ అవైలబిలిటీ ఫ్యాక్టర్, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ముందస్తు నిర్వహణ చర్యల ద్వారా ఆకస్మిక అంతరాయాలను తగ్గించి, గరిష్ఠ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వల పరిస్థితిని కూడా సమీక్షించిన విజయానంద్, ప్రతి విద్యుత్ కేంద్రంలో కనీసం పది రోజుల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్ల కింద బొగ్గు సరఫరా, రైల్వే రేకుల కేటాయింపు, రైలుసముద్ర రవాణా సమన్వయం, పోర్టుల ద్వారా సరఫరా తదితర అంశాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా చూడాలని సూచించారు.

ఎఇఇ నియామకాలు పూర్తిగా మెరిట్ ఆధారంగానే:

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి 25.06.2026న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, మెరిట్ ఆధారంగానే నిర్వహించబడుతుందని ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్ హెచ్ఆర్‌డి) సూర్యసాయి ప్రవీణ్ చంద్, స్పష్టం చేశారు. ఈ నియామకాలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటివరకు సుమారు 23 వేల దరఖాస్తులు అందాయని తెలిపారు.

ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

>> వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం. డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూముల్ని కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యల్ని పరిష్కరించాం అని సిఎం అన్నారు.

వారు రాసింది రక్త చరిత్ర మాది అభివృద్ధి సంకల్పం

"రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్సు ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాయలసీమలో తయారైన ఎన్ ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయి. రూ.40 వేల కోట్లు ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా మారుతుంది. నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్‌లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు. వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంది. రాయలసీమలో వారు రక్త చరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నాం. ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా అదే వారికి చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్య, జీవన ప్రమాణాలు అందించాలని ఆలోచన చేస్తున్నాం అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

హే రామ్ అంటూ రావణుడికి సమర్ధనా?

"కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తోంది. గంజాయి బ్యాచ్‌ను, బ్లేడ్ బ్యాచ్‌లను, రౌడీయిజాన్ని వైసిపి ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో విధ్వంసం చేస్తోంది. అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసినా గత పాలకులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత పాలకులు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. ఇలాంటి ఘోరాలు చాలా చేశారు. ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోనిలో శివాలయంలోని దీపంలో ఓ దుర్మార్గుడు సిగరెట్ వెలిగించి అపచారం చేశాడు. వెంటనే కేసు పెట్టి నిందితుడ్ని అరెస్టు చేశాం. మత విద్వేషాలు రగిలించేలా ఎవరు దుశ్చర్యకు పాల్పడినా కూటమి ప్రభుత్వం క్షమించదు. సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాల్ని దూషిస్తాడు, మన రాముడిని, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని, పాకిస్తాన్ ను సమర్ధిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్ధిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడ్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలీడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసిపికి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తున్నాడు. బ్రతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం చంద్రబాబు పరిశీలించారు. వెదురుతో తయారు చేసిన ఆభరణాలను సిఎం ఆసక్తిగా పరిశీలించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరిట మార్కెటింగ్ చేయాలని సిఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎన్.ఎం.డి. ఫరూఖ్, బిసి జనార్దన్ రెడ్డి, నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, భూమా అఖిలప్రియ, గిత్త జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి, గౌరు చరితారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా,తదితరులు పాల్గొన్నారు.

'అవిక్లీ' వచ్చేసింది

>> 52 వేసుకుంటే చాలు. రోజూ సూది తీసుకోవాలనే భయంతో చాలామంది ఇన్సులిన్‌ను ఆలస్యంగా ప్రారంభిస్తుంటారని, ఈ సమస్యకు కొత్త చికిత్స ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో ప్రస్తుతం దాదాపు 10.1 కోట్లమంది మధుమేహంతో బాధపడుతున్నారు. మరో 13.6 కోట్ల మందిలో ప్రీ డయాబెటిస్ లక్షణాలు ఉన్నాయి. తొమ్మిది లక్షల మందికిపైగా టైప్1 మధుమేహ రోగులు ఉన్నారు. టైప్ 2 మధుమేహంతో బాధపడేవారిలో కూడా కొంతమందికి ఇన్సులిన్ తప్పనిసరిగా అవసరం అవుతోంది. ఈ ఇన్సులిన్‌ను ఫ్లెక్స్‌టచ్ పెన్ ద్వారా వారానికి ఒక్కసారి తీసుకోవాలి. ఇలా తక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి రావడంతో చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించే అవకాశం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే సామర్థ్యంలో ఇది రోజూ తీసుకునే ఇన్సులిన్‌తో పోలిస్తే మెరుగైన ఫలితాలు ఇచ్చినట్లు క్లినికల్ పరీక్షల్లో తేలిందని కంపెనీ వెల్లడించింది. భద్రత విషయంలో కూడా ఇదే స్థాయి ఫలితాలు నమోదయ్యాయని తెలిపింది.

సాయికృష్ణ కేసు

>> రాజును కృష్ణలంక స్టేషన్‌లో విచారించడానికి అనుమతిస్తూనే రిమాండ్‌నుంచి అతన్ని కస్టడీకి తరలించే సందర్భంలో వీడియో తీయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో సిఐ నాగరాజు కస్టడీపై వారు ఇప్పుడు సుప్రీంకోర్టులో అప్పీల్‌కు సిట్ సిద్దపడింది. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ఈ కేసులో కీలకంగా కానున్నది. పాత నేరస్తుడు గాదె సాయి కృష్ణను లాకప్‌డెత్ చేసి, శవాన్ని సైతం కాల్చేశారని ఆరోపణలు వచ్చాయి. కృష్ణలంక సిఐ నాగరాజు ఈ కేసులో ప్రధాననిందితుడిగా ఉన్నారు. అయితే ఆయన్ను తొలుత అరెస్టు చేయని ప్రభుత్వం.. ఆ తర్వాత తీవ్ర విమర్శలు రావడంతో అరెస్టు చేయక తప్పలేదు. ఆ తర్వాత సిట్ అధికారులు నాగరాజును కస్టడీకి ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు సీఐ నాగరాజును కస్టడీలో విచారించే విషయంలో పలు షరతులు పెట్టింది. విచారణ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేయాలని సిట్‌ను ఆదేశించింది. అలాగే విచారణ సమయంలో నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. నాగరాజును ఒక రోజు కృష్ణ లంక పీఎస్‌లో, మిగిలిన రోజులు రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే విచారించాలని ఆదేశించింది.

వారం - వర్జ్యం

10-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
దశమి ఉ.8.16, ఏకాదశి తె.5.22
భరణి మ.1.11
వర్జ్యం : రా.12.06-రా.1.33
దు.ఉ.8.17-ఉ.9.09,
(2) మ.12.38-మ.1.30
రాహుకాలం - ఉ.10.30-12.00

వార్తాఫలం

మేషం: మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

వృషభం: పాతబాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి. అన్యభాషలను అభ్యసించారు. తద్వారా లాభపడతారు.

మిథునం: మొండి వ్యవహారాలను కాలానికి వదిలి వేస్తారు. చికాకు కలిగించే పరిస్థితులకు దూరంగా పారిపోకుండా వుంటారు.

కర్కాటకం: బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

సింహం: అంతర్గతంగా వేదాంత ధరణి అలవరచుకుంటారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

కన్య : వలుకుబడి ఉన్నవారితో పరిచయాలు ఏర్పడుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

తుల : చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

వృశ్చికం: జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. దేవాలయాల సందర్శనం.

ధనుస్సు: గతము కన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా వుంటాయి. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు.

మకరం: ఎదుటివారి సంభాషణలలోని నిజా నిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహన సౌఖ్యం.

కుంభం: భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం తగదు.

మీనం: మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా వ్యవహరిస్తారు. వస్త్రలాభం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

బనగానపల్లె ప్రజావేదిక సభవద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి జనార్దన్

నాలెడ్జ్ ఎకానమీగా ఎపి

>> తయారీ, నౌకా నిర్మాణ రంగాల్లో కొరియా నైపుణ్య సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి పరిశోధనలకు సహకారం అందించాలి:

స్టూడెంట్/ ఫ్యాకల్టీ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు, కరిక్యులమ్ డెవలప్ మెంట్ కోసం ఆంధ్రప్రదేశ్ - కొరియా విశ్వవిద్యాలయాలను అనుసంధానించాలి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థలు, ఎఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లీన్‌టెక్, హెల్త్‌టెక్ రంగాలలో సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై పరస్పరం సహకరించుకోవాలి. 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్' అనే ఎపి దార్శనికతను ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్‌టిఐహెచ్, యూనివర్సిటీలు - సౌత్ కొరియా పరిశోధనా సంస్థలు, ఆవిష్కరణల కేంద్రాల (మాగోక్ సైన్స్ పార్క్, నానో ఫ్యాబ్ సెంటర్ వంటివి) నడుమ ఉమ్మడి పరిశోధన, అభివృద్ధికి సహకారం అందించండి.

ఎపిలో కొరియా పారిశ్రామిక పార్క్ ఏర్పాటుచేయండి:

ఆంధ్రప్రదేశ్‌లోని కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా ఒక కొరియా పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయండి. ఇందుకు అవసరమైన భూమిని ఎపిఐఐసి ల్యాండ్ బ్యాంకు ద్వారా అందిస్తాం. ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయాలు, ప్రత్యేక సింగిల్‌విండో క్లియరెన్స్ యంత్రాంగం, ఆర్థిక ప్రోత్సాహకాలు, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ కనెక్టివిటీ వంటి పటిష్టమైన, ప్రత్యేక విధాన ప్యాకేజీతో పాటు, పూర్తిస్థాయి సౌకర్యాల కోసం ఒక కొరియాడెస్క్‌ను ఎపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 10జిడబ్ల్యు సామర్థ్యం గల డేటాసెంటర్ ప్రాజెక్టులను అమలు చేయడానికి అవసరమైన ఇంధన మౌలిక సదుపాయాల ప్రణాళికలు, నియంత్రణ విధానాలను రూపకల్పనలో సహకరించేలా రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రభుత్వంతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కోరుతున్నామన్నారు.

గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం:

ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే సుమారు 14 జిడబ్ల్యు పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2030 నాటికి 160 జిడబ్ల్యు సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతదేశ 500 జిడబ్ల్యు జాతీయ లక్ష్యంలో సుమారు 32కి సమానం. సోలార్, పవన శక్తి, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ విద్యుత్ ఉత్పత్తి తయారీ రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు ఎస్‌కె ఎనర్జీ, ఎల్‌జి ఎనర్జీ, హన్వాహ వంటి కొరియా సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నాం. సౌత్ కొరియాప్రాంతం /ఆగ్నేయాసియాలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన లాజిస్టిక్స్, జలరవాణా, నౌకా నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దడమే మాధ్యేయం, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు మౌలిక సదుపాయాలు, సుస్థిరాభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన కొరియా వ్యూహాత్మక ప్రణాళిక సహకారాన్ని కోరుకుంటున్నామన్నారు.

హస్త కళాకారులకు ఆరోగ్య పరీక్షలు

>> న్నాయన్నారు. యేళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలీయంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సిఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. గురువారం ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేతకార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎపిలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే ముందు కళాకారుడిని కాపాడాలి అని 'ఎక్స్'లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

నేడు ముంబయికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి: రెండు భుజాల దగ్గర ఉన్న సమస్య రీత్యా శస్త్ర చికిత్స నిమిత్తం పవన్ కల్యాణ్ శుక్రవారం ముంబైకి వెళ్లనున్నారు. శస్త్రచికిత్స అనంతరం సుమారు 30 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఇటీవల పవన్ తన సతీమణి అన్నా కొణిదెలతో కలిసి ముంబాయి వెళ్లారు.అక్కడి ప్రముఖ కోకిలాబెన్ ఆస్పత్రిలో ఆయన తన భుజాలకు సంబంధించిన సమస్యలకు పరీక్షల చేయించుకున్నారు. అక్కడి వైద్యులు ఆయనకు అత్యవసర శస్త్రచికిత్సను సూచించారు.వాస్తవానికి వైద్యులు అదే రోజు శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేసారు.దాంతో ఆయన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తరువాత శస్త్రచికిత్స చేయించుకుంటానని అక్కడి వైద్యులకు తెలిపారు.వారి సూచనలతో ఆయన రాష్ట్రానికి చేరుకుని వివిధ కార్యక్రమాలను పూర్తి చేసారు.పంచాయతీరాజ్ పరిధిలో చేపట్టిన సంస్కరణలు ,అటవీశాఖలో హనుమాన్ ప్రాజెక్ అమలు, గంజాయి సాగు నిర్మూలన, కలప స్మగ్లింగ్ నియంత్రణ తదితరంశాలపై అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు వీలుగా పలు సమావేశాలు నిర్వహించారు.క్షేత్రస్థాయి నుంచి వివిధ స్థాయిల నాయకులకు దిశానిర్దేశం చేసారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా కార్యకలాపాల వేగవంతం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుని కార్యచరణ బాధ్యతలను మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, శాసనమండలి చీఫ్ విప్ పిడుగు హరిప్రసాద్ తదితరులకు అప్పగించారు.శస్త్ర చికిత్స అనంతరం ఆయన వైద్యుల సూచనలకు అనుగుణంగా వ్యవహరించనున్నారు.

గోదావరి పరవళ్లు

>> చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆదరణ తగ్గి ఆదాయం కోల్పోయి

గొందూరు గిరిజనుల ఆడపడచుగా బహు ప్రాచుర్యం పొందిన పోశమ్మ తల్లికి రాష్ట్రం నలు మూలల భక్తులు కూడా ఎక్కువే. గమనించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ 1991లో తన ఆదీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి ఆలయ చైర్మన్, ఆలయ మేనేజర్‌ను నియమిస్తూ ఆలయమును అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదాయం పెంచుకుంటూ తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకుంది. పోలవరం ప్రాజెక్టుతో గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా భక్తుల్లో ఆదరణ తగ్గి వివిధ రూపాల్లో ఆదాయాన్ని గణనీయంగా పెంచుకున్న అమ్మవారు ప్రాజెక్టుతో ఆదాయాన్నికోల్పోయింది. మరలా అమ్మవారికి పూర్వవైభవంరావాలని భక్తులు కోరుకుంటున్నారు.

బిజెపిలో చేరిన టిఎంసి మాజీ రాజ్యసభ ఎంపీలు

కోల్‌కత్తా,జులై 9: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మరో షాక్ తగిలింది. తృణమూల్ కాంగ్రెస్ మాజీ రాజ్యసభ సభ్యులు సుష్మితా దేవ్, సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్ గురువారం కోల్‌కతాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పరాజయం అనంతరం ఈ ముగ్గురు రాజ్యసభ సభ్యులు పార్టీకి రాజీనామా చేశారు. వారి అనుభవం రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తుందని సమిక్ భట్టాచార్య పేర్కొన్నారు. ఈ పరిణామంపై టీఎంసీ సీనియర్ నేత సౌగత రాయ్ స్పందిస్తూ వారు ముందే బీజేపీ వైపు ఉన్నారు. రాజ్యసభ అవకాశం కోసం పార్టీ మారారు. దీంతో టీఎంసీకి ఎలాంటి నష్టం లేదు. బీజేపీకి కూడా పెద్దగా లాభం ఉండదని భావిస్తున్నామని వ్యాఖ్యానించారు.

భారతీయ సమాజమే బలమైన స్తంభం

>> నరేంద్ర మోడీ అన్నారు. 2014లో 28యేళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటించిన తొలి భారత ప్రధానమంత్రి తానేనని గుర్తుచేసుకున్న మోడీ, తన తాజా పర్యటనను 12 యేళ్లలో 'హ్యాట్రిక్' పర్యటనగా అభివర్ణించారు. భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయో ఈ తరచు పర్యటనలు సూచిస్తున్నాయని అన్నారు. భారత్, ఆస్ట్రేలియాలను దగ్గర చేయడంలో తన పాత్ర కంటే ప్రవాస భారతీయుల పాత్ర మరింత గొప్పదని ప్రధాని మోడీ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సమాజం తమ కృషి, సేవల ద్వారా భారతదేశ ప్రతిష్టను పెంచుతోందని అన్నారు.

ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌కు మోడీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అల్బనీస్‌ను 'భారతదేశానికి మంచి మిత్రుడు'గా అభివర్ణించారు. ఆయనతో కలిసి ఈకార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చిందని అన్నారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం నుంచి మెల్‌బోర్న్‌లోని ప్రసిద్ధ క్రికెట్ వేదిక వరకు ఇద్దరు నాయకులు కలిసి ఎన్నో గుర్తుండిపోయే క్షణాలను పంచుకున్నారని ప్రధాని పేర్కొన్నారు. భారతీయ సమాజాన్ని ఉద్దేశించి అల్బనీస్ చేసిన ప్రసంగాన్ని కూడా ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రస్తావిస్తూ, ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం జరిపిన దాడుల ప్రభావం దాని సరిహద్దులకు ఆవల కూడా చాలా దూరం వరకు వ్యాపించిందని అన్నారు. ఉగ్రవాద శిబిరాలలో జరిగిన పేలుళ్లు 'ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించాయని', ఉగ్రవాదంపై దృఢంగా వ్యవహరించడానికి, తన జాతీయ భద్రతను కాపాడటానికి భారతదేశానికి ఉన్న సంకల్పాన్ని ఇది స్పష్టం చేస్తుందని ఆయన అన్నారు.

దేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా మారే దిశగా స్థిరంగా పయనిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. ప్రతి విజయం మరింత పెద్ద ఆశయాలకు దారితీస్తుందని, ఆధునిక భారతదేశం 'మరింత ఎదగండి, మరింత సాధించండి' అనే నినాదాన్ని విశ్వసిస్తుందని ఆయన అన్నారు.

భారతదేశాన్ని 140 కోట్ల ఆకాంక్షల దేశంగా అభివర్ణిస్తూ, దేశ ప్రజల కలలు, సంకల్పమే దేశ పురోగతికి చోదకశక్తిగా ఉందని మోడీ అన్నారు.

అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి పరస్పర అనుసంధానమైన అంశాలని పేర్కొన్న ఆయన, గత విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత ఉన్నత లక్ష్యాలతో భారత్ ముందుకు సాగుతోందని చెప్పారు. 'మరింత అభివృద్ధి చెందండి.. మరింత సాధించండి' అనే దృక్పథంతో దేశం కొత్త పారిశ్రామిక పునాదిని నిర్మిస్తోందని ప్రధాని తెలిపారు. చిప్స్ నుంచి ఓడల వరకు విస్తరించిన ఆధునిక తయారీ పర్యావరణ వ్యవస్థను భారత్ రూపొందిస్తోందని, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడానికి వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు.

10-7Pg3exHMNWJQEG.qxdo/p:10-7Pg3exHMNWJQEG.qxd 1/1/02 6:16 AM Page 1

ఎపిలో ఇంటిగ్రేటెడ్ ఇవి, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని విస్తరించండి

సౌత్ కొరియా విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: పెట్టుబడుల సాధన కోసం దక్షిణ కొరియాకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్ పలు కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అవుతూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఐదవ రోజు పర్యటనలో భాగంగా సియోల్‌లో కియా మోటార్స్ ఉన్నత స్థాయి బృందంతో మంత్రి సమావేశమయ్యారు. కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హాన్‌లీ, ఇతర ఉన్నతస్థాయి బృందంతో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, కియా మోటార్స్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన పిబివి వాహనాలతో సహా ఇంటిగ్రేటెడ్ ఇవి, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఎపిలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్లకు సేవలందించడానికి విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సికెడి అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి. ఇ-జిఎం పి ప్లాట్‌ఫామ్ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌లు, ఇవి ఛార్జింగ్ ఎలక్ట్రానిక్స్ కోసం ఒక ఇవి కాంపోనెంట్ల తయారీ కేంద్రాన్ని స్థాపించండి. పవర్‌ట్రెయిన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, వెహికల్ హోమోలోగేషన్ కోసం ఒక ఇజీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ మాట్లాడుతూ కియా మోటార్స్ ప్రయాణీకుల, వాణిజ్య, వినోద వాహనాల తయారీతోపాటు 'ప్లాన్ ఎస్', ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్ ఇనీషియేటివ్, ఇవి, అటానమస్ మొబిలిటీని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. మాతృసంస్థ హ్యుందయ్ మోటార్స్ తర్వాత దక్షిణ కొరియాలో రెండో అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థగా కియా మోటార్స్ అవతరించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ ప్లానింగ్) యూయ్ చల్ జియోంగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) సాంగ్ ఉన్ చో, వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ ఆపరేషన్స్) హీ సామ్ కిమ్, వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే కున్ యాంగ్, కియా ఇండియా సీనియర్ లీగల్ అడ్వయిజర్ జుంగో యాన్ , ప్రిన్సిపల్ అడ్వయిజర్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ. సిసిలియా చుంగ్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

కొరియన్ పెట్టుబడిదారులకు నమ్మకమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్: సౌత్ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్ ను అత్యంత స్థిరమైన, నమ్మకమైన కేంద్రంగా చేసుకునేలా పరిశ్రమదారులను ప్రోత్సహించాలని కోరారు. ఎపిలో అందించే పన్నురాయితీలు, తక్కువధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమదారులకు మద్దతుగా నిలుస్తాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తూర్పుతీరంలో సురక్షితమైన, నమ్మకమైన, స్నేహపూర్వక ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది. దీనివల్ల ప్రపంచ సప్లయ్ చైన్ నష్టాలను కూడా తగ్గించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. కేవలం భారీ పరిశ్రమలేకాకుండా గ్రీన్ ఎనర్జీ, వినియోగ వస్తువులు, మోడరన్ రిటైల్, టూరిజం, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కొరియన్ పెట్టుబడులకు ఎపి స్వాగతం పలుకుతోంది. ఫ్యాక్టరీల ప్రారంభానికి ముందే కొరియన్ వర్క్ స్టాండర్డ్స్, లాంగ్వేజ్, కల్చర్ పై స్థానిక యువతను సిద్ధం చేసేందుకు దక్షిణ కొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలను ఏర్పాటుచేసేందుకు ఆంధ్రప్రదేశ్ విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలు సంసిద్ధంగా ఉన్నాయి. ఎపిలో కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలి అని లోకేష్ కోరారు.

భారత్– కొరియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుబంధంగా ప్రత్యేకమైన ఆంధ్రప్రదేశ్– కొరియా ఇన్వెస్ట్ మెంట్ డెస్క్, ఇరు ప్రాంతాల నడుమ వార్షిక ఆర్థిక భాగస్వామ్య చర్చలకు చొరవ చూపండి. శాశ్వత వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, విశాఖపట్నం – బుసాన్/ ఇంచియాన్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీల్లో కొరియన్ లాంగ్వేజ్ సెంటర్లు, డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీకి చొరవ చూపాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సౌత్ కొరియా రాజకీయ వ్యవహా రాలు, విదేశాంగశాఖ ఉప మంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌ను సమావేశానంతరం మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున సత్కరించి, జ్ఞాపికను అందజేసారు.

ఎపిలో డిస్ ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: సెమీకండక్టర్స్, ఒఎల్ఇడి, పెరోవ్‌స్కైట్ డిపాజిషన్ పరికరాల తయారీలో పేరెన్నికగన్న సునిక్ సిస్టమ్ కో లిమిటెడ్ (సౌత్ కొరియా) సిఇఒ ఎస్.డబ్ల్యు. చుంగ్, సంస్థ ఉన్నతస్థాయి బృందంతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ డిస్ ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎపిలో యూనిట్ ఏర్పాటుకు ముందుకు వస్తే జాయింట్ వెంచర్ కోసం సహకారం అందిస్తాం. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0తోపాటు ఎపి సెమీ కండక్టర్, డిస్ ప్లే ఫ్యాబ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు అందిస్తాం. 'సెమీకాన్ టెక్' పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడానికి, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయాలని కోరారు. సునిక్ సిస్టమ్స్ సిఇఒ ఎస్.డబ్ల్యు. చుంగ్ మాట్లాడుతూ మూడు విభాగాలలో వాక్యూమ్ థిన్‌ఫిల్మ్ డిపోజిషన్ పరికరాలను తాము తయారు చేస్తున్నట్లు చెప్పారు. తమ ఉత్పత్తుల్లో ఒఎల్ఇడి డిస్‌ప్లే ఎవాపరేషన్ (ఎఎంఒఎల్ఇడి, ఎల్ఇడిఒఎస్, 8.6జెన్), స్పుటర్ / సివిడి / ఎచర్ / థిన్‌ఫిల్మ్ ఎన్‌క్యాప్సులేషన్ ప్రాసెస్ మాడ్యూల్స్, పెరోవ్‌స్కైట్ సోలార్, డిస్‌ప్లే డిపోజిషన్ పరికరాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎపిలో తమ సంస్థ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సునిక్ సిస్టమ్స్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ జెహెచ్ లీ, సేల్స్ జనరల్ మేనేజర్ హెచ్.వై. చో, సిఎస్‌సిఒ కెసి మ్యూన్, మీడియా ఇన్ఫోకామ్ సిఇఒ సెహోన్ చో, క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్ సిటిఒ డాక్టర్ రమణారావు మాగంటి పాల్గొన్నారు.

తిరుమల సమాచారం

ఆణివార ఆస్థానానికి ఆలయం ముస్తాబు

తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: ఆణివార ఆస్థానం పురస్కరించుకుని తిరుమలలో ఆలయం పరిసరాలు, ఆలయ మహాద్వారం గేట్ తదితర వాటిని ప్రకృతి సిద్ధమైన రసాయనాలతో శుద్ధిచేస్తున్నారు. ప్రతి ఏటా ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలలో ఆలయం పూర్తిగా ఇలా గేట్లను, ఇనుపచువ్వలను శుభ్రం చేస్తారు. నాలుగు మాఢవీధులను అందంగా తీర్చిదిద్దుతారు. రంగవల్లులు వేసి భక్తులను ఆకట్టుకునేలా చేస్తారు. గురువారం ఆలయం మహాద్వారం గేట్లను కార్మికులు రసాయనాలతో శుద్ధిచేయడం జరిగింది. దీనివల్ల తుప్పుపట్టి నల్లగా మారిన అవన్నీ తళతళ మెరుస్తాయి.

రూ.13.90 కోట్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల విడుదల

టిటిడి పాలకమండలికి ఉద్యోగుల ధన్యవాదాలు

తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 13.90 కోట్ల రూపాయలు మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ల విడుదల కానుంది. ఇందుకు టిటిడి బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని టిటిడి స్టాఫ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటీయూ) హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు విడుదలకు సానుకూలంగా పరిశీలించి, ఉద్యోగులు విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడుకి, ఇఒ ముద్దాడ రవిచంద్రకి యునైటెడ్ ఫ్రంట్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో అమలులో ఉన్న 3 లక్షల రూపాయలు రీయింబర్స్‌మెంట్ పరిమితి కారణంగా నిలిచిపోయిన సుమారు 13.90 కోట్ల రూపాయలు క్లెయిమ్‌లను విడుదల చేయాలని తీసుకున్న నిర్ణయంతో ఐదువేలమందికి పైగా శాశ్వత ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు నేరుగా లబ్ధి పొందనున్నారు. త్వరలోనే ఈ మొత్తాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుండటం ఎంతో సంతోషకరమన్నారు. అదేగాక మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు అయ్యే అదనపు వైద్య ఖర్చులను కార్యనిర్వహణాధికారి (ఇఒ) ఆమోదంతో, ఐదులక్షలకు మించిన వైద్య ఖర్చులను టిటిడి ట్రస్టు బోర్డు ఆమోదంతో రీయింబర్స్ చేయాలని తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు మరింత బలాన్నిస్తుందన్నారు. ఈ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమ దిశగా తీసుకున్న అత్యంత కీలకమైన చర్యగా భావిస్తున్నారు. ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నాయకత్వంలో దాదాపు 8 వేల మంది ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులకు సంబంధించిన ఇళ్ల స్థలాల సమస్యతో పాటు ఇతర సంక్షేమ సమస్యలు కూడా త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రత, గౌరవప్రదమైన జీవనానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో టిటిడి యాజమాన్యం ఇదే సానుకూల వైఖరిని కొనసాగించాలని స్టాఫ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటీయూ) ఆకాంక్షించింది.

అలిపిరి వద్ద భక్తులకు విసుగుపుట్టిస్తున్న రాజకీయ ప్లెక్సీలు

తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఎంతో భక్తిభావంతో పవిత్రంగా తిరుమలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా స్వాగతం ఉండాల్సింది పోయి వికారం పుట్టించేలా పలు రకాల ప్లెక్సీలు, బ్యానర్లు మయంగా మారింది. ఈ ప్రాంతం పూర్తిగా టిటిడి ఆధ్వర్యంలో ఉన్నా పట్టించుకుని పవిత్రతను కాపాడాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఏదో ఒక రకంగా అలిపిరి గరుడ విగ్రహం పరిసరాల్లో చుట్టూ రాజకీయ నేతల ప్లెక్సీలు, ఉద్యోగుల ప్లెక్సీలు, బ్యానర్లు వెలుస్తున్నాయి. వీటిని 24గంటల్లో తొలగించాల్సిన నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం, టిటిడి పారిశుధ్యవిభాగం పట్టించుకోవడంలేదు. ఈ కారణంగా తిరుమలకు భక్తిభావంతో, ఆధ్యాత్మికతతో వస్తున్న భక్తులకు ఈ ప్లెక్సీలు వికారం కలిగిస్తున్నాయి. తిరుమల అంటేనే ఒక పవిత్రతకు, ఆధ్యాత్మికతకు నిదర్శనం, అందునా తిరుమలకు ప్రధాన ప్రవేశద్వారం అలిపిరి వద్ద ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా చూడాలి. అయితే ఇందుకు భిన్నంగా రాజకీయ నేతల ప్లెక్సీలు, స్వాగతాలు, పుట్టినరోజు శుభాకాంక్షలు, పదవుల అభినందనలు, ఇతరత్రా మంచిచెడు కార్యక్రమాలకు సంబంధించిన బ్యానర్లు, ప్లెక్సీలు అలిపిరి గరుడవిగ్రహం కూడలి ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. రోజూ తిరుమలకు వచ్చే యాత్రికులు, ఉద్యోగులు, తిరుపతికి దిగే యాత్రికులు వీటిని చూసి ఇదేమి చోద్యమంటూ అసహనం వెలిబుస్తున్నారు. ఎంతో పవిత్రంగా దేవుని దర్శనానికి వస్తే ఇలాంటివి కనిపిస్తుండటంపై భక్తులు నోరుమెదుపుతున్నారు. అలిపిరి ప్రాంతం ఆధ్యాత్మికతకు కేంద్రం,. అలాంటి చోట్ల పలు రకాలుగా అపవిత్రం చేసినా టిటిడి అధికారులు కనీసం స్పందించకపోవడం దేనికి నిదర్శనమనేది అర్థంకావడంలేదు. పైగా కొన్ని ముఖ్యకూడళ్లలో ప్లెక్సీలు.,బ్యానర్లు నిషేధం.అలాంటిది అలిపిరిలో భారీగా ఏర్పాటుచేసినా చర్యలు మాత్రం తీసుకోలేకపోతుండటం విచారకరం.యాత్రికులకు మనోభావాలు దెబ్బతినకుండా చూడటంలో టిటిడి ఇకనైనా మేల్కొనాలని భక్తులు కోరుతున్నారు.

ఆ ముగ్గురి ఘటనల వెనుక వైసిపి

రావణ్, శ్రవణ్, సుగాలి ప్రీతిలపై అంత ప్రేమెందుకో?: జనసేన నేత కిరణ్‌రాయల్

తిరుపతి,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: రావణ్, శ్రవణ్, సుగాలి ప్రీతి ఘటనల వెనుక వైసిపి నాటకాలు ఆడుతోందని, సుగాలి ప్రీతి ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిందే పవన్ కళ్యాణ్ అని జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ పేర్కొన్నారు. ఇప్పటికే వైసిపి ప్రజలను పక్కదారిపట్టించేలా వ్యవహరిస్తోందని, లేనిపోనివి తెరపైకి తీసుకువచ్చి తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గురువారం మీడియాతో మాట్లాడారు. వైసిపి నేతల ట్రాప్ లో పార్వతమ్మ పడిపోయిందని, వైసిపి నాయకుల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. జగన్ 2 అంటే కులాల మధ్య చిచ్చు పెట్టడం, హిందూమతంపై దాడి చేయడమే టార్గెట్‌చేసుకున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ 2పేరుతో రావణ్, శ్రావణ్‌లను ప్రభుత్వ పెద్దలపై రెచ్చగొట్టడమే పనిగా ఉన్నారన్నారు. వైసిపి నేతలకు మరో పనిలేకుండా కావాలనే సుగాలి ప్రీతి అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని ఆయన మండిపడ్డారు. సుగాలి ప్రీతి తల్లి పార్వతమ్మ పవన్ కళ్యాణ్ పై ఫిర్యాదు చేయడమేంటని,రావణ్ వైసిపికి సంబంధం లేదని ఎలా చెబుతారు సిగ్గుండాలని అన్నారు. ఈ వ్యక్తి ఎవరు అన్ని ఫోటోలు ఇతనే ఉన్నాడు ఇప్పుడు చెప్పండని కిరణ్ డిమాండ్ చేశారు. ఎవరికి ఏం సంబంధమని, సుగాలి ప్రీతి కోసం కర్నూలుకి ఆ రోజు లక్షలాదిమంది వచ్చినప్పుడు మేము కూడా చాలామంది కాళ్లు చేతులు విరుచుకొని హాస్పిటల్ లో ఉన్నామన్నారు. ఆరోజు కూడా మేము బాధపడలేదని ,ఈరోజు వైసిపి చేస్తున్న నాటకాలతో బాధపడతున్నామన్నారు.

జంట హత్యల కేసులో తెగని ఉత్కంఠత

కుటంబతగాదాలే కారణంగా దర్యాప్తు

తిరుపతి,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మికనగరం తిరుపతి–తిరుచానూరు మార్గంలోని పద్మావతికల్యాణమండపాల సముదాయంలో జరిగిన జంట హత్యల కేసులో తెగని ఉత్కంఠత సాగుతోంది. ఈ భహత్యకు కుటుంబతగాదాలే కారణంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల వివాదంతో మొదలైన గొడవ చివరకు మధ్యవర్తులను లక్ష్యంగా చేసుకుని పెళ్ళికి హాజరైన వ్యక్తులను పతకం ప్రకారం దారుణంగా దాడిచేసి హతమార్చడం సంచలనంగా మారింది. ప్రశాంత తిరుపతిలో ఒక్కసారిగా రాత్రివేళ ఎవరూ ఊహించని రీతిలో టిటిడికి చెందిన పద్మావతి కల్యాణమడపాల ప్రాంగణంలో ఈ హత్య జరగడం ఘటన సంచలనం సృష్టించింది. పెళ్ళికి హాజరైనట్లు వచ్చి పక్కా పథకం ప్రకారమే ఒక మహిళతోపాటు నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేయడం అక్కడికక్కడే ఘటనాస్థలిలో తిరుపతి జీవకోనకి చెందిన మునిరత్నం యాదవ్(50) ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఇదే ఘటనలో తీవ్రరక్తపుమడుగులో పడి ఆస్పత్రికి తరలించే సమయంలో తిరుపతి సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన మణికంఠ (41) కూడా మృతిచెందడం ఆందోళనకరంగా మారింది. ఈ ఘటనపై రాత్రికిరాత్రే తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యకు పాల్పడిన నిందితులు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం జంగాపల్లికి చెందిన సునీల్‌గా గుర్తించారు. గురువారం పోలీసుల ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెళ్లి వ్యవహారంలో తలెత్తిన వివాదమే ఈ దారుణ హత్యలకు కారణమైందని భావిస్తున్నారు. తిరుమలలో కార్మికురాలుగా పనిచేసే సంపూర్ణమ్మ కుమార్తెను సునీల్ వివాహం చేసుకున్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో సునీల్ భార్యను విడిచి దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో పద్మావతి కళ్యాణ మండపంలో జరిగిన ఓ వివాహానికి సునీల్ వస్తున్నాడని తెలుసుకున్న సంపూర్ణమ్మ అక్కడికి చేరుకుంది. వివాహానికి మధ్యవర్తులుగా వ్యవహరించిన మునిరత్నం, మణికంఠలను పిలిపించి ఈ విషయమై నిలదీసింది. ఒక్కసారిగా అక్కడ తీవ్రస్థాయి లోవాగ్వాదం చోటుచేసుకుంది. తనను నిలదీశారని సునీల్ తండ్రికి సమాచారమివ్వడంతో సునీల్ తండ్రి, తమ్ముడు, అక్కతో పాటు మరో యువకుడు కళ్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. పెళ్లి మండపం నుంచి బయటకు వచ్చిన మునిరత్నం, మణికంఠలపై ముందస్తు ప్రణాళిక ప్రకారం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి నిందితులు పరారయ్యారు. పోలీసులు సునీల్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. హత్యకు దారితీసిన పూర్తి కారణాలపై తిరుపతి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా పరిషత్ సమావేశానికి కూటమి నేతలు హాజరుకాకపోవడం విచారకరం

సమస్యలపై గళమెత్తిన చిన్న శ్రీను

విజయనగరం, జులై 9 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గౌరవ జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమ న్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల సముద్రంలో గల్లంతైన మత్స్యకారులకు జడ్పీ ఛైర్మన్ చిన్న శ్రీను ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సభలో సభ్యులతో కలిసి రెండు నిమిషాల మౌనం పాటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి తగిన సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా ప్రజా సమస్యలపై జరిగిన చర్చలో చిన్న శ్రీను మాట్లాడుతూ, జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న అత్యంత ముఖ్యమైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కూటమి ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం బాధాకరమని అన్నారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ఉన్న ప్రజాప్రతినిధులు సమావేశాలకు దూరంగా ఉండటం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువులు, విత్తనాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీటి సమస్యల కారణంగా పలు ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందక ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు పడుతున్న ఇబ్బందులను సమావేశంలో ప్రస్తావించారు. అదేవిధంగా రెండేళ్లుగా హౌసింగ్, సామాజిక భద్రతా పెన్షన్ల కోసం వేలాది మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని, ఉపాధి హామీ పథకం అమలులో చోటు చేసుకుంటున్న పలు అవకతవకలపై కూడా సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారని తెలిపారు. జిల్లా రైతాంగం, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంవీడి ప్రజలకు మెరుగైనసేవలు అందించాలని చిన్న శ్రీను సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఈ.నాగలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

సనాతన ధర్మంపై దాడులను సహించబోం

మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త: హిందూ మతం, సనాతన ధర్మం, భారతీయ సంస్కృతిపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఖిఎక్స్‌ఖి వేదికగా ఆయన స్పందిస్తూ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. రావణ్, ప్రకాశ్ రాజ్ వంటి వారు ఎక్కడి నుంచి వస్తున్నారని, వారికి మద్దతు ఇస్తున్నది ఎవరు, వారు ఏ సంస్కృతికి వారసులని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరూ ఈ విషయాలపై ఆలోచించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, హిందూ మతం, దేవతలు, దేశంపై ఎలాంటి అవమానకర వ్యాఖ్యలు చేసినా వాటిని తీవ్రంగా పరిగణించాలని, అలాంటి వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టాలను సవరించి కఠిన శిక్షలు అమలు చేయాలని సూచించారు. బలవంతపు, ప్రలోభపూరిత మత మార్పిడులను ప్రోత్సహించడం, భారతీయ సంస్కృతిపై దాడి చేయడం కొందరికి అలవాటుగా మారిందని ఆరోపించిన విజయసాయిరెడ్డి, ఇలాంటి చర్యలను మతపరమైన ఉగ్రవాదంగా పరిగణించాలని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రావణ్, ప్రకాశ్ రాజ్‌లను సమర్థించడం హిందుత్వం, సనాతన ధర్మం, దేశంపై జరుగుతున్న దాడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా ఈ అంశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తన పోస్టులో కోరారు.

నిర్దేశిత గడువులోగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పూర్తి కావాలి

తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు

టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నందున అధికార యంత్రాంగం ఇప్పటినుండే సంసిద్ధత కావాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు. ఏడుకొండలస్వామి ఉత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు ప్రతి రోజూ ఉదయం 8గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలు కూడా రద్దవుతాయన్నారు. విజిలెన్స్, పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్ మ్యాప్ లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీవారికి సెప్టెంబర్, అక్టో బర్‌లో జరిగే బ్రహ్మోత్సవాలపై తిరుమలలో పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో గురువారం అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తిరుపతి జెఇఒ డాక్టర్ ఎ.శరత్,సివిఎస్ఒ మురళీకృష్ణ,ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, తిరుమల అడిష నల్ ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే ఏర్పాట్లపై విభాగాల వారీగా సమీక్షి ంచి పలు సూచనలు చేశారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. సాధారణంగా సెప్టెంబర్ మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారు చేస్తారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 15వతేదీ నుండి 23వరకు ,తిరిగి అక్టోబర్ 11నుండి 20వతేదీ వరకు బ్రహ్మాండనాయకుడి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14వతేదీ సాయంత్రం అంకురా ర్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారం పడుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు ఇఒ ఆదేశించారు. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. భక్తులను ఆకట్టుకునే విధంగా విద్యుత్ అలంకరణలు, ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేయాలని,ఈ ఏడాది శ్రీవారి సేవకులుగా యువతీయువకులకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు.

నిర్మాణాల ఆలస్యంపై కమిషనర్ ఆగ్రహం

అన్నదాన, ప్రసాద పోటు నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్ కె.రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, జులై 9, ప్రభాతవార్త : దుర్గమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదానం, ప్రసాదం పోటుల నిర్మాణ ఆలస్యంపై దేవదాయ శాఖ కమిషనర్ కె రామచంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను స్వయంగా పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా వేగంగా పనులు జరపడం లేదని వెంటనే షిఫ్టుల వారిగా సిబ్బందితో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రావణమాసం లోగా పనులు పూర్తవ్వాలన్నారు. అలాగే ఈనెల 15 లోగా మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన నివేదికను కూడా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎలివేటెడ్ క్యూకాంప్లెక్స్ క్రిందిభాగంలో వున్న షాపులను చూసిన కమీషనర్ వెంటనే వాటిని తొలగించాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వేదపాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాల సందడి: దుర్గమ్మవారి ఆలయం నిర్వహిస్తున్న పోరంకి వేదపాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాల సందడి నెలకొంది. గురువారం ఆయా ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలను నూతన విద్యార్థులకు వేదపండితులు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారి ఉచ్చారణ శైలిని, ప్రతిభాపాటవాలను, నిశితంగా పరిశీలించి ప్రవేశాల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ వేదవిద్యార్థులకు దేవస్థానం అండగా వుంటుందన్నారు. భావితరాలకు వేదవిజ్ఞానం అందించేలా విద్యార్థులకు వేదవిద్యను ఈ పాఠశాలలో నేర్పిస్తామన్నారు. వేదవిద్యార్థులకు మరిన్ని ప్రోత్సాహకాలు, వసతులు అందిస్తామన్నారు.

దుర్గమ్మవారి భక్తుల విరాళాలు : దుర్గమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నంకు చెందిన పి బాబూరావు గురువారం రు.1,01,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
NIT No. 74/EE/R&B/VZM/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 07.07.2026
విజయనగరం జిల్లాలో (ఆర్&బి) డివిజను పరిధిలో ఒక (1) పని కొరకు టెండర్లు పిలువబడినవి. మొత్తం పనుల విలువ: రూ.20.00 లక్షలు. టెండర్లు స్వీకరణ కొరకు ఆఖరు తేది: 20.07.2026, సా.4.00గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (ఆర్ & బి), విజయనగరం.
DIPR.NO. 20886/CL/ADVT/1/1/2022-23 తేది: 09.07.2026

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. Lr. No. MAU61-USI0HB(OTH)/513/2025-HB, Dated:09/07/2026
E-PROCUREMENT TENDER NOTICE
NAME OF THE WORK: APCRDA-"Improvements to existing Parade ground and parking area for Independence-Day Celebrations-2026 in Amaravati Capital City, Amaravati" Est. Cost: Rs.4.25 Crores. The bid can be downloaded on AP e-procurement portal from 10.07.2026 to 17.07.2026 up to 14.00 Hrs, Due date for submission of Bid is 17.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 17.07.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- COMMISSIONER, APCRDA, AMARAVATI

వార్త

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే, మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.

-వినోబాభావే

శాంతి ముణ్ణాళ్ల ముచ్చటేనా?

అమెరికా ఇరాన్‌ల మధ్య మళ్లీ భీకర యుద్ధానికి దారితీసిన పరిస్థితులు ఉభయదేశాల మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందానికి చెల్లుచీటీ పడినట్లే. ఇరాన్‌పైఅమెరికా తాజాగా చేపట్టిన సైనిక చర్యతో ఇరాన్ సైనిక, అణు సామర్థ్యాలను నిర్వీర్యం చేసినట్లుగా అమెరికాఅధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంబరపడిపోతున్నట్లే ఉంది. ఆయన ఏమి మాట్లాడినా అది సంచలనమే. అయితే అందులో గాసిప్ ఎంత ఉందో వైరిపక్షం వారు తేల్చేవరకు అంతే. టర్కీ రాజధాని అంకారాలో 'నాటో' సదస్సు అనంతరం మాట్లాడుతున్నప్పుడు ఇరాన్‌కు ఎలాంటి సైన్యం కానీ, వైమానిక దళం కానీ మిగలలేదని, 159నౌకలు సముద్ర గర్భంలో కలిసి పోయాయని వివరించారు.ఇరాన్ ప్రభుత్వం ఇక ఎన్నటికీ అణ్వాయుధాన్ని తయారుచేయలేదని అన్న ఆయన మాటలే నిజమైతే ఇరాన్, అమెరికాల మధ్య ద్వేష, శత్రు సంబంధాలే ఉండవని తేటతెల్లమైనట్లే కదా! ఇక వైరం కథ కంచికేనని అనుకోవాలి. కానీ పరిస్థితులు అలా కనిపించడం లేదు. హర్మూజ్ జలసంధిలో ఈ దుర్ఘటనలు అంతర్జాతీయ నౌకలకు ఎంతో ముప్పుగా పరిణమించాయి. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగిసింది. భవిష్యత్‌లో చర్చలుండవు, సంప్రదింపులు మాత్రమే అనికూడా ట్రంప్ ప్రవచించారు.ఎప్పుడో ఓసారి ఇలాంటి విషయాలను వింటే ఇదే ఫైనల్ అను కోవడం సహజం. కానీ ట్రంప్ ఉదయం ఓ మాట, సాయంత్రం ఓ పలుకు వల్లె వేయడం వలన సీరియస్‌గా యుద్ధం జరుగుతున్నవేళ వాటికి విలువ లేకుండాపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు ఈ పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో కూడా ట్రంప్ తన హోదాను మరచి వాచాలత ప్రదర్శించడాన్ని ఏ దేశమూ హర్షించడం లేదు. అదేఇప్పుడు ప్రపంచ దేశాలను సంక్షోభంలో ముంచుతోంది. ఆయన మాటలకు నాటో అరబ్‌దేశాలు ఖాతరు చేయడంలేదు. తాజాగా అమెరికా, ఇరాన్ యుద్ధ ఘర్షణలో ఇటలీలోని తమ సైనిక స్థావరాలను భాగస్వా మ్యం చేయబోమని 'నాటో' వేదికగా ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని స్పష్టంచేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణలు తగ్గించే ప్రయత్నానికి బదులు వత్తాసు పలకడం విష యంలో ఔచిత్యం లేదు. తమతో కలిసిరాని స్పెయిన్ వంటి దేశాలతో అమెరికా ఏకపక్షంగా ట్రేడ్‌డీల్‌ను ఉపసంహరించుకుంది. ఇరాన్‌పై భీకర దాడులకు సహకరించాలని ఆయా దేశాల మెడపై ట్రంప్ కత్తివేలాడుతోంది. యుద్ధశాంతులలో తనదే పైచేయి అనిచెప్పుకున్న ఆయన ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని సంకల్పం చెప్పుకున్నట్లుగానే ఉంది.ఇరాన్ ప్రపంచ చిత్రపటంలో కనిపించదు. ఇరాన్‌ను అణ్వాయుధరహిత దేశం స్థాయికి పడకొట్టేశామని చెప్పుకున్న ట్రంప్ ఇంకా దాడులు ఎందుకు కొనసాగిస్తున్నారో ఎవరూ జవాబు చెప్పలేని ప్రశ్న. పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. మరోసారి ప్రపంచ దేశాలను గందరగోళంలోకి నెట్టే అసందర్భ ప్రేలాపనలకు, యుద్ధ నిర్ణయాలకు పర్యవసానాలకు శ్వేత సౌధాధినేత జవాబు చెప్పాలి. 'నాసైన్యం- నా ఇష్టం' అంటే కుదరదు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్, అమెరికా దాడులు ప్రతిదాడులు తర్వాత చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడిన రీత్యా బ్రెంట్‌క్రూడ్ ధరలు పెరిగాయి. శాంతి ఒప్పందం కూడా ప్రశాంతంగా జరుగలేదు. ఇరాన్‌ను బెదిరించి లొంగదీసుకోవాలన్న అమెరికా ఆశలు అడియాసలే అయ్యాయి. తీరా ఆరునెలల తాత్కాలిక ఒప్పందం ముణ్ణాళ్ల ముచ్చటే అయింది. అమెరికా గొంతెమ్మ షరతులు కారణంగానే ఇరాన్ లొంగినట్లు సయోధ్యకొచ్చినా ట్రంప్ వాచాలత వారిని పూర్తిస్థాయి శాశ్వత ఒప్పందం దిశగా పయనించనీయలేదు. తుర్కియేలో నాటో సదస్సు పూర్తయ్యాక ట్రంప్ మాట్లాడిన మాటలేవీ వినసొంపుగా లేదు. ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నట్లు చెప్పడం అదొక టెంపరితనమే. ఇప్పటికీ చాలా దేశాలు ట్రంప్ అనౌచిత వైఖరి వలలో ఆర్థికంగా బలహీనపడ్డాయి. ఇప్పటికిప్పుడు శాశ్వత మైత్రీ సంబంధాలు ఏర్పడినా గత యుద్ధపు నాటి పర్యవసానాలు ఫలితాలను తట్టుకుని వెంటనే నిలదొక్కుకునే పరిస్థితి ఏ దేశానికీ లేదు. మళ్లీ ఇప్పటి ఉద్రిక్తతలు ప్రపంచాన్ని ఏపరిస్థితికి తీసుకెళ్తుందోనని అన్నిదేశాలు ఆందోళన పడుతున్నాయి. ఇప్పటికే స్టాక్ మార్కెట్‌ల కుదేలయ్యాయి. తాత్కాలిక ఒప్పందం వీగిపోయింది. కాల్పుల విరమణకు తెరపడిం దన్న ట్రంప్ వాక్యాలు అంతర్జాతీయ చమురు మార్కెట్ పై ప్రభావం చూపాయి. ఆరుశాతం చమురు ఉత్పత్తుల ధరలు పెరిగాయి. ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా మళ్లీ ఆంక్షలు విధించింది. ఇరాన్‌లో తమ దాడులకు వీలున్న లక్ష్యాలన్నిటినీ ఏకరువు పెట్టి మరీ ట్రంప్ ఆదేశాన్ని హెచ్చరిస్తున్నారు. ఖమెనీ అంత్యక్రియలు ప్రారంభమైన వేళ తానే కనుకదయ చూపకపోతే ఆ అంత్యక్రియల సందర్భంగా బాంబులేసి ఇరాన్ పెద్ద తలకాయలను ఒక్కసారిగా లేపేసే వాడిననే ట్రంప్ చెప్పుకోవడం కూడా ఆ దేశం ఆగ్రహానికి కారణమైంది. ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేశామని చెప్తూనే 'ఖర్గ్ ద్వీపం' దాడుల విషయం ప్రస్తావిం చడం కూడా ఇరాన్ కోపానికి కారణమే. అమెరికా సైన్యం ఇరాన్ భూ భాగంపై బుధవారం రాత్రి చేసిన భీకరమైన వైమానిక దాడులు బాగా కల్లోలపరుస్తున్నాయి. ఈ దాడుల్లో భారతదేశ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన చబహార్ నౌకాశ్రయం అమెరికా క్షిపణులు ఒక్కసారిగా విరుచుకుపడడంతో భారీగా దెబ్బతిందన్న సమాచారం ఆందోళనకరమే. దెబ్బతిన్న దేశాల సైతం ఉభయ యుద్ధ భాగస్వామ్య మున్న దేశాలను శాంతి దిశగా సన్నద్ధం చేయడమొక్కటే శరణ్యం.

అందం తొందరగా కంటికి పాతబడిపోతుంది. శౌశీల్యానికి మాత్రమే ఎప్పుడూ నశించని ఆకర్షణ ఉంటుంది.

గురజాడ అప్పారావు

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టాన్‌స్లావిస్కి

ప్రజావాక్కు

భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం

లక్నోలో వివాహ ఏర్పాట్ల మధ్య జరిగిన అగ్నిప్రమాదంలో నిశ్చితార్థం చేసుకున్న యువజంట మృతిచెందడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ విషాదం అగ్నిప్రమాదాలు కేవలంప్రమాదవశాత్తూ జరిగేవికాదని, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం వల్ల సంభవిస్తున్న మానవ నిర్మిత విపత్తులని మరోసారి గుర్తుచేసింది. నివాస ప్రాంతంలో నడుస్తున్న వాణిజ్య భవనంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం లేదా పనిచేయకపోవడం వంటిలోపాలు భవనతనిఖీల్లోనే గుర్తించాల్సిన అంశాలు. అయినప్పటికీ అనేక చోట్ల అగ్నిమాపక అనుమతుల గడువు ముగిసినా, భద్రతా పరికరాలు పనిచేయకపోయినా, తనిఖీలు నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది.ప్రతి నగరంలో నివాస ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య భవనాలపై ముందస్తు సమాచారం లేకుండా అగ్ని భద్రతా తనిఖీలు నిర్వహించడం తప్పనిసరి చేయాలి.

- సి. సాయిరుత్విక్, శీకాకుళం

ఉద్యమకారులను గుర్తించాలి

తెలంగాణ తొలి దశ 1969, మలిదశ ఉద్యమం 2001 నుండి 2014 వరకు జరిగిన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగుల గుర్తింపుకు ప్రాముఖ్యతఇవ్వాలి. మరీ ముఖ్యంగా మలిదశ ఉద్యమంలో వివిధయూనివర్సిటీ విద్యార్థులు,ఉన్నత విద్యలను అభ్యసించిన నిరుద్యోగులు ఇటీవలకాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించాలి. గత ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాలు తక్కువ సంఖ్యలో ఉండి నిధులు నియామకాల ఏకైక లక్ష్యం కోసం తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా ఉద్యమించి ఇటీవల కాలంలో ఉద్యోగాలు సాధించిన ఉద్యమకారులకు తక్కువ సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఆలోచనచేసి ఆచరణ చేపట్టాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

సాంకేతికత పట్ల అవగాహన అవసరం

నేడు సమాజంలో ప్రతి పనికి సాంకేతికత వినియోగం ఎక్కువగా అయింది. కావున ప్రతివిషయంలో సాంకేతికత పట్ల అవగాహన పెంచుకుని మన పనులకు ఇతరులపై ఎక్కువగా ఆధారపడకుండా మనమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలుకూడా అంతేశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

హోటల్ లైసెన్సు రద్దు చేయాలి

సినిమా హాల్‌కి వెళితే అక్కడ ఉచిత టాయిలెట్స్ ఖచ్చితంగా ఉంటాయి.అలాగే హోటల్‌కువెళితే అక్కడ కూడా టాయిలెట్లు ఉంటాయి. అవి కనీస అవసరాలు. మరి నిత్యం విజయవాడ లోని బస్టాండుకు వేలాదిమంది వస్తుంటారు. బస్టాండులోని అరైవల్ దగ్గరున్న షిర్డీ హోటల్‌కు వేలాదిమంది భోజనం , టిఫిన్లు చేస్తుంటారు.అక్కడ హోటల్‌లో టాయిలెట్లు ఉండాలి. మొన్న ఆ హోటల్‌లో భోంచేసి యూరినల్స్ ఎక్కడ అని అడిగితే పక్కన ఉన్న ఐదురూపాయల టాయిలెట్లు చూపించారు. మీ హోటల్‌లో టాయిలెట్ లేదా అని అడిగితే లేదన్నారు.మరి టాయిలెట్ లేకుండా ఆ హోటల్‌కు లైసెన్స్ ఎలా ఇచ్చారు? ఆ అవసరం తీర్చాల్సిన బాధ్యత హోటల్ వారిదే. కనుక సంబంధిత అధికారులు తక్షణమే విజయవాడ ఆర్టీసీ బస్టాండులోని షిర్డీ హోటల్ లైసెన్స్ రద్దు చేయాలి. ఆర్టీసీ యాజమాన్యం వారు కూడా తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

అన్నదాత పట్ల చొరవ చూపాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్నకష్టాలు వర్ణనాతీతం.అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికిఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీద తాటికాయపడినట్లు ఈ యేడాది రుతు పవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావంవల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత పట్ల మరింత చొరవ చూపాలి.

-ఆర్ వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

విధానాలు, వివాదాలలో ఇథనాల్

ఇథనాల్ శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో, మైలేజీపై కొంత ప్రభావం ఉండటం సహజం. లీటర్ ఇథనాల్‌లో సుమారు 21మెగాజౌల్స్ శక్తి ఉండగా, పెట్రోల్‌లో అది 32 మెగాజౌల్స్ వరకు ఉంటుంది. అయితే ఇ-20లో కేవలం 20శాతం మాత్రమే ఇథనాల్ ఉండటంతో, మైలేజీ పై వాస్తవ ప్రభావం 2నుండి 4శాతంలోపే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.మరోవైపు, ఇథనాల్‌కు అనుకూలంగా వినిపించే ఒక సాంకేతిక వాదన కూడా ఉంది. శక్తిసాంద్రత తక్కువగా ఉన్నప్పటికీ, ఇథనాల్ ఆక్టేన్ సంఖ్య పెట్రోల్ కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అధిక ఆక్టేన్ ఇంధనం ఇంజిన్‌లో అనియంత్రిత దహనం (నాకింగ్) సమస్యను తగ్గించి, తగిన విధంగా రూపకల్పన చేసిన ఇంజిన్లలో పనితీరును మెరుగు పరచగలదని సాంకేతిక నిపుణుల అంచనా. అయితే ఈ ప్రయోజనాలు ఎంత మేరకు సాధారణ వినియోగదారుడికి అందుతున్నాయన్నది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది.

కృష్ణబాలాజి పల్లపోతు

దేశంలో రెండు దశాబ్దాలకు పైగా అమలవుతున్న ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం ఇ-20 స్థాయికి అంటే 20 శాతానికి చేరుకోవడంతో దాని ప్రయోజనాలు, పరిమితులు, దీర్ఘకాలిక ప్రభావాలపై చర్చలు ఊపందుకున్నాయి. చమురు దిగుమతులనుకొంత మేర తగ్గించి విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడం, శిలాజ ఇంధనాలవల్ల ఏర్పడే కర్బన ఉద్గారాలను నియంత్రించడం, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు వినియోగావకాశాలు కల్పించి రైతుల ఆదాయం పెంచడం ఈ విధానం ప్రధాన లక్ష్యాలు.అయితే, ఆహార అవసరాలకు ఉపయోగపడే పంటలను ఇంధన ఉత్పత్తికి మళ్లించడం సమంజసమేనా?ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల వల్ల పంటల దిగుబడి తగ్గితే ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? అన్న ప్రశ్నలు ప్రధానంగా వినిపిస్తూనే ఉన్నాయి.వాస్తవానికి, కేంద్ర ప్రభుత్వం 2003లో బ్రెజిల్, అమెరికా వంటి దేశాల తరహాలో ఇథనాల్ సమ్మిళితపెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహించడం ప్రారంభించింది. ఇథనాల్ అనే ఆల్కహాల్ రకానికి చెందిన సేంద్రీయ పదార్థం చెరకు, మొక్క జొన్న వంటి పంటలను పులియబెట్టడం ద్వారా ఉత్పన్నమవుతుంది. 2013-14లో దేశ సగటు ఇథనాల్ మిశ్రమం 2శాతానికి లోపే ఉండేది. అది క్రమంగా పెరుగుతూ, 2025 చివరి నాటికి 20శాతం లక్ష్యాన్ని గడువుకంటే ముందుగానే సాధించింది. దాంతో 2026 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా ఇ-20 ప్రామాణిక పెట్రోల్‌గా ప్రకటించబడింది. ఈ లక్ష్య సాధన కోసం ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు.2017-18లో సుమారు 500 కోట్ల లీటర్లు మాత్రమే ఉన్న ఇథనాల్ ఉత్పాదనా సామర్థ్యం 2023- 24 నాటికి 1,600 కోట్ల లీటర్లు దాటింది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో డిస్టిలరీల సంఖ్య భారీగా పెరగడంతో, ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోవడం ఆశాజనకమైన పరిణామం. ఈ కార్యక్రమం ద్వారా గత పదేళ్లలో సుమారు లక్షా 63 వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా అయిందని, సంబంధిత రైతులకు పంట కొనుగోళ్లకు గాను లక్షా పదివేల కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని అధికారిక అంచనాలు చెబుతున్నాయి. ఈ సంఖ్యలు, పరిణామాలు స్థూలంగా ఆశాజనకంగానే కనిపిస్తున్నప్పటికీ,విధాన నిర్ణయం అమలులో ఉన్న లోటుపాట్లపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ఎందుకంటే అత్యుత్తమమైన విధానాలను కూడా అమలులో లోపాల వల్ల చతికిలపడవచ్చన్నది అనేక సందర్భాల్లో రుజువైంది.ఇ-20పై సాధారణ ప్రజల నుండి ఎక్కువగా వినిపించే అభ్యంతరాలు మైలేజీ తగ్గుదల, వాహనాల దీర్ఘకాలిక పనితీరుపై దాని ప్రభావానికి సంబంధించినవి.

ఇథనాల్ శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో, మైలేజీపై కొంత ప్రభావం ఉండటం సహజం. లీటర్ ఇథనాల్‌లో సుమారు 21మెగాజౌల్స్ శక్తి ఉండగా, పెట్రోల్‌లో అది 32 మెగాజౌల్స్ వరకు ఉంటుంది. అయితే ఇ-20లో కేవలం 20శాతం మాత్రమే ఇథనాల్ ఉండటంతో, మైలేజీ పై వాస్తవ ప్రభావం 2నుండి 4శాతం లోపే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.మరోవైపు, ఇథనాల్‌కు అనుకూలంగా వినిపించే ఒక సాంకేతిక వాదన కూడా ఉంది. శక్తిసాంద్రత తక్కువగా ఉన్నప్పటికీ, ఇథనాల్ ఆక్టేన్ సంఖ్య పెట్రోల్ కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అధిక ఆక్టేన్ ఇంధనం ఇంజిన్‌లో అనియంత్రిత దహనం (నాకింగ్) సమ

స్యను తగ్గించి, తగిన విధంగా రూపకల్పన చేసిన ఇంజిన్లలో పనితీరును మెరుగుపరచగలదని సాంకేతిక నిపుణుల అంచనా. అయితే ఈ ప్రయోజనాలు ఎంత మేరకు సాధారణ వినియోగదారుడికి అందుతున్నాయన్నది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. లోకల్‌సర్కిల్స్ అనే ప్రముఖ పౌర వేదిక నిర్వహించిన సర్వే ప్రకారం 2023కు ముందు తయారైన వాహనాలను ఉపయోగిస్తున్న వారిలో 56శాతం మంది 10 శాతానికి పైగా మైలేజీ తగ్గిందని పేర్కొన్నారు. ప్రజల అనుభవానికీ, అధికారిక అంచనాలకు మధ్య ఉన్న ఈ గణనీయమైన వ్యత్యాసానికి గల కారణాలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన, సంతృప్తికరమైన, గణాంకాలతో కూడిన వివరణ కోసం వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. అలాగే, కొత్త వాహనాలను ఇ-20కు అనుగుణంగా తయారు చేస్తున్నప్పటికీ, ఇప్పటికే రోడ్లపై ఉన్న కోట్లాది వాహనాలపై దీర్ఘకాల ప్రభావం గురించి ఆందోళనలు కొనసాగుతున్నాయి.సర్వేల్లో దాదాపు 28శాతం మంది వాహనదారులు వివిధ సమస్యలను నివేదించారు. దీనిపై కూడా ప్రభుత్వం నుండి రాజకీయ ప్రకటనలే తప్ప గట్టి భరోసాలభించలేదు. ప్రజల్లో అసంతృప్తికి మరోకారణం పెట్రోల్‌లో కొంత భాగాన్ని స్థానికంగా, సాపేక్షంగా తక్కువ ధరలో లభ్యమయ్యే ఇథనాల్‌తో భర్తీ చేస్తున్నప్పటికీ, ధరలో ప్రయోజనం కనిపించడం లేదు. ఒకవైపు మైలేజీపై సందేహాలు, మరోవైపు వాహనాల పనితీరుపై ఆందోళనలు, దానికి తోడు ధరల్లో ఆశించిన తగ్గుదల లేకపోవడం వెరసిఇ-20పై అసంతృప్తికి కారణమవుతున్నాయి. ఇబ్బందులను స్వచ్ఛందంగా భరించడానికి సిద్ధపడుతున్నప్పుడు, కనీసం ధరల పరంగానైనా కొంత ఉపశమనం ఉండాలని వినియోగదారులు ఆశించడం సహజమే. ఇటీవలి కాలంలో మరో వాదన కూడా ప్రముఖంగా వినిపిస్తోంది 'నా వాహనం ఫలానా ఇంధనంతోనే నడవాలని కట్టడి చేయడం ఎంతవరకూ సబబు? మైలేజి, వాహనం తయారీ, ఇంజన్ పనితీరు, ఇంధనం ధర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైనఇంధనాన్ని ఎంచుకునే అవకాశం నాకే ఉండటం సమంజసం కదా!'. బ్రెజిల్ వంటి దేశాల అనుభవంతో పోల్చుకుంటే, ఈ ఆవేదన అర్థవంతంగానే కనిపిస్తోంది. పర్యావరణ ప్రయోజనాల విషయంలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. ఇథనాల్ మిశ్రమం వల్ల కొన్నిఉద్గారాలు తగ్గుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా గాలి,నాణ్యతపై దాని సమగ్ర ప్రభావాన్ని నిర్ధారించే దీర్ఘకాలిక స్వతంత్ర అధ్యయనాలు ఇప్పటికీ పరిమితంగానే ఉన్నాయి. మరోపక్క, దేశంలోని ప్రధాన నగరాల్లో వాయుకాలుష్యం ఇప్పటికీ ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతోంది. ఏవిధానమైనా దాని ఫలితాలను కొలవగలిగితేనే దానిపట్ల ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. ఇక్కడ మరో అంశం ఇథనాల్ ఉత్పత్తికి ప్రధానంగా ఉపయోగించే చెరకు పంట అత్యధిక నీటి వినియోగం కలిగిన పంటల్లో ఒకటి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఇథనాల్ ఉత్పత్తి కోసం చెరకుపండిస్తే, అది భూగర్భ జలాలపై అదనపు ఒత్తిడికి దారితీస్తుందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంధన విషయంలో స్వయం సమృద్ధి సాధించడం అభిలషణీయమే. కానీ దానికోసం ఆహారోత్పత్తికి కావాల్సిన భూగర్భ జలాలను పణంగాపెట్టడం సమర్థనీయమైనది కాదు. భవిష్యత్తులో భారత్ ఇ30, ఇ50 లేదా ఇ85 వంటి అధిక ఇథనాల్ మిశ్రమాలవైపు అడుగులు వేయాలనుకుంటే,అలాంటి సమగ్రవ్యవస్థను కూడా దశలవారీగా నిర్మించాల్సి ఉంటుంది.రెండు దశాబ్దాల ప్రయాణం తర్వాత కూడా ఆ దిశగా మన పురోగతి పూర్తి సంతృప్తికరంగా ఉందని చెప్పలేం. ప్రస్తుతం ఇ20పై చర్చ జరుగుతున్నప్పటికీ, సమాంతరంగా బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ 2026లో ఇ22, ఇ25, ఇ27, ఇ30 మిశ్రమాలకు సంబంధించిన ప్రమాణాలను ప్రకటించింది. ఇ85 మిశ్రమం కూడా పుణె, నాగ్‌పూర్ వంటి కొన్ని నగరాల్లో ప్రయోగాత్మకంగా అందు బాటులోకి వచ్చింది.ఇది సాధారణ పెట్రోల్ కంటే సుమారు రూ.20 తక్కువ ధరకు లభిస్తున్నప్పటికీ,మైలేజీ, ధరలోని రాయితీ మైలేజీ తగ్గుదలకు తగినంతగా ఉందా అన్నఅంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 15 ఐసోబ్యుటినాల్ కలపడం ద్వారా ఈ తరహా డీజిల్ ఉత్పత్తి చేసే అవకాశాలు ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్నాయి. చివరగా, ఇథ నాల్ విధానం విజయవంతమైందా లేదా అన్నది నిర్ణయిం చేది పారదర్శక గణాంకాలు, ఫలితాలను కొలవ డానికి స్పష్ట మైన ప్రమాణాలు, అధ్యయనాలు, ప్రజల అనుభవాలే కానీ ఆర్భాటమైన ప్రకటనలు, నినాదాలు, రాజకీయ వాదోపవాదాలు కావు. ●

చేపల రైతు చేతుల్లో దేశ ఆహార భద్రత

రామ కిష్టయ్య సంగనభట్ల

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది. ఇది కేవలం ఒక రోజువేడుక మాత్రమే కాకుండా, దేశమత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ కె.హెచ్. అలీకున్ని ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి నీలి విప్లవానికి నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతేకాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8శాతంగా ఉంది. ఈరంగం దాదాపు2.8కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజ

లో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35శాతం వాటాను కలిగిఉంది. సరైన విధానాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్య రంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్‌హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో పిఎంఎంఎస్ కింద దాదాపు ..2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్సీఆర్ఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటి వనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి.అయితే,ఈరంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలోమార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం,రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాలస్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్యరంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు,శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్నిపంచుకుంటూ వ్యవస్థను మెరుగు పరిచే మార్గాలుఅన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగామారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ అసలైన ఉద్దేశం. ●

నైపుణ్య విద్యే ఉద్యోగ భద్రతకు పునాది

సి.హెచ్.ప్రతాప్

దశాబ్దాలుగా భారతదేశంలో ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులనే ఉపాధికి భరోసానిచ్చే విద్యగా భావించే అభిప్రాయం బలంగా నెలకొంది. మంచి ర్యాంకు వస్తే ఇంజినీరింగ్, అత్యుత్తమ ర్యాంకు వస్తే మెడిసిన్ అనే భావన ఇప్పటికీ చాలామంది తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. అయితే మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక విప్లవం, సేవారంగ విస్తరణ, నూతన పరిశ్రమల ఆవిర్భావం ఈ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. నేటి ఉద్యోగ విపణిలో డిగ్రీ కంటే నైపుణ్యానికే ఎక్కువ విలువ లభిస్తోంది. కేంద్ర గణాంకాల ప్రకారం 2022-23లో భారతదేశంలో సుమారు 1.09 కోట్ల మంది ఉన్నత విద్యను పూర్తిచేశారు. అయితే ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్న పట్టభద్రుల శాతం కేవలం 55శాతం మాత్రమే. అంటే విద్య పూర్తిచేసిన ప్రతి ఇద్దరిలో ఒకరు మాత్రమే ఉద్యోగానికి తగిన నైపుణ్యాలతో బయటకు వస్తున్నారన్న మాట.ఇదే భారత విద్యా వ్యవస్థ, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ప్రతి సంవత్సరం దేశంలో సుమారు 11 నుంచి 12 లక్షల మంది ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతుండగా, ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందే అవకాశం మాత్రం సుమారు 70నుంచి 80 వేల మంది విద్యార్థులకు మాత్రమే లభిస్తోంది. మిగిలిన లక్షలాది మంది యువతకు ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడం కాలానుగుణ అవసరం. అందుకే ఉపాధి అవకాశాలను కేవలం రెండు కోర్సులకు పరిమితం చేయడం సరైన దృక్పథం కాదు. నేటి ప్రపంచంలో డేటా సైన్స్, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్, డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల అంచనాల ప్రకారం డేటా సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు సంవత్సరానికి 15 నుంచి 20 శాతం చొప్పున పెరుగుతున్నాయి. అదే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కూడా నిపుణుల అవసరం గణనీయంగా పెరుగుతోంది. సేవారంగం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా మారింది. దేశ జీడీపీలో ఈరంగం వాటా 55నుంచి 60శాతం వరకు ఉంది. హాస్పిటాలిటీ, టూరిజం, ఫుడ్ టెక్నాలజీ, హెల్త్‌కేర్,



ఫార్మసీ, బయోటెక్నాలజీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, లాజిస్టిక్స్, ఫ్యాషన్ డిజైన్, యానిమేషన్, గేమ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్, ఫిల్మ్ టెక్నాలజీ, అగ్రిటెక్, ఫిన్‌టెక్ వంటి రంగాల్లో వేగంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. కొన్ని రంగాల్లో వార్షిక నియామకాల వృద్ధి 8 నుంచి 12 శాతం వరకు నమోదవుతోంది. ప్రతి సంవత్సరం దేశంలో 25 నుంచి 30లక్షల మంది యువత ఐటీఐలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వృత్తి శిక్షణా సంస్థల్లో చేరుతున్నారు. సరైన శిక్షణ పొందిన అభ్యర్థులకు దేశీయంగానే కాక విదేశాల్లో కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సమాచార సాంకేతికం, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, పారిశ్రామిక నిర్వహణ, వెల్డింగ్ ఆటోమేషన్ వంటి రంగాల్లో విదేశీ నియామకాలు పెరుగుతున్నాయి. ఇంటర్న్‌షిప్‌లకు కూడా నేటి ఉద్యోగ విపణిలో విశేష ప్రాధాన్యం ఏర్పడింది. పరిశ్రమల అధ్యయనాల ప్రకారం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 30నుంచి 60 శాతం మంది అదే సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.మరోవైపు,పరిశ్రమల్లో నైపుణ్యాల కొరత కారణంగా సుమారు40నుంచి 50 శాతం ఉద్యోగాలకు అదనపు శిక్షణఇవ్వాల్సి వస్తోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన అనుసంధానం అవసరాన్ని స్పష్టంచేస్తోంది. ప్రభుత్వం కూడా విద్యావిధానంలో సమతుల్య దృక్పథాన్ని అవలంబించాలి. ఇంజినీరింగ్,మెడిసిన్ విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో,నైపుణ్యాధారిత, బహుళశాఖల, వృత్తి విద్యా కోర్సులకు కూడా అంతే ప్రాధాన్యం కల్పించాలి. ప్రతి జిల్లాలో ఆధునిక స్కిల్ యూనివర్సిటీలు, ఫినిషింగ్ స్కూల్స్, పరిశ్రమల భాగస్వామ్యంతో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.పాఠశాలస్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్‌ను తప్పనిసరి చేసి, విద్యార్థుల అభిరుచి, సామర్థ్యానికి అనుగుణంగా కోర్సుల ఎంపికకు మార్గనిర్దేశం చేయాలి.స్టార్టప్‌లు,స్వయం ఉపాధి, డిజిటల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి.దేశ అభివృద్ధికి వైద్యులు, ఇంజినీర్లు ఎంత అవసరమో, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ఫార్మసీ పరిశోధకులు, బయోటెక్నాలజిస్టులు,డేటా విశ్లేషకులు, డిజైనర్లు, ఆరోగ్య సేవల నిపుణులు, సృజనాత్మక రంగాల ప్రతిభావంతులు కూడా అంతే అవసరం. ఉపాధిని నిర్ణయించేది కోర్సు కాదు. కాలానుగుణ నైపుణ్యం, నిరంతర అభ్యాసం, సృజనాత్మకత, నవకల్పన పట్లఆసక్తి. ఈఅవగాహన విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, విధాన నిర్ణేతల్లో పెరిగినప్పుడే భారత యువశక్తి ప్రపంచ ఉద్యోగ విపణిలో మరింత సమర్థంగా నిలబడగలదు. ●

10-7Pg5.qxd:10-7Pg5.qxd 1/1/02 6:17 AM Page 1

భారత్ ఆర్థికవ్యవస్థపై విదేశీ ఇన్వెస్టర్లకు ఎంతో నమ్మకం

భారత్ ఎన్ఐఐఎఫ్‌లో ఆసీస్ పెన్షన్‌ఫండ్ రూ.3వేల కోట్ల పెట్టుబడులు: మెల్‌బోర్న్ సదస్సులో ప్రధానిమోడీ

మెల్‌బోర్న్,జులై 9: భారత్‌లో విదేశీ పెట్టుబడుల ప్రవాహం మరోసారి ఊపందుకుంది. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద పెన్షన్ ఫండ్ ఆస్ట్రేలియన్ సూపర్ భారతదేశంలో రూ.3,311 కోట్లు అదనంగా పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడిని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ఎన్ఐఐఎఫ్‌లో పెట్టనుంది. ఈ నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ స్వాగతిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ పెట్టుబడిదారుల విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడి భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాల రంగం, సంస్కరణలపై అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఉంచుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. ఇండియా-ఆస్ట్రేలియా సిఇఒ ఫోరమ్‌లో మోడీ ఈవ్యాఖ్యలుచేసారు. మెల్‌బోర్న్‌లో జరిగిన ఇండియా-ఆస్ట్రేలియా సిఇఒ ఫోరమ్ సదస్సులో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్‌తోకలిసి ప్రధాని పాల్గొని భారత్‌లోని పెట్టుబడుల అవకాశాలను వివరించారు. భారత్‌ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా పెన్షన్‌ఫండ్ పెట్టుబడిఅని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఎన్ఐఐఎఫ్‌లో ఆస్ట్రేలియన్ సూపర్ ప్రకటించిన కొత్త 500 మిలియన్ల పెట్టుబడితో భారతదేశంలో తమ పెట్టుబడులను మరింత విస్తరించనుంది. ఈ తాజా పెట్టుబడితో భారత ఆస్తి రంగంలో ఆస్ట్రేలియన్ సూపర్ మొత్తం పెట్టుబడి 3.3 బిలియన్లడాలర్లకు చేరనుంది. ప్రస్తుతం ఈ సంస్థ భారత్‌లో మౌలిక సదుపాయాలు, ఈక్విటీలు, ప్రైవేట్ మార్కెట్లలో ఇప్పటికే సుమారు 2.8 బిలియన్ల పెట్టుబడి పెట్టింది. ఆస్ట్రేలియన్ సిఇఒ పాల్ ష్రోడర్ మాట్లాడుతూ, ప్రధాని మోడీకి వ్యాపారం, పెట్టుబడులపై లోతైన అవగాహన ఉందని అన్నారు. ప్రధాని మోడీ పెట్టుబడిదారులకు స్థిరమైన విధానాలు, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలపై స్పష్టమైన దృష్టిని కలిగి ఉన్నారు.

వ్యాపార సంస్థలతో ఆయన వ్యవహరించే తీరు మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. భారత్-ఆస్ట్రేలియా ప్రజల మధ్య ఉన్న బలమైన సంబంధాలు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు దారి తీస్తాయని ష్రోడర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియన్ సూపర్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ షాన్ మాన్యుయెల్ మాట్లాడుతూ, భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభిస్తుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. రోడ్లు, రైల్వేలు, ఇంధనం, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ప్రాజెక్టులకు నిధులు అందుబాటులోకి రావడం ద్వారా భారత్-ఆస్ట్రేలియా ఆర్థిక భాగస్వామ్యం మరింత బలపడతాయని ఇరుదేశాలప్రధానులు వెల్లడించారు.

రక్షణ, సముద్ర భద్రతపై ప్రత్యేక దృష్టి

శుద్ధిచేసిన యురేనియంను భారత్‌కు సరఫరాచేసే ఒప్పందంతోపాటు ఇంధనభద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రెండుదేశాలు అవగాహనకు వచ్చాయి. ఇరు దేశాలు సంయుక్త రక్షణ, భద్రతా సహకార ప్రకటనను ఆమోదించాయి.దీని ద్వారా రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం, ఉమ్మడి ఆవిష్కరణలు, సమాచార మార్పిడి, విపత్తుల సమయంలో మానవతా సహాయం, సహాయక చర్యల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. అలాగే సముద్ర భద్రత సహకార రోడ్‌మ్యాప్‌పై అంగీకారం కుదిరింది. భారత తీర రక్షక దళం, ఆస్ట్రేలియా మారిటైమ్ బోర్డర్ కమాండ్ మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. ఇంధన భద్రతపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా జరిగేలా పౌర అణు ఒప్పందం కింద పరిపాలనా ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. దీని ద్వారా భారత్ ఇంధన వనరులు మరింత విస్తరించడంతో పాటు శక్తి భద్రత బలోపేతం కానుంది.

మెల్‌బోర్న్ సూపర్‌హిట్

మెల్‌బోర్న్‌లో ఇండియా ఆసీస్ సిఇఒల ఫోరమ్ సదస్సుతోపాటు ప్రవాసభారతీయుల సమావేశంలో పాల్గొన్న మోడీ మాట్లాడుతూ మెల్‌బోర్న్ సభ సూపర్‌హిట్ అని బ్లాక్‌బస్టర్ అని వ్యాఖ్యానించారు. భారతీయులు ఏదేశంలో ఉన్నా ఆ దేశ ప్రగతికి దోహదపడుతూ భారత ప్రతిష్టను ఇనుమడింపచేస్తారన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో భారత్ సత్తా ప్రపంచానికి చాటిచెప్పామని,

ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా భారత్ ఉపేక్షించబోదని సందేశం పంపించగలిగామన్నారు. అలాగే మేకిన్ ఇండియా ఇపుడు ప్రపంచ వ్యాప్తం కావడం భారత్‌కు గర్వకారణంగా నిలిచిందని మోడీ పేర్కొన్నారు.

ఇంధన భద్రతపై ఆస్ట్రేలియా భారత్‌ల ఒప్పందం

మెల్‌బోర్న్,జులై 9: భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య ఇంధన భద్రతకు సంబంధించి ప్రధానఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వల్ల ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు మార్గం సుగమమైంది. ఇంధన రంగంలో రెండు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అడుగుగా దీనిని భావిస్తున్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించారు. అణుశక్తి రంగంలో కీలక ఒప్పందం కుదిరిందని, దీనివల్ల ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం ఏర్పడుతుందని మోడీ తెలిపారు. ఇది దేశ స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు కొత్త ఊతం ఇస్తుందని చెప్పారు. రెండు దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇంధన వాణిజ్యం, సరఫరా వ్యవస్థ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వినియోగం పెంపుపై కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. 2015లో కుదిరిన అణు సహకార ఒప్పందం కింద యురేనియం ఎగుమతులకు అవసరమైన పరిపాలనా ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చే యురేనియం పూర్తిగా శాంతియుత అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశాయి. దీనిపై ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా, ధరలపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశాయి. అయినా ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు కొనసాగిస్తామని వెల్లడించాయి. ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో ఆస్ట్రేలియా, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో భారత్ కీలక భాగస్వాములని రెండు దేశాలు గుర్తించాయి. పునరుత్పాదక ఇంధనం, తక్కువ కాలుష్య ఇంధనాలు, పెట్టుబడులు, ప్రాంతీయ సహకారాన్ని మరింత పెంచాలని నిర్ణయించాయి. బొగ్గు, డీజిల్, సహజ వాయువు వంటి ఇంధనాల సరఫరా స్థిరంగా కొనసాగేలా కలిసి పనిచేస్తామని స్పష్టంచేశాయి. భారత్ ప్రారంభించిన గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయన్స్ కార్యక్రమాన్ని కూడా ఆస్ట్రేలియా స్వాగతించింది.



ఆ ఉత్పత్తులకు సుంకాలుండవ్!

మోడీ పర్యటనకు ముందే న్యూజిలాండ్ కీలక ప్రకటన

వెల్లింగ్టన్, జులై 9: భారత ప్రధాని నరేంద్ర మోడీ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లడానికి ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లక్సాన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌కు న్యూజిలాండ్ ఎగుమతి చేస్తున్న వస్తువుల్లో 57 శాతం ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి సుంకాలు ఉండబోవని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన తొలిరోజు నుంచే ఇది అమలులోకి వస్తుందన్నారు. ఈ చారిత్రక ఒప్పందం ద్వారా భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు విస్తృత ప్రవేశం లభిస్తుందని, ఇది న్యూజిలాండ్ వ్యాపారులకు ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టుచేశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని మోడీ.. ఈ నెల 10,11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. దాదాపు గత 40 యేళ్లలో భారత ప్రధాని అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా అక్లాండ్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశంలో వాణిజ్య ఒప్పందాలు, అభివృద్ధి, తదితర అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. వాణిజ్యం, రక్షణ, పరస్పర సహకారం తదితర అంశాలపై ప్రధాని మోడీ దృష్టిపెట్టనున్నారు. అంతేకాకుండా అక్కడి వ్యాపారవేత్తలు, క్రీడాకారులతోనూ మోడీ సమావేశం కానున్నారు.

నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌లో హనీమూన్ బోగీ

టిటిఇ సస్పెన్షన్‌కు దారితీసిన అత్యుత్సాహం

ముంబయి,జులై 9: ఎసి రైలు బోగీని హనీమూన్ సూట్‌లా అలంకరించి కొత్త జంటకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దృశ్యాల విడియోలు హల్‌చల్ చేసినవైనం సంబంధిత టిటిఇ సస్పెన్షన్‌కు దారితీసింది. బెలూన్లు, పూలమాలలు, గులాబీ రేకులు, ఐ లవ్ యూ బోర్డులతో అలంకరించిన రైలు క్యాబిన్‌ను చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు రైల్వే భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నెల 6న బల్లార్షా-ముంబై నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. జల్నాకు చెందిన ఓ నూతన వధూవరుల కోసం రైల్లోని ఎసి కూపేను ముందుగానే బుక్ చేశారు. అదే సమయంలో 'రహత్ రూమ్ డెకరేషన్' అనే ఈవెంట్ డెకరేషన్ సంస్థకు చెందిన సిబ్బంది రైలులోకి వెళ్లి క్యాబిన్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. కొత్త దంపతులు ఔరంగాబాద్ నుంచి కారులో జల్నా రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి రైలులో ప్రయాణం ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా డెకరేషన్ సేవలను బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. రైలు క్యాబిన్‌ను హనీమూన్ సూట్‌ను తలపించేలా తీర్చిదిద్దడంతో ఆ దృశ్యాలు క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వీడియో వైరల్ కావడంతో రైల్వే అధికారులపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అనుమతి లేకుండా బయటి వ్యక్తులు రైలులోకి ఎలా ప్రవేశించారు? భద్రతా నిబంధనలు ఎలా ఉల్లంఘించారనే ప్రశ్నలు తలెత్తాయి. విషయం రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి చేరడంతో అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో బయటి వ్యక్తులను అనుమతి లేకుండా రైలులోకి అనుమతించడం, ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌లో భారీగా అలంకరణలు చేయడం రైల్వే నిబంధనలకు విరుద్ధమని అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలతో సంబంధిత టిటిఇ గిరీష్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.

రాయ్‌గఢ్‌లో కుండపోత కొట్టుకుపోయిన గ్యాస్ సిలిండర్లు

రాయ్‌గడ్,జులై 9: మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వరదల కారణంగా పన్వేల్ తాలూకాలోని హెచ్‌పిసిఎల్ పాతాళగంగా ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ నీటమునిగింది. దీంతో నింపినవి, ఖాళీవి కలిపి సుమారు 3,000 సిలిండర్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి పాతాళగంగా నదిలోకి చేరాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కిషన్ జవాలే ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో లేదా ఒడ్డున కొట్టుకొచ్చిన సిలిండర్లు కనిపించినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకొద్దని సూచించారు. ఇంటికి తీసుకెళ్లొద్దని హెచ్చరించారు. వాటిలోగ్యాస్ ఉందో లేదో, అవి సురక్షితస్థితిలో ఉన్నాయో లేదో తెలియదని వెల్లడించారు. వాటినితెరవడం లేదా వినియోగించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన సిలిండర్లనుగుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నదిలో లేదా పరిసరప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్లు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఢిల్లీలో భారీ వర్షం

న్యూఢిల్లీ,జులై 9: ఉత్తర భారతదేశంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో జన జీవనం స్తంభించిపోతున్నది. గురువారం తెల్లవారు జామున ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షాలకు రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఢిల్లీలోని పలు ప్రాంతాలకు ఇప్పటికే ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతోకూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంకారణంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, మునీర్కా, ఇతర ప్రాంతాలతో సహా నగరంలోని కొన్ని ప్రాంతాలలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయంఏర్పడింది. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశంలో కురుస్తున్న వర్షాలపై సమీక్షించారు. మంగళవారం కేరళలోని వయనాడ్‌లో శిథిలాలు కూలిపోయి పలువురు చనిపోవడం, జమ్మూలోని దోడాలో ఆకస్మిక వరదలు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి భారీ వర్షాల వల్ల తలెత్తిన పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జననీరాజనం మధ్య ఖమైనీ అంత్యక్రియలు

టెహ్రాన్,జులై 9: ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు సూర్యాస్తమయంలోపు పూర్తిచేసారు. అంత్యక్రియలకు లక్షలాది మంది తరలివచ్చారు. ఈ ఉదయమే అంత్యక్రియలు పూర్తి కావాల్సి ఉండగా సాయంత్రానికి వాయిదా పడ్డాయి. ఖమేనీ పార్థివదేహం ఖమేనీ స్వస్థలమైన ఈశాన్య ఇరాన్‌లోని మష్హద్ నగరానికి చేరుకుంది ఇరాక్‌లోని పవిత్ర నగరాలు నజఫ్, కర్బలా దగ్గర నిర్వహించిన అంతిమయాత్రల్లో లక్షలాది మంది పాల్గొనడంతో అంత్యక్రియల కార్యక్రమం ఆలస్యమైంది. తొలుత గురువారం ఉదయమే అంత్యక్రియలు పూర్తి కావాల్సి ఉండగా భారీ జనసందోహం కారణంగా అంత్యక్రియలను సాయంత్రానికి వాయిదా వేశారు. ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్‌ఎన్ఏ విడుదల చేసిన దృశ్యాల్లో మహాన్ ఎయిర్ విమానం ద్వారా ఖమేనీ భౌతికకాయం మష్హద్ విమానాశ్రయానికి చేరుకున్నట్లు కనిపించింది. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకారం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు (అనగా భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:30 గంటలకు) అంత్యక్రియలు పూర్తిచేసారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఫిబ్రవరి 28న ఖమేనీ మరణించారు. మూడు నెలల తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. భీకరమైన యుద్ధం కారణంగా వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అంత్యక్రియల్లో భాగంగా ముందుగా ఇరాక్‌లోని నజఫ్, కర్బలా నగరాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని విమానంలో మష్హద్‌కు తరలించారు.

ఈ సాయంత్రంతో అన్ని కార్యక్రమాలు పూర్తి కానున్నాయి. టెహ్రాన్‌తో పాటు పలు నగరాల్లో జరిగిన అంతిమయాత్రల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఖమేనీకి నివాళులర్పించారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కాపాడిన నాయకుడిగా.. అమెరికా-ఇజ్రాయెల్ విధానాలకు వ్యతిరేకంగా నిలిచిన నేతగా ఆయనను కొనియాడారు.టెహ్రాన్‌కు చెందిన 60 యేళ్ల హుస్సేన్ అక్బరీ మాట్లాడుతూ ప్రపంచానికి మేము అణచివేతకు తలవంచబోమని, మా నాయకుడి రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని నిరూపించడమే మా లక్ష్యం అని అన్నారు.

అమెరికా బాంబులేసిన ఖమేనీ కాంపౌండ్ దృశ్యాలు.. షేర్ చేసిన ఇరాన్



టెహ్రాన్, జులై 9: అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన రోజునే అప్పటి సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మృతి చెందారు. టెహ్రాన్‌లోని కాంపౌండ్‌లో ఆయనతోపాటు ఇతర కీలక నేతల లక్ష్యంగా ఆ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఖమేనీని గురువారం సమాధి చేయనున్న నేపథ్యంలో దాడుల్లో దెబ్బతిన్న ఆ భవనం దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా షేర్ చేసింది. 35 సెకన్ల నిడివి గల ఆ విడియోలో.. అత్యంత దారుణంగా భవనం దెబ్బతిన్న దృశ్యాలు కన్పించాయి. ఖమేనీ అంతిమయాత్ర వారం రోజులు సాగింది. ఇరాన్, ఇరాక్‌లలోని వివిధ నగరాల మీదుగా ఈ అంతిమయాత్ర సాగింది. ఈ మార్గాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ నేతకు అంతిమ వీడ్కోలు పలికారు. ఖమేనీ పార్థివదేహాన్ని ఇరాన్‌లోని ఆయన సొంత పట్టణమైన మషహద్‌లో గురువారు ఖననం చేశారు. ఈ క్రమంలో ఈ పట్టణానికి చేరుకోవడానికి ఉపయోగించే రెండు వంతెనలు అమెరికా దాడుల్లో ధ్వంసమయ్యాయి. మరోవైపు దాడుల నేపథ్యంలో టెహ్రాన్- మషహద్ మధ్య రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. అంత్యక్రియల కార్యక్రమానికి ఆటంకం కలిగించేందుకే యుఎస్ ఈ దాడులు చేసిందని ఐఆర్‌జిసి ఆరోపించింది. ఇవి ఇలాగే కొనసాగితే.. తమ నుంచి వచ్చే భీకరంగా ఉంటుందని హెచ్చరించింది.

భారత్‌కు తిరిగి వస్తున్న అపురూప ఖళాఖండాలు

మెల్‌బోర్న్,జులై 9: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధానిమోడీకి ఆదేశ ప్రధాని ఆంటోని అల్బనీస్ అద్భుత రిటర్న్ గిఫ్ట్‌లు ఇచ్చారు. భారత్‌కు చెందిన అపురూపమైన చారిత్రక విగ్రహాలు, పూజా సామాగ్రిని వెనక్కి ఇచ్చేసింది ఆస్ట్రేలియా. అవి త్వరలోనే తిరిగి స్వదేశానికి చేరుకోనున్నాయి. తమిళనాడులోని అతి పురాతన ఆలయాలకు చెందిన ఈ అరుదైన సాంస్కృతిక సంపదను భారత్‌కు తిరిగి అప్పగించడానికి ఆస్ట్రేలియా అంగీకరించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. ఇందులో భద్రకాళి అమ్మవారి రూపంతో కూడిన లోహపు త్రిశూలం, పవిత్ర రాతి నంది విగ్రహం, షణ్ముఖ కార్తికేయుడి రాతి విగ్రహం ఉన్నాయి. దీంతో దేశ పురాతన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే దిశగా, చట్టవిరుద్ధ రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో ఓ ముందడుగు పడినట్టయింది. భారతీయ శిల్పకళా వైభవానికి, అపార సాంస్కృతిక చరిత్రకు నిదర్శనమైన ఈ కళాఖండాలు చోళులు, విజయనగర రాజుల కాలం నాటివి. తిరిగా రాబోతున్న ఈ కళాఖండాలలో తమిళనాడులోని తిరువారూర్ జిల్లా, కొల్లుమాంగుడిలో కొలువై ఉన్న శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన రెండు ముఖ్యమైన లోహా, రాతి శిల్పాలు ఉన్నాయి. అందులో మొదటిది త్రిశూలం. దీని పైభాగంలో ఉగ్రరూపంలో ఉన్న భద్రకాళి అమ్మవారి ప్రతిమ అత్యంత కళాత్మకంగా చెక్కారు కళాకారులు. శైవ శాక్తేయ సంప్రదాయాల ప్రకారం ఈ త్రిశూలం దుష్టశిక్షణ, దైవిక శక్తి, రక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది దాదాపు 13వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నారు. అదే కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన మరో అరుదైన రాతి శిల్పం నంది విగ్రహం. పరమశివుడి వాహనమైన ఈ నందిని తమిళ శైవ శిల్ప సంప్రదాయంలో అత్యంత సహజసిద్ధంగా తీర్చిదిద్దారు. మెడలో గంటలు, అందమైన పూలదండలతో ప్రశాంత వదనంతో పడుకుని ఉన్న భంగిమలో ఉన్న ఈ నంది శిల్పం చోళుల నాటి శిల్పకళా శైలిని కలిగి ఉంది. శైవ క్షేత్రాల్లో మహాశివుడి గర్భగుడికి అభిముఖంగా కనిపించే నంది విగ్రహం నిస్వార్థ భక్తి, బలం, ధర్మానికి ప్రతీక. వీటితో పాటు తంజావూరు జిల్లా మానంబాడిలో కొలువైన ప్రసిద్ధ నాగనాథస్వామి దేవాలయానికి చెందిన ఆరు తలల కార్తికేయుడి రాతి విగ్రహం కూడా త్వరలోనే భారత్‌కు రానుంది. 11వ శతాబ్దంలో మొదటి రాజేంద్ర చోళుడి కాలంలో నిర్మితమైన ఈ ఆలయంలో కార్తికేయుడి ఈ ఆరు ముఖాల రూపం అపారమైన దివ్య జ్ఞానం, శౌర్యాం, రక్షణను సూచిస్తుంది. 12 చేతుల్లో విభిన్న ఆయుధాలను ధరించి, పక్కనే వాహనమైన నెమలితో కూడి ఉన్న ఈ ఐతిహాసిక శిల్పం చోళుల కాలపు శిల్పకళా ప్రాభవానికి అద్దం పడుతోంది.

సంక్షిప్త వార్తలు

అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి

వాషింగ్టన్, జులై 9: హెచ్-1బి వీసా దుర్వినియోగాలకు పాల్పడే వారిపై అమెరికా చేపట్టిన చర్యలపై అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందించారు. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలని పునరుద్ఘాటించారు. వీసా మోసాలకు పాల్పడే వారిపై అమెరికా కార్మిక శాఖ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని, విచారణ నిమిత్తం కొంతమందికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. విస్కాన్సిన్‌లో జరిగిన ఓకార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ.. 'అత్యున్నత ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలు, వైద్యులు, సాంకేతిక నిపుణులు అమెరి కాలో పనిచేసేందుకు వీలుగా హెచ్-1బి వీసాను రూపొందించాం. కానీ, కొన్ని పెద్ద కంపెనీలు, వ్యక్తులు ఈ వీసా విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుని అమెరికా కార్మికు ఉపాధిని దెబ్బతీస్తున్నారు.వీసా దుర్వినియోగం చేసేవారిని ఇకపై ఉపేక్షించబోం. అలాంటి వారికి అమెరికాలోకి ప్రవేశం ఉండదు అని స్పష్టం చేశారు.

స్వాజ్ బెనిఫిట్స్‌కు స్వలింగ సంపర్కులు అనర్హులు

ముంబై: స్వలింగ సంపర్కుల జంట పెట్టుకున్న అభ్యర్థనను ఆదాయపన్ను శాఖ కొట్టిపారేసింది. వివాహ చట్టం ప్రకారం కానుకలపై ఇచ్చే ఆదాయపన్ను మినహాయింపును తమకు కూడా కల్పించాలని కోరుతూ ఓ స్వలింగ సంపర్కుల జంట బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆదాయపన్ను శాఖలోని సెక్షన్ 56(2)(ఎక్స్) కింద కలిగే బెనిఫిట్స్ తమకు కూడా ఇవ్వాలని కోరుతూ సేమ్‌సెక్స్ జంట కోరింది. పాయో ఆశిహో, వివేక్‌దివాన్ అనే జంట ఈపిటీషన్ వేసింది. తమకు పన్ను మినహాయింపు ఇవ్వకపోవడం అనైతికమని స్వలింగ సంపర్కుల జంట వాదించింది. స్వలింగ సంపర్కుల జంట పెట్టుకున్న అభ్యర్థనను ఆదాయపన్ను శాఖ వ్యతిరేకించింది. పెళ్లి కానుకలపై జీవితభాగస్వాములు మినహాయింపు కోరడం చట్టం ప్రకారం వర్తిస్తుందని, కానీ పాయో, వివేక్‌లు దంపతులు కారు అని, వాళ్లు కేవలం స్వలింగ సంపర్క భాగస్వాములు మాత్రమే అని, వారికి ఆదాయపన్ను శాఖ చట్టాలు వర్తించవన్నారు.

కరూర్ బాధితులకు ఉద్యోగాలు

చెన్నై,జులై 9: తమిళనాడు సిఎం విజయ్ శుక్రవారం కరూర్‌లో పర్యటించను న్నారు. 2025, సెప్టెంబర్ 27వ తేదీన కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో సుమారు 41 మంది మృతిచెందిన విషయంతెలిసిందే. టీవీకే ప్రచార సభకు హాజరైనజనం నటుడు విజయ్‌ను చూసేందుకు ఎగబడ్డారు. అయితే కరూర్ తొక్కిసలాటకు చెందిన సుమారు 32 మంది బాధిత కుటుంబాలకు రేపు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్ మెంట్ ఆర్డర్లను అందజేయను న్నారు. ఈపర్యటన సందర్బంగా ప్రభుత్వ సంక్షేమపథకాల లబ్ధిదారులకుకూడా ఆయన సాయం చేయనున్నారు.

300కుపైగా ఫైవ్‌స్టార్ హోటళ్లకు టోకరా

న్యూఢిల్లీ,జులై 9: దేశవ్యాప్తంగా గత మూడు దశాబ్దాలుగా 300కుపైగాలగ్జరీ హోటళ్లను బురిడీ కొట్టించిన తమిళనాడుకు చెందిన 69 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ గుర్తింపులతో ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేసి, బిల్లులు చెల్లించకుండా పరారయ్యేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని బింగ్సన్ జాన్‌గా గుర్తించారు. విదేశీ టూరిస్ట్ గైడ్, ఇంగ్లీష్ టీచర్, యోగా ట్రైనర్ వంటి వేర్వేరు గుర్తింపులతో ఫైవ్‌స్టార్ హోటళ్లలో గదులు బుక్ చేసుకుని, పలురోజులు అక్కడే ఉంటూ హోటల్ సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకునేవాడు. అనంతరం బిల్లు చెల్లించకుండా అక్కడి నుంచి వెళ్లిపోయేవాడు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ హయత్ హోటల్‌ను లక్ష్యంగా చేసుకున్న జాన్, అక్కడ రెండు రోజుల పాటు బస చేసి రూ.63,755 విలువైన బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయాడు. సుమారు రూ.1.48 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ను కూడా తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.హోటల్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో యాంటీ క్రైమ్ అండ్ సైబర్ యూనిట్, టెలీబాంధా పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. మొబైల్ ఫోన్ కాల్ డేటా, పత్రాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి ఒడిశాలోని భువనేశ్వర్‌లో అతడి ఆచూకీని గుర్తించారు. రాయ్‌పూర్ పోలీసుల ప్రత్యేక బృందం 72 గంటల్లోనే అతడిని అదుపులోకి తీసుకుని, "ఆఫీస్ పని కోసం" తీసుకెళ్లానని చెప్పిన దొంగిలించిన ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుంది.

నాణ్యమైన వైద్యవిద్యకు పటిష్ట చర్యలు

2026-27 రెండో త్రైమాసికంలో బడ్జెట్ వినియోగంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష

విజయవాడ.జులై9,ప్రభాతవార్తప్రతినిధి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అతి కీలకమైన ప్రొఫెసర్ల పోస్టుల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉండడంతో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపును పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ వైద్య సంఘం (ఎన్ఎంసీ) ప్రమాణాల మేరకు ఒక ప్రొఫెసర్ పోస్టుకు మూడు పీజీ సీట్లను కేటాయించడం జరుగుతోంది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 70 సంవత్సరాలుగా ఉండడంతో ప్రొఫెసర్ల లభ్యత పెరిగి పీజీ సీట్లు ఎక్కువగా పొందడం జరుగుతోంది. రాష్ట్రంలోని 17ప్రభుత్వ వైద్య కళాశాలల్లో దాదాపు 800 ప్రొఫెసర్ల పోస్టులకుగాను 200 ఖాళీగా ఉంటుండడంతో దీని ప్రభావం వైద్య విద్య ప్రమాణాలపై పడడంతోపాటు పీజీ సీట్లను కోల్పోయే పరిస్థితి ఎదురవుతోంది. మరీ ముఖ్యంగా 16 సూపర్ స్పెషాల్టీ విభాగాల్లో 159 ప్రొఫెసర్ల పోస్టులకుగాను 106 (66శాతం) ఖాళీలు ఉండడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. నిబంధనల ప్రకారం పదోన్నతుల ద్వారా ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. వివిధ విభా గాల్లో పదోన్నతికి అర్హులైన వారు లేకపోవడంతో ఖాళీలు పేరుకుపోతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరిం చేందుకు ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలించేందుకు సమగ్ర ప్రతిపాదనను రూపొందించాలని డాక్టర్ విష్ణువర్ధన్‌ను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో 2026- 27 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో బడ్జెట్, కేంద్ర సాయం వినియోగ తీరుపై ఉన్నతాధికారులతో సమగ్రంగా మూడు గంటలకుపైగా మంత్రి సమీక్షించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు అతి కీలకమైన నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సవర్థులైన వైద్యుల అవసరం ఉన్నందున రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్య విద్య అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశం చారు.

గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అదనంగా 230 ఎంబీబీఎస్, 250 పీజీ సీట్లలో ప్రవేశాలు కల్పించినట్లు విశ్వవిద్యాలయం అధికారులు మంత్రికి తెలిపారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 75శాతం హాజరు ఉన్న వైద్య విద్యార్థులు మాత్రమే వార్షిక పరీక్షలకు అర్హులని, ఈ విషయంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దని మంత్రి స్పష్టంచేశారు. విద్యార్థుల హాజరు నమోదుకు ప్రస్తుతం అమలవుతున్న వ్యవస్థపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొత్తం వార్షిక బడ్జెట్ కేటాయింపు రూ.18,216 కోట్లు కాగా మొదటి త్రైమాసికం (ఏప్రిల్- జూన్)లో రూ. 4,130 కోట్ల వ్యయం (22.72 శాతం) జరిగినట్లు సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. ప్రతిపాదిత మొత్తం కేంద్ర సాయం రూ.2,308 కోట్లు కాగా జూన్ వరకు రూ.357 కోట్ల(15 శాతానికిపైగా)ను వినియోగించినట్లు అదికారులు తెలిపారు. మొత్తం వ్యయం సరళి కొంతమేరకు బాగానే ఉన్నా కేంద్ర సాయాన్ని తక్కువ మోతాదులో వాడుకోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకుగల కారణాలను ఆయన అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువరన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భారత్ టెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక పెవిలియన్

14 నుంచి న్యూఢిల్లీలో భారత్ టెక్స్-2026

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు

విజయవాడ, జులై 9, ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ చేనేత, జౌళి, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జులై 14నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే భారత్ టెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని చేనేత, జౌళి, అపారెల్, గార్మెంట్ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను, ఎగుమతి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పనుంది.భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ హాల్ నంబర్-9, స్టాల్ నంబర్-95లో ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేసింది. గత రెండు ఎడిషన్లలో విజయవంతంగా పాల్గొన్న అనుభవంతో ఈసారి మరింత విస్తృత స్థాయిలో రాష్ట్ర టెక్స్‌టైల్ రంగాన్ని ఆవిష్కరించనుంది. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని చాంపియన్, ఆస్పిరేషనల్ జిల్లాలకు చెందిన 40 మంది పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. వీరికి అంతర్జాతీయ కొనుగోలుదారులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యే అవకాశం లభించడంతో పాటు కొత్త వ్యాపార భాగస్వామ్యాలు, ఎగుమతి అవకాశాలు, ప్రపంచ మార్కెట్లపై అవగాహన పెంపొందే అవకాశం కలగనుంది. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆలోచనల మేరకు చేనేత ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడం, నేతన్నలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, పారిశ్రామికవేత్తలకు కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

ఐదుగురు సీనియర్ అధికారులకు ఐఏఎస్ హోదా

విజయవాడ,జులై9, ప్రభాతవార్తప్రతినిధి: నాన్‌స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో ఐదుగురు సీనియర్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందుకు సంబంధించి డీవోపీటీ అండర్ సెక్రటరీ కవిత ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన పి.గోపినాథ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జి.బాలకృష్ణ, రాష్ట్ర పన్నుల శాఖకు చెందిన ఎం.జయకృష్ణ, పరిశ్రమల శాఖకు చెందిన ఎ.ఎ.ఎల్.పద్మావతి, జైళ్ల శాఖకు చెందిన ఎం.వరప్రసాద్ ఐఏఎస్‌కు ఎంపిక అయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి డీవోపీటీ పంపించింది.2023-24, 2024-25కు సంబంధించి నాన్‌స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో ఆరు ఐఏఎస్ పోస్టులు ఖాళీ ఉండగా ప్రభుత్వం ఐదు పోస్టులను భర్తీ చేసింది. ఆరు పోస్టులకు 69మంది సీనియర్ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో సర్వీస్ ట్రాక్ బాగున్న 29 మంది అధికారులను ఎంపిక చేసిన ప్రభుత్వం, పేర్లను యుపీఎస్సీకి పంపించింది. డిసెంబరు 29,30 తేదీల్లో వారికి ఇంటర్వ్యూలను నిర్వహించింది.స్టేట్ సివిల్‌సర్వీసెస్ కోటాలో సీనియర్ రెవెన్యూ అధికారి గేదెల శ్రీను కుమార్ ఐఏఎస్‌కు ఎంపిక అయ్యారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక నోటిఫికేషన్ డీవోపీటీ జారీ చేసింది. ఆమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కూడా ఉత్తర్వు జారీ చేశారు.

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొల్లు

భూమి హక్కుదారులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ,జులై 9, ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యల్ని పరిష్కరించి, ప్రజలకు వారి ఆస్తిపై పక్కాగా హక్కు కల్పించే లక్ష్యంతో పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం గోకవరం గ్రామంలో ‘మీ భూమి మీ హక్కు’కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు గతో కలిసి పాల్గొని రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. అనం తరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కష్టపడుతున్నా రన్నారు. గతంలో సర్వే రాళ్లపై, పట్టాదారు పాస్ పుస్తకాలపై కూడా జగన్ రెడ్డి తన బొమ్మలేసుకున్నారన్నారు. గత ఐదేళ్ల రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్థం చేశారు. కూటమి వచ్చాక వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసి. నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజల్ని కాపాడేలా చర్యలు తీసుకున్నామన్నారు.

బందరు నార్త్ మండలంలోని ఐదు గ్రామాల్లో సుమారు 1966 మందికి, సౌత్ మండలంలో నెలకుర్రులో 851 మంది మొత్తంగా 2817 మందికి చెందిన భూములు రీ సర్వే చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిం చామన్నారు. ప్రణాళికా బద్ధంగా మచిలీపట్నం నియోజక వర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

29 గ్రామాల ప్రతినిధులతో

ప్రత్యేక కమిటీ

అమరావతి రైతు జెఏసి కీలక నిర్ణయం

విజయవాడ,జులై9, ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేం దుకు అమరావతి రైతు జేఏసీ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని మొత్తం 29 గ్రామాల ప్రతినిధులతో ఒక ప్రత్యేక అభివృద్ధికమిటీని త్వరలోనే ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు తీర్మానించారు.ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అసలైన రైతుల ఉమ్మడి సమస్యలు పక్కదారి పడుతున్నాయని జేఏసీ అభిప్రాయపడింది. అందుకే అందరి తరఫున మాట్లాడేలా ఒక అధికారిక కమిటీని తేవాలని నిర్ణయించింది.

తెలంగాణ మంత్రి సీతక్కకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి: తెలంగాణ మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా ఏపీ సీఎం చంద్ర బాబు ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసేవలో మీరు మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో ఉండాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను అని తన సందేశంలో పేర్కొన్నారు. ఎక్స్ వేదికపైనే మంత్రి నారా లోకేశ్ కూడా సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెను అణగారిన వర్గాల గొంతుకగా అభివర్ణిస్తూ, ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడుతూ లోకేశ్ ట్వీట్ చేశారు.

జీరుపాలెంలో భూపోరాటం

26యేళ్ల క్రితం మోసపూరితంగా పొందిన పట్టాలను రద్దు చేయాలని డిమాండ్, రంగంలోకి దిగిన తహసీల్దార్, ఎస్ఐ

న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించిన గ్రామస్థులు

రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 9 ప్రభాతవార్త : నాయకులమని చెప్పుకుంటూ 26 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టాలు చేయించుకున్న వారిపై శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండలంలో జీరుపాలేం, జగన్నాధపురం గ్రామస్థులు తిరుగుబాటు చేశారు. గ్రామస్తులను మోసం చేసి పొందిన అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేసి, జీరుపాలేం పంచాయతీలో ఇళ్ల లేని నిరుపేదలున్నారని వారికి ఇళ్ల స్థలాలుగా మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వివాదాస్పద భూముల వద్ద సుమారు 400 మంది గ్రామస్థులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అసలు ఏం జరిగిందంటే గత 2000 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో, అప్పటి ఎచ్చెర్ల ఎమ్మెల్యే కావలి ప్రతిభాభారతి హయాంలో జీరుపాలేం పంచాయతీకి చెందిన 720 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను మంజూరు చేశారు. అయితే ఆ సమయంలో జీరుపాలేంలో మిగిలిన మరో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామంలో పెద్దలుగా చలామణి అవుతున్న ఐదుగురు వ్యక్తులు తమ పేర్లపై దొంగచాటుగా పట్టాలు చేయించుకున్నారు. నాడు నమ్మించి.. నేడు వంచించి అప్పట్లో దీనిపై గ్రామస్థులు సదరు పెద్దలను నిలదీయగా పట్టాలు మా పేరున ఉన్నప్పటికీ, ఈ భూమి గ్రామస్థులందరికీ చెందుతుంది అని నమ్మబలికారు. అమాయక గ్రామస్థులు వారి మాటలను నమ్మారు. కానీ, ఇటీవల ఆ 20 ఎకరాల భూమిని సదరు పట్టాదారులు సొంత లాభం కోసం చదును చేయడంతో అసలు రంగు బయటపడింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు వారి పనులను అడ్డుకున్నారు.

ఉద్రిక్తంగా మారిన ఆందోళన - అధికారుల ఎంట్రీ: తమకు జరిగిన అన్యాయంపై గురువారం గ్రామస్థులంతా ఏకమై సదరు వివాదాస్పద భూముల వద్ద భారీ ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రణస్థలం తహసీల్దార్ ఎస్. కిరణ్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి తమ సిబ్బందితో కలిసివెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలునాడు దొంగచాటుగా పొందిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని, గ్రామంలో ఇళ్లస్థలాలులేని అర్హులైన నిరుపేదలకు ఆ భూమిని ఇళ్లస్థలాలుకు కేటాయించాలని గ్రామస్థులంతా అధికారులను ముక్తకంఠంతో కోరారు.

హామీతో సద్దుమణిగిన వివాదం: గ్రామస్థుల విన తిని, వారి ఆవేదనను ఆలకించిన తహసీల్దార్, ఎస్ఐ స్పందిస్తూ ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టప్రకారం తగిన న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారుల నుంచి సానుకూల స్పందన రావడంతో గ్రామస్థులు తమ ఆందోళనను విరమించారు.

కాపులూ.. కాంగ్రెస్‌తో కలవండి ముఖ్యమంత్రిని చేస్తాం

కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై9, ప్రభాతవార్త: ఆంధప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు కాపులు ఒక్క రోజు కూడా ముఖ్యమంత్రి కాలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సుమారు 20శాతం జనాభా కలిగి, ఓటర్లలో అత్యధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గం రాజకీయంగా తీవ్ర నిర్లక్ష్యానికి,అణచివేతకు గురైందన్నారు. జగన్, చంద్రబాబు ఇరువురూ కాపులను ముఖ్యమంత్రిగా అంగీకరించరని,వారు లేదా వారి వారసులను మాత్రమే ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేసుకుంటారని తెలిపారు.కాపు సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, ముఖ్యమంత్రి అవుతారని చింతా మోహన్ పేర్కొన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కావాలని కోరుతున్నారని,వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, తప్పకుండా అధికారంలోకి రాగానే రాజ్యాంగ సవరణ చేసి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇస్తామన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో జయలలితకు ఒక న్యాయం?జగన్‌కు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. జగన్‌కు మోడీ మద్దతు ఉందన్నారు. అందుకే కేసులు విచారణ ఆలస్యం అవుతోందన్నారు.

జాతీయ రహదారిపై విషాదం

కారు ఢీకొని మహిళ మృతి, భర్తకు తీవ్రగాయాలు

పూతలపట్టు, జులై 9 ప్రభాతవార్త: చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై పి కొత్తకోట బస్టాండ్ సమీపంలో గురువారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోటుగనుమ గ్రామానికి చెందిన కృష్ణయ్య, లలితమ్మ దంపతులు తిరుపతి నుంచి వచ్చి పి కొత్తకోట వద్ద బస్సు ఉదయం 9:45 నిమిషాలకు దిగి జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లలితమ్మ తీవ్ర గాయాలపాలై ఘటన స్థలంలోనే మృతి చెందారు. కృష్ణయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తిమ్మయ్య ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన వివ రాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గురువు సన్నిధిలో అక్షరాభ్యాసం, చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట: ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి


శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగిన సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి,జులై 9 ప్రభాతవార్త: పుణ్యక్షేత్రం అయిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురువు దక్షిణామూర్తి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయటం వారి భవిష్యత్తుకు బంగారు బాట అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. దేవాదాయశాఖ ఆదేశాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశులు పట్టణంలోని చిన్నారులకు ‘సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను’ గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా వచ్చారు.పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ బిడ్డలను అక్షరాలు దిద్దించుటకు హాజరయ్యారు. సామూహిక అక్షరాభ్యాసం సందర్భగా ఆలయ ప్రధానార్చకులుడాక్టర్‌స్వామినాధన్ గురుకుల్ పూజలు నిర్వహించారు.చదువుల గురువు దక్షిణామూర్తి సన్నిధిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం తన పూర్వజన్మ సుకృతమన్నారు. విద్యారంభాన్ని దైవ సన్ని ధానంలో నిర్వహించటం మన భారతీయ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయం అన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ఇది మార్గదర్శకం అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులచే ఆయన అక్షరాలు దిద్దించారు. తరువాత వారి తల్లిదండ్రులతో మమేకమయ్యారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి: ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో 16కాళ్ళమండపం వద్ద ఎంఎల్ఏ మాట్లాడుతూ నేడు ప్రభుత్వం నిరుపేదల విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ బడుల్లోనే ఈ ఏడాది సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది ప్రైవేటు నుంచి సుమారు లక్షమందికి పైగా ప్రభుత్వ బడుల్లో చేరటం ప్రతి తల్లిదండ్రి గుర్తించాలని పిలుపు నిచ్చారు. అర్హత కల్గిన ఉపాధ్యాయుల్ని నియమించాము. యూనిఫారం, పుస్తకాలు, బస్సు సదుపాయాలు కల్పించామన్నారు.కాబట్టి ప్రతి తల్లిదండ్రి తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ స్వామి అమ్మవార్ల ప్రసా దాలను అందించారు. వేదపండితులచే ప్రత్యేకా శీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు కోలా వైశాలి, కె.నాగరాజు, జి.గోపినాథ్, డిలక్ష్మమ్మ, శైలజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతుల భాగస్వామ్యమే లక్ష్యం

20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్

విజయవాడ,జులై 9,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని రైతులు న్యాచురల్ ఫార్మింగ్ విధానంలో పెద్ద ఎత్తున సాగుకు సిద్ధమయ్యేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించాయని,2035 నాటికి మన రాష్ట్రంలో 60 లక్షలకు పైగా రైతుల ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం లక్ష్యంగా పనిచేస్తున్నామని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ సేద్యం సాగు పెంపుపై వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్,ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫైయింగ్ అథారిటి ఛైర్మన్ శ్రావణ్ దత్ లతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలోని అంశాలను ఆయన ఏపీ సచివాలయంలోని తన ఛాంబర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ ప్రకృతి సేద్యంపై రైతుల ఆసక్తిని పెంచి వారికి లాభార్జన కలిగించటంతో పాటు పర్యావరణ హితానికి మన వంతు సహకారం అందించడం, అలాగే భూమి తల్లిని రసాయన ఎరువుల నుండి కాపాడటమే లక్ష్యంగా 2016లో అడుగులు వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు, 20 లక్షల ఎకరాల్లో, 8168 గ్రామాల్లో నేచురల్ ఫార్మింగ్ చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. 2035 నాటికి 60 లక్షల మంది రైతులు, 20 లక్షల కుటుంబాలు ప్రకృతి సేద్యంలో భాగస్వామ్యం అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.
ఇప్పటి వరకు రూ.1560 కోట్లు ప్రకృతి సేద్యం పెంపుపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించాయన్నారు.వీటిలో 1250 కోట్లు కేంద్ర ప్రభుత్వం, రూ.310 కోట్లు వివిధ సేవా దృక్పదం ఉన్న దాతలు సమకూర్చారని వివరించారు.ఇక రాబోయే 5 సంవత్సరాల్లో వ్యయం రూ.3800 కోట్లు గా అంచనా వేయడం జరిగిందన్నారు.40 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి సేద్యం సాగును పెంచడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి రక్షణను ఇవ్వాలన్న దృక్పదంతో 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.321 కోట్లను కేటాయించాలన్న ప్రతిపాదన చేయడం జరిగిందన్నారు.ఇప్పటికే రాష్ట్రానికి రూ.100 కోట్లు కేంద్రం విడుదల చేసిందన్నారు. క్యాబినెట్ ఆమోదం అనంతరం బ్యాలెన్స్ నిధులు రాష్ట్రానికి అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిధుల విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖను సైతం కేంద్రానికి పంపడం జరిగిందన్నారు.ఇప్పటికే అందిన రూ.100 కోట్ల నిధులతో 9170 గ్రామ పంచాయితీల్లో కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫైడ్ ఛైర్మన్ దత్ నేషనల్ ఫార్మింగ్ సర్టిఫికెట్ తీసుకోవడంలో రైతులు మరింత చైతన్యం కావాలని పిలుపునిచ్చారని ఈ సందర్భంగా లంకా దినకర్ తెలిపారు.కావున ప్రకృతి సేద్యాన్ని చేస్తున్న రైతులు అందరూ సర్టిఫికెషన్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకాశం డెయిరీని మళ్లీ పునఃప్రారంభించాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్‌ను కోరడం జరిగిందన్నారు.2019-24 మధ్య గత ప్రభుత్వం అమూల్‌కు కట్టబెట్టాలని చూడటంతో మేము సమర్థవంతంగా అడ్డుకోవడం జరిగిందని ఛైర్మన్ లంకా దినకర్ ఈసందర్భంగా గుర్తుచేశారు.

బిసి గృహ విద్యుత్ వినియోగదారులకు శుభవార్త

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో పిఎం సూర్యఘర్ పథకం కింద బిసి గృహ విద్యుత్ వినియోగదారులకు ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర సబ్సిడీకి అదనంగా రూ.20 వేల ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. నెలకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ వినియోగం కలిగిన 27.2 లక్షలమంది వెనుకబడిన వర్గాల వినియోగదారులకు వారికి ప్రయోజనం చేకూర్చనుంది. ఇందుకుగానూ రూ.5,445.7 కోట్లు వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్ సంస్థల్లో 62 సంవత్సరాల సర్వీస్ అమలుపై

అధ్యయనానికి ఆరుగురు సభ్యుల కమిటీ

15రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఎపిపిసిసి సమావేశంలో నిర్ణయం

విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వుల అమలును ఎపి విద్యుత్ సంస్థల్లో పరిశీలించేందుకు ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఎపిపిసిసి) నిర్ణయించింది. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎపిపిసిసి చైర్మన్ కె. విజయానంద్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డిస్కంల సిఎండిలు శివశంకర్ లోతేటి, పృథ్వీతేజ్ ఇమ్మడి, ఎపి జెన్‌కో ఇన్‌చార్జ్ ఎండి, సిపిడిసిఎల్ సిఎండి పి. పుల్లారెడ్డితో పాటు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. 62 సంవత్సరాల సర్వీస్ అమలు వల్ల విద్యుత్ సంస్థలపై, తద్వారా వినియగదారులపై పడే ఆర్థిక భారం, విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొనే పరిస్థితులు, ప్రధానంగా క్షేత్రస్థాయిలో లైన్‌మెన్‌లు ఎదుర్కొనే పరిస్థితులు, పరిపాలనా పరమైన అంశాలు తదితర విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేసి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు.

కమిటీ నివేదిక ఆధారంగా ఈ అంశంపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ కమిటీలో ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఎపి జెన్‌కో ఎండి, సిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, డిస్కంల సిఎండిలు శివశంకర్ లోతేటి, పృథ్వీతేజ్ ఇమ్మడి, లీగల్ అడ్వైజర్ శివారావు సభ్యులుగా వ్యవహరిస్తారు.

జిల్లాలో సర్ క్షేత్ర స్థాయి పరిశీలన జరిపిన

కేంద్ర ఎన్నికల సంఘ అధికారులు

మూడు నియోజక వర్గాల్లో సుడి గాలి పర్యటనలు

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త :

జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)ను పరిశీలించడం కోసం జిల్లాకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ గురువారం ఉదయం విశాఖపట్నం జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాలలో సర్ క్షేత్ర స్థాయి సుడి గాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా వారు విశాఖ ఉత్తర, పశ్చిమ, భీమునిపట్నం నియోజకవర్గాల పరిధిలో కొనసాగుతున్న సర్ కార్యక్రమం పని తీరును పర్యవేక్షించేందుకు పలు చోట్ల పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి క్షేత్ర స్థాయి పరిశీలనలు జరిపారు. తమ సుడి గాలి పర్యటనలో భాగంగా మొదట పశ్చిమ (తరువాయి 8వ పేజీలో)

ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో

విశాఖ ఆదర్శంగా నిలవాలి

కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్

విశాఖలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో ప్రత్యేక సమీక్ష, పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని అత్యధికంగా ఓటర్లు కలిగిన జిల్లాల్లో విశాఖపట్టణం ఒకటని, ఇక్కడ నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అందరూ కలిసి కట్టుగా పని చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పరిశీలనలో భాగంగా గురువారం విశాఖపట్టణం విచ్చేసిన వారు ముందుగా కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఇతర అంశాల గురించి తెలుసుకున్నారు. ఈఎఫ్ పత్రాల (తరువాయి 8వ పేజీలో)

ఎందుకీ నిర్లక్ష్యం..

ఇంకెంతకాలం ఈ బతుకులు

జ్ఞానాపురం, జూలై 9, ప్రభాతవార్త

ఎందుకీ నిర్లక్ష్యం ... తప్పెవరిది ... వాతావరణ పరిస్థితులను ముందగా ఫోర్‌కాస్ట్ చేయడంలో ఎవరిదీ నిర్లక్ష్యం. తప్పెవరిదైనా ఆరుగురు మత్స్యకారులు సజీవ జలసమాధి అయినట్టు ప్రభుత్వ యంత్రాంగం తేల్చింది. మంత్రి వచ్చారు, మృతుల కుటుంబాలకు చెరో 10 లక్షలు ఇచ్చేసి చేయి దులుపుకున్నారు. మళ్ళీ యధాతదా పరిస్థితి కొనసాగనుంది. సముద్ర జలాల్లోకి వెళ్లిన మత్స్యకారులు తిరిగి వచ్చేదాకా కుటుంబాలు ఎంతబాద అనుభవించాలి. ఈ పరిస్థితులకు ఫుల్‌స్టాప్ పడేదెలా.

- **మెకనైజ్‌డ్ బోట్లకు జీపిఎస్ ఏర్పాటు చేయాలి ...**
- **వాతావరణ మార్పులపై మత్స్యకారులను అప్రమత్తం చేయడంలో విఫలమైన యంత్రాంగం**

ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపద్యంలో జిల్లాకు అధిపతిగా ఉన్న జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులు ఎందుకు బాధ్యత తీసుకోరు. విశాఖ వాతావరణశాఖతో పాటు ఇండియన్ మెట్రోలాజికల్ డిపార్టమెంట్ (ఐఎండి) వాతావరణ పరిస్థితులపై ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తోంది. ఆయా హెచ్చరికలతో మత్స్యకారులను జిల్లా యంత్రాంగం ఎందుకు అలెర్ట్ చేయలేదన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. అనుకూల వాతావరణం లేకపోతే మత్స్యకారులను సముద్రంలోకి వెళ్ళకుండా ఎందుకు నిరోధించలేకపోయారన్న ప్రశ్నకు సమాధానం లేదు. వాతావరణ శాఖ, రాష్ట్ర మత్స్యకార శాఖలు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనే పనిచేస్తాయి. అలాంటి పరిస్థితిలో కలెక్టర్ ముందస్తుగా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా నిరోదించడంలో విఫలం చెందారని మత్స్యకారులు బావిచడంలో తప్పెంటి. గత పదిరోజులుగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి ఏర్పడి గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలున్నట్టు ముందస్తుగా వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ జిల్లా యంత్రాంగం ఎందుకు ఈ సమాచారాన్ని మత్స్యకారులకు చేరవేయలేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికలు జారీ చేస్తున్నా మత్స్యకారులు వినడం లేదని బావిస్తే ఆయా బోట్లకు జిపిఎస్ విధానాన్ని ఎందుకు అమలు పర్చడం లేదు. జీపిఎస్, నేవిగేషన్ ఆదునాతన విధానాలను మత్స్యకార మెకనైజ్‌డ్ బోట్లకు ఎందుకు ఏర్పాటు చే యడం లేదు. మెరైన్ పోలీస్ స్టేషన్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం ఎందుకు (తరువాయి 8వ పేజీలో)

ఇటీవల సముద్రంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకార బాధిత కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ను కలిసి పరిహారం పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఎన్ఆర్ఎక్స్ ఔషధాల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త :

ప్రజారోగ్య పరిరక్షణతో పాటు ఎన్ఆర్ఎక్స్ (హ్యాబిట్ ఫార్మింగ్, నార్కోటిక్) ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో గురువారం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్త ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్ రజిత ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ఏడుగురు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు నగరంలోని 32 మెడికల్ షాపులను తనిఖీ చేశారు. మహారాణిపేట, దొండపర్తి, రైల్వే న్యూ కాలనీ, అరిలోవ, కొమ్మాడి, మధురవాడ, ఆదర్శ్‌నగర్, గాజువాక, కూర్మన్నపాలెం, (తరువాయి 8వ పేజీలో)

- **విశాఖలో 32 మెడికల్ షాపులపై డ్రగ్స్ కంట్రోల్ శాఖ ఆకస్మిక తనిఖీలు..**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్

విశాఖ రాక

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త :

కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు వాయుమార్గం ద్వారా విశాఖ పట్నం చేరుకుంటారు. రాత్రి 7 గంటల నుండి అధికారులతో, సెయిలరుల సమావేశమవుతారు. 11వ తేది ఉదయం 9-50 గంటలకు నేవల్ డాక్ యార్డ్‌లో 'మహేంద్ర గిరి' కమిషనింగ్ సెరెమొనీ లో పాల్గొం టారు. అనంతరం విశాఖపట్నం నుండి వాయుమార్గం ద్వారా డిల్లీ వెళతారు.

విశాఖ సిటీలో 16 మంది సీఐలకు

బదిలీలు

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ బగ్గీ

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త :

విశాఖ సిటీ పోలీస్ శాఖ పరిధిలో ఒకే సారి 16మంది సీఐలకు బదిలీ అయింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంక బ్రత బగ్గీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీపీగా బగ్గీ బాధ్యతలు స్వీకరించాక ఈ సంఖ్యలో బదిలీలు కావడం ఇదే తొలిసారి అని సహచర పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 13వ తేదీలోగా ప్రభుత్వ సూచనల ప్రకారం బదిలీలు పూర్తి చేయాలన్న లక్ష్యంతోనే ఇలా చేసి ఉంటారని తెలుస్తోంది. కాగా త్వరలో మరికొన్ని బదిలీలు కూడా ఉంటాయని చెబుతున్నారు.

తాజాగా జరిగిన బదిలీలల్లో.. భీమిలి సీఐగా ఉన్న బి. తిరుమల రావును వెస్ట్ సబ్ డివిజన్ క్రైం ఇన్స్పెక్టర్ గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మహారాణి పేట సీఐగా పని చేస్తున్న దివాకర్ యాదవ్‌ను వేశారు. ఆనం దపురం సీఐగా పని చేస్తున్న చింతా వాసు నాయుడ్ని గాజువాక సీఐగా వేశారు. ఆయన స్థానంలో టూటౌన్ సీఐగా పని చేస్తున్న ఎర్రన్నాయుడ్ని బదిలీ చేశారు. గాజువాక తాత్కాలిక సీఐగా పని చేస్తున్న నమ్మి గణేష్‌ను దువ్వాడ సీఐగా వేయగా, దువ్వాడలో పని చేస్తున్న కె. మల్లేశ్వరరావును హార్బర్ సీఐగా వేశారు. హార్బర్ సీఐ సీహెచ్ సింహాద్రి నాయుడుని సిటీ వీఆర్-1 బదిలీ చేయగా, సిటీ వీఆర్-5లో ఉన్న బి.సురేష్ ను ఎయిర్ పోర్ట్ ప్రోటోకాల్ ఆఫీసర్ గా వేశారు.

ఎయిర్ పోర్ట్ ప్రోటోకాల్ ఆఫీసర్ గా ఉన్న జీడీ బాబును సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్స్పెక్టర్ గా నియమించారు. వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎం. చంద్ర మౌళిని పద్మనాభం సీఐగా నియమించగా అక్కడ పని చేస్తున్న శ్రీధర్ సీఐని సిటీ వీఆర్-3లో (తరువాయి 8వ పేజీలో)

భోగాపురం తర్వాత విశాఖ సిటీ ఎయిర్‌పోర్టుకు

పునర్జీవం కల్పించాలి

విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త :

విశాఖపట్నం విమానాశ్రయాన్ని తూర్పు తీరంలో కీలక విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దడంలో నలుగురు మాజీ, ప్రస్తుత ఎంపీలు కీలక పాత్ర పోషించారని ఏపీఐ ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ ఓ. నరేష్ కుమార్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం నేపథ్యంలో విశాఖ విమానాశ్రయం సేవలు కొత్త దశలోకి అడుగు ఎడుతున్న వేళ వారి సేవలను గుర్తు చేసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. అయన మీడియాతో మాట్లాడుతూ, మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ డాక్టర్ దగ్గుబాటి పురం దేశ్వరి కృషితో విశాఖకు అంతర్జాతీయ విమానాశ్రయ హోదా లభించడంతో పాటు సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయని, 24 గంటల విమానాశ్రయ కార్యకలాపాలకు అనుమతులు లభించాయని తెలిపారు. మాజీ ఎంపీ కె. హరిబాబు హయాంలో దేశీయ విమాన సర్వీసులు గణనీయంగా పెరగడంతో పాటు దుబాయ్, సింగపూర్ అంతర్జాతీయ సర్వీసులు కొనసాగాయని, కార్గో టెర్మినల్ ప్రారంభం కావడంతో సముద్ర ఆహార, ఔషధ ఎగుమతులకు

ఊతం లభించిందన్నారు. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కృషితో బ్యాంకాక్, కౌలాలంపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయని, ఢిల్లీ, హైదరా బాద్‌కు అదనపు విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఎంపీ ఎం.శ్రీభరత్ కోవిడ్ అనంతరం అబుదాబీ అంతర్జా తీయ విమాన సర్వీసులను పునరుద్ధరించడంతో పాటు దేశీయ కార్గో సేవలు ప్రారంభించారని, భోగాపురానికి మారనున్న విమానాశ్రయ సిబ్బంది పునరావాసానికి చర్యలు చేపట్టారని

- **విమానాశ్రయ అభివృద్ధిలో నలుగురు ఎంపీల సేవలు చిరస్మరణీయం: ఏపీఐ సలహా కమిటీ సభ్యుడు డాక్టర్ ఓ. నరేష్ కుమార్**

కొనియాడారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం, ఈ ఏడాది జరగనున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌తో ఉత్తరాంధ్రలో డేటా సెంటర్లు, కృత్రిమ మేధ, గ్రీన్ హైడ్రోజన్, ఉక్కు, ఫార్మా, సెమీకండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే భోగాపురం విమానాశ్రయం పూర్తి స్థాయిలో స్థిరపడిన అనంతరం నగర నడిబొడ్డున ఉన్న 366 ఎకరాల విశాఖ సిటీ ఎయిర్‌పోర్టును ప్రాంతీయ విమాన సర్వీసులు, బిజినెస్ ఏవి యేషన్, విమాన మరమ్మతుల కేంద్రం (ఎంఆర్‌వో), కార్గో కార్యకలాపాలకు పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి డాక్టర్ ఓ. నరేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. విశాఖ విమానయాన రంగ అభివృద్ధికి ఏపీఐ, జీఎంఆర్, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఆయన తెలిపారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న తెదేపా కార్యకర్తను

పరామర్శించిన ఎంపీ శ్రీ భరత్

సముద్ర ప్రమాద బాధిత మత్స్యకారుడు చిన్నతో

ఫోన్‌లో మాట్లాడిన వైఎస్ జగన్

- **బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం, చిన్నకు ప్రత్యేక సాయం అందించాలని వైఎస్ఆర్‌సీపీ డిమాండ్**

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

విశాఖ సముద్రంలో పడవ బోల్తా పడిన ఘటనలో ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నతో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన

పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు వైఎస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని, అవసరమైతే తాను స్వయంగా విశాఖకు వస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ, భారీ అప్పులు చేసి కొనుగోలు చేసిన సుమారు రూ.50 లక్షల విలువైన పడవ సముద్రంలో మునిగిపోయిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన వైఎస్ జగన్, బోటుకు నష్టపరిహారం, బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ (తరువాయి 8వ పేజీలో)

సనాతన ధర్మంపై

దాడులను సహించబోం..

మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

- **అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చట్టాలు తీసుకురావాలని, మత మార్పిడులపై చర్యలు చేపట్టాలని 'ఎక్స్' వేదికగా డిమాండ్**
- **మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి 'ఎక్స్' వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు.**

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

'రావణ్‌లు, ప్రకాశ్ రాజ్‌లు ఎక్కడినుంచి పుట్టుకు వస్తున్నారు?
వీరికి మద్దతు ఇస్తున్నది ఎవరు?
వీరు ఏ సంస్కృతికి వారసులు?
వీరి తండ్రులు, తాతలు ఎవరు? వీరి మూలాలు ఎక్కడున్నాయి?
తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి.
హిందూ సోదరులు, నిజమైన భారతీయ దేశభక్తి భావాలు కలిగిన వారు కొన్ని విషయాల్ని గమనించాలి...

ఓసీల్లో ప్రధానంగా రెండు అధికార కులాల నుంచి కొద్దిమంది, కన్వర్ట్ అయిన వారు కన్వర్ట్ అయిన తరవాత కూడా, వారి కులాన్ని వదిలిపెట్టకుండా పేరు చివర కులాన్ని తగిలించుకుని వేరే మత వ్యవస్థల్ని నడిపిస్తూ ఆర్థికంగా, అధికార పరంగా, రాజకీయంగా లాభాలు పొందుతున్నారన్నది అందరూ గమనించాలి (రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మతంలో సగం కన్నా ఎక్కువ మంది పాస్టర్లు మతం మార్చుకున్న రెడ్లు (తరువాయి 8వ పేజీలో)

జిల్లాలో సర్ క్షేత్ర స్థాయి పరిశీలన జరిపిన కేంద్ర ఎన్నికల సంఘ అధికారులు

(7వ పేజీ తరువాయి)

నియోజకవర్గం 193 పోలింగ్ స్టేషన్ పరిధిలోని హ్యాపీ హోమ్ వద్ద, ఉత్తర నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ 30 పరిధిలో ను,భీమిలి పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ .280,281 లో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం స్థానిక ఓటర్లతో వారు సంభాషించారు. పలు చోట్ల సాగిన ఈ సర్ క్షేత్ర స్థాయి పోలింగ్ స్టేషన్ల పరిశీలన కార్యక్రమం లోకేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్.లతో పాటు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విశాఖపట్నం ఆర్డీవో దిలీప్ చక్రవర్తి తదితర సర్ కార్యక్రమం సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్‌లో మాట్లాడిన వైఎస్ జగన్

(7వ పేజీ తరువాయి)

ఇచ్చారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రిలో చిన్నను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ మీడియాతో మాట్లాడుతూ, గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణాలతో బయటపడిన చిన్నకు ప్రత్యేక ఆర్థిక సాయం, మునిగిపోయిన పడవకు పూర్తి నష్టపరిహారం అందించాలని కోరారు.
ప్రమాద సమయంలో రక్షణ చర్యల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించిన వారు, మత్స్యకారుల భద్రత కోసం శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఎన్ఆర్ఎక్స్ ఔషధాల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

(7వ పేజీ తరువాయి)

శ్రీహరిపురం ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో ఎన్ఆర్ఎక్స్ ఔషధాల కొనుగోలు, విక్రయ రికార్డులతో పాటు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, నిబంధనల అమలును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.
తనిఖీల్లో నార్కోటిక్ ఔషధాలకు సంబంధించి ఎలాంటి ఉల్లంఘనలు గుర్తించకపోయినా, అన్ని మెడికల్ షాపుల యజమానులు, ఫార్మసిస్టులకు ఎన్ఆర్ఎక్స్ ఔషధాలను వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే విక్రయించాలని, కొనుగోలు--విక్రయాల రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని కఠినంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రజిత మాట్లాడుతూ, ఎన్ఆర్ఎక్స్ ఔషధాల అక్రమ మళ్లింపు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఇలాంటి సంయుక్త ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా అన్ని మెడికల్ షాపుల యజమానులు చట్టాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

మద్ది,పద్మనాభంలో ఘనంగా ఎంపీపీ రాంబాబు జన్మదిన వేడుకలు

పద్మనాభం, జూలై 9, ప్రభాతవార్త :

మండలంలో మద్ది, తనిపోలం, పద్మనాభం గ్రామాలలో ఎపీపీ కె.రాంబాబు జన్మదిన వేడుకల ను గురువారం యువకులు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు కోలాహలంగా నిర్వహించారు.అలాగే పలు చోట్ల అన్నదానాలు కూడా చేసారు. మద్దిగ్రామం, తునిపోలం, పద్మనాభం వైసీపీ కార్యాలయంలో రాంబాబు కేక్ కట్ చేసారు. దీంతో నాయకులు, అధికారులు, యువకులు రాంబాబుకు జన్మదిన శభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం భీమిలి వారి ఆశ్రమంలో అందులకు రాంబాబు పేరు మీద అన్నదానం చేసారు. అలాగే రాత్రి తునిపోలం గ్రామంలో కంటుబోతు అచ్చంనా యుడు, రామశింగు గౌరినాయుడు, కాళ్ల రమేష్, తాలాడ గోవింద ఆధ్వర్యంలో పేదలకు బారీ అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో బి సత్యనారాయణ, బోని సన్యాసినాయుడు, ఈశ్వర రావు, గాడు అప్పలరాజు, అల్లు అప్పలరాజు, చైతన్య,ప్రకాష్,గోవింద,నారాయణరావు, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో బీజేపీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలి: ఎమ్మెల్యే నల్లమిల్లి

గాజువాక, జులై 9, ప్రభాతవార్త:

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియలో బీజేపీ శ్రేణులు చురుగ్గా భాగస్వాములు కావాలని అనపర్తి ఎమ్మెల్యే, 'సర్' రాష్ట్ర కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పరశురామరాజు అధ్యక్షతన ఈ సమీక్షా సమావేశం జరిగింది. మొదటిసారి విశాఖ వచ్చిన ఎమ్మెల్యే నల్లమిల్లిని పార్టీ నాయకులు ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో కలెక్టర్, ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికే 98 శాతానికి పైగా ఇంటింటి ఎన్యూమరేషన్ పూర్తి కావడం శుభపరిణామన్నారు. ఈ ప్రక్రియలో బీజేపీకి చెందిన బిఎల్ఏ-1, బిఎల్ఏ-2 ప్రతిని ధులు అధికారులకు పూర్తి సహకారం అంది స్తున్నారని అభినందించారు. జూలై 21న నమూ నా ఓటరు జాబితా విడుదల కానుందని, ఆ జాబితాలో ఓటు లేని వారి చేత 'ఫారం-6' నింపించి, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఇంచార్జ్ సురేంద్ర మోహన్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, నియోజక వర్గాల ఇంచార్జ్ లు దాడి రమేష్ నాయుడు, బొత్స సురేష్, రమేష్ బాబు, కైలాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధానేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు ఒక మహా విపత్తు.. జీవితాలను చిత్తు చేసుకోకండి: ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

గాజువాక,జులై 9,ప్రభాతవార్త:

మత్తు పదార్థాలు తీసుకుంటే జీవితం చిత్తవుతుందని, మత్తు ఒక మహా విపత్తు అని జాతీయ సేవా పథకం (చీూా) జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో ఈగల్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో "మత్తు పదార్థాల నిర్మూలనలో యువత పాత్ర" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మత్తు వల్ల యువత భవిష్యత్తు, ఆరోగ్యం నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తులో విచక్షణ కోల్పోయి దొంగతనాలు, ప్రమాదాలు, నేరాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అనంతరం ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయ దేవి మాట్లాడుతూ.. మత్తు బారిన పడిన వారు కౌన్సిలింగ్, డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా పునరావాసం పొంది ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మత్తు నివారణపై చర్చలు జరపగా, పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులను, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు.

పద్మనాభం కెజిబివి పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలి

పద్మనాభం, జూలై 9, ప్రభాతవార్త :

మండలంలో కృష్ణాపురం గ్రామంలో మండల కాంప్లెక్స్ సమీపంలో ఉన్న కెజిబివి పాఠశాలను గురువారం డ్వామా పి డి సి హెచ్ నిర్మలాదేవితో పాటు ఎన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పాఠశాలలో ఖాళీగా ఉన్న సుమారు ఎకరం భూమిలో అనంత అరణ్య ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ ఆధ్వర్యంలో పలు రకాల పండ్లు మొక్కలు,కూరగాయల తోటలను నాటాలని ఆమె అన్నారు. మొక్కలు నాటడానికి శుక్రవారం నుండి భూమిని చదును చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి చిన్నారావు, ఎపిఒ గౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాతా ప్రదర్శన



ఆరిలోవ జులై 9 ప్రభాతవార్త :

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ చినగదిలి అంగన్వాడి కేంద్రం ఎస్ ఐ జీ నగర్ లో గురువారం శిశు మరణాలు అరికడదాం అనే నినాదంతో ప్రదర్శించిన కళాజాత ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సెల్వియా మాట్లాడుతూ... కళాకారుల బృందం తమ ఆటపాటలు, ప్రదర్శనల ద్వారా గర్భిణీలు, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారం గురించి బాల్యవివాహాలు చేయకూడదని, మేనరికం వల్ల కలిగే నష్టాలు వాటి పరిణామాలు గురించి నాటకీకరణ ద్వారా ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేశారన్నారు. అదేవిధంగా బాలికలను రక్షించుకుందాం - బాలికలను చదివించుకుందాం అనే కార్యక్రమంలో భాగంగా అమ్మాయిలను రక్షిద్దాం, చదివిద్దాం, శక్తివంతంగా తీర్చిదిద్దుదాం అని ప్రతి అమ్మాయి సురక్షితంగా ఆరోగ్యం చదువుకొని ఉన్నత స్థానంలో ఎదగాలని సూపర్వైజర్ సెల్వి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఎల్. లోకేశ్వరి, జి. వెంకటలక్ష్మి, ఎస్ అన్నపూర్ణ, ఎం రాజేశ్వరి, పి కృపారాణి, సిహెచ్ లక్ష్మి, ఎస్ రత్నకుమారి తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం ...

ఇంకెంతకాలం ఈ బతుకులు

(7వ పేజీ తరువాయి)

మెరైన్ పోలీసులను వినియోగించడం లేదన్న ప్రశ్న వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరైన్ రంగానికి ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంలో విఫలం చెందుతున్నట్టు మత్స్యకార సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. అలాగే సముద్ర జలాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకార కార్మికులకు పూర్తిస్థాయిలో భీమా ఏర్పాటు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న భీమా సౌఖర్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకు వస్తున్నట్టు మత్స్యకార సంఘాలు చెబుతున్నాయి. దీనిలో భాగంగానే మరణించిన మత్స్యకార కుటుంబాలకు ఏపి ఫిషర్‌మేన్ వెల్ఫేర్ స్కీమ్ ద్వారా రూ. 5 లక్షలు , సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మరో 5 లక్షలు అందించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఇంకెంతకాలం మత్స్యకార జీవితాలు బలికావాలని మత్స్యకార కుటుంబాల ప్రశ్నకు కలెక్టర్‌తో పాటు మత్స్యకారశాఖ మంత్రి అచ్చంనాయుడు సమాధానం చెప్పాల్సి ఉంది. సముద్ర జలాల్లోకి 9 కోస్తా జిల్లాల్లో 1.5 లక్షల మంది సముద్రంలోకి వెళ్ళి చేపల వేట సాగిస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ నివేదికల సహాయంతో మత్స్యకార మెకనైజ్డ్ బోట్లను ట్రాక్ చేసే టెక్నాలజీని వినియోగించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సముద్రంలోకి వెళ్ళే మత్స్యకార కార్మికులకు గ్రూప్ ఇన్స్‌రెన్సు చేయడం ద్వారా వేటలో మృతి చెందిన కార్మికులకు పెద్దస్థాయిలో భీమా సౌఖర్యం సమకూరనుంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి మత్స్యకార కుటుంబాలకు భవిష్యత్‌లో నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు, ఇల్లు, ఉద్యోగం ఇవ్వాలి

- కలెక్టర్ ఛాంబర్ ముందు నిరసన తెలిపిన బోట్ ప్రమాద బాధితులు.
- తమ డిమాండ్లతో కలెక్టర్ కు వినతిపత్రం అందజేత

విశాఖపట్నం, జులై 9 ప్రభాత వార్త : ఈ నెల 4న జరిగిన బోటు గల్లంతు ప్రమాద ఘటన లో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మత్స్య కారుల కుటుంబాల సభ్యులు గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్ట్ కిషోర్ ను తన ఛాంబర్ లో కలసి వినతిపత్రం ను అందజేశారు. ఎలాంటి ఆర్థిక ఆదాయ ఆధారం లేని తమకు ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు, ఇల్లు, ఉద్యోగం, బోటు నష్ట పరిహారం కింద యాభైయ్ లక్షలు ఇవ్వాలని వినతిపత్రం లో డిమాండ్ చేశారు.గురువారం సాయంత్రం సుమారు ఐదున్నార గంటలకు విశాఖ కలెక్టరేట్ కు పెద్ద సంఖ్యలో చేరుకున్న బాధిత మత్స్యకార కుటుంబాలు సభ్యులు, మత్స్య కార మహిళలు కలెక్టర్ ను నేరుగా కలిసేందుకు ప్రయత్నించారు అయితే ఈ సమయంలో లో కలెక్టర్ ను కలవడం కుదరదని కలెక్టరేట్ సిబ్బంది వారిని నిలువరించడంతో బాధిత మత్యాకారులంతాకలెక్టర్ ను కలిసే వరకు కదిలేది లేదన్న బాధితులు. కలెక్టర్ గది ముందు బైటయించి కొద్ది సేపు నిరసనకు దిగడంతో చివరకు కలెక్టర్ జోక్యం చేసుకొని వారిని లోపలకు పంపమని సిబ్బంది ని ఆదేశించారు. దా నితో లోపలకు వెళ్లిన బాదిత కుటుంబ సభ్యులు తమ గోడును వినిపించి కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చి వెళ్లిపోయారు.

అలిగి ఇంటి నుంచి వెళ్లిన మైనర్ బాలికను

2 గంటల్లో క్షేమంగా గుర్తించిన మహారాణిపేట పోలీసులు

సాంకేతిక విశ్లేషణతో వేగంగా స్పందించిన సీఐ దివాకర్ యాదవ్ బృందం

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

కుటుంబ సభ్యులతో మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ మైనర్ బాలికను మహారాణిపేట పోలీసులు గురువారం కేవలం రెండు గంటల్లోనే గుర్తించి క్షేమంగా రక్షించారు. ఫిర్యాదు అందిన వెంటనే మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి విచారణ ఆధారంగా బాలిక ఆచూకీని గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి, తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి భావాలను అర్థం చేసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా విశాఖ నగర పోలీసులు, పిల్లలు కనిపించకుండా పోయినట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని, ప్రతి నిమిషం కీలకమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విశాఖ సిటీలో

16 మంది సీఐలకు బదిలీలు

(7వ పేజీ తరువాయి)

నియమించారు. సిటీ స్పెషల్ బ్రాంచి-3లో ఉన్న జి.గోవిందరావును మహారాణిపేట సీఐగా నియమించగా సిటీ వీఆర్-1లో ఉన్న సీహెచ్ ఉమాకాంత్ ను నార్త్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నియమించారు. సిటీ వీఆర్-3లో ఉన్న బి. అప్పల నాయుడును టూటౌన్ సీఐగా నియమించగా నార్త్ ట్రాఫిక్ సీఐగా ఉన్న నల్లి సాయిని సిటీ వీఆర్-5కు వేశారు. అదే విధంగా సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్స్పెక్టర్ గా ఉన్న కె. శ్రీనివాస రావును సిటీ ఎస్బీ-3కి వేశారు. ఈ మేరకు ఎవరి స్థానాల్లో వారు తక్షణమే విధుల్లో చేరాలని సీపీ బగ్చీ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో విశాఖ ఆదర్శంగా నిలవాలి

(7వ పేజీ తరువాయి)

పంపిణీ, వెనక్కి తీసుకోవటం, డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాల గురించి నియోజక వర్గాల వారీగా ఆరా తీశారు. ఈ క్రమంలో ముందుగా జిల్లాలోని తాజా పరిస్థితిని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈఆర్వోలు కీలక పాత్ర పోషించాలని, ఏ నిర్ణయమైనా పారదర్శకంగా ఉండేలా తీసుకోవాలని సూచించారు. ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని, జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అర్హత కలిగిన వారిది ఒక్క ఓటు కూడా పోవడానికి వీల్లేదని, అలాగే అనర్హుల పేర్లు జాబితాలో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈఆర్వోలు తప్పకుండా వారి పరిధిలో ఉండే పోలింగ్ స్టేషన్లను సందర్శించాలన్నారు. తక్కువ ఫలితాలు నమోదైన చోట క్షేత్రస్థాయి పర్యటన చేసి దానికి గల కారణాలను విశ్లేషించుకోవాలని సూచించారు. ఆధార్ ఇతర కార్డులతో పాటు ఒక గుర్తింపు కార్డు మాత్రమే అని, అది ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను సహేతుకంగా నిర్వహించి, ప్రపోజల్సును నివేదించాలని చెప్పారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. తక్కువ శాతం ఫలితాలు సాధించిన వారు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో వెనుకబడిన పోలింగ్ స్టేషన్ల వివరాలను చెబుతూ దిద్దుబాటు చర్యలు వేగంగా తీసుకోవాలని అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ సూచించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదాలపై సీఐటీయూ ఆగ్రహం

సీఎండీ అరెస్టు చేసి ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వరుస ప్రమాదాలతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఇటీవల జరిగిన ఘోర ప్రమాదానికి నెల రోజులు గడిచినా దర్యాప్తు నివేదికను వెల్లడించలేదని, రాష్ట్ర ఫ్యాక్టరీ శాఖ గుర్తించిన భద్రతా లోపాలపై కూడా యాజమాన్యం సమాధానం ఇవ్వలేదని ఆరోపించింది.ప్రైవేటీకరణ విధానాలు, సిబ్బంది కొరత, భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం, అవసరమైన భద్రతా పరికరాల లేమే ప్రమాదాలకు ప్రధాన కారణాలని సీఐటీయూ నాయకులు నరసింగరావు, కుమార్ పేర్కొన్నారు. వరుస ప్రమాదాలకు బాధ్యులైన స్టీల్ ప్లాంట్ సీఎండీపై క్రిమినల్ చర్యలు తీసుకుని

అరెస్టు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. కార్మికుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సీఐటీయూ హెచ్చరించింది.

చైనాలో ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు వెంకయ్య నాయుడికి ఆహ్వానం

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

చైనాలోని షాంఘై నగరంలో అక్టోబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న 10వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడిని నిర్వాహకులు ఆహ్వానించారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న వెంకయ్య నాయుడిని లోక్‌నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, షాంఘై తెలుగు సంఘం అధ్యక్షుడు కె. మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సదస్సు విశేషాలను వివరించి, అంతర్జాతీయ తెలుగు సాహిత్య వేడుకలో పాల్గొనాలని కోరారు.
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, షాంఘై తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో, విశాఖకు చెందిన లోక్‌నాయక్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన వెంకయ్య నాయుడు, ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాషా వికాసం, తెలుగు సాహిత్య ప్రాచుర్యానికి షాంఘై తెలుగు సంఘం చేస్తున్న కృషిని అభినందించారు.

సింహాచలం గోశాలలో 'సీత' ప్రత్యేక శిక్షణ విజయవంతం

గోసంరక్షణలో శాస్త్రీయ విధానాల అమలుకు శిక్షణ కీలకం: ఈవో జల్లేపల్లి వెంకట్రావు

సింహాచలం, జూలై 9, ప్రభాతవార్త :

శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని కృష్ణాపురం గోశాలలో రాష్ట్ర దేవాదాయ శాఖ శిక్షణా సంస్థ (సీత) నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది.
ఈ సందర్భంగా శిక్షణలో సేవలందించిన నిపుణులు, పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ శర్మ, డా. గౌతమ్‌లను దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకట్రావు సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అలాగే శిక్షణలో పాల్గొన్న వివిధ దేవాలయాల గోశాలల సిబ్బంది, ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందించారు.
ఈవో మాట్లాడుతూ, గోశాలల నిర్వహణలో శాస్త్రీయ విధానాలు, పరిశుభ్రత, పశువుల ఆరోగ్య సంరక్షణ, పంచగవ్య ఉత్పత్తుల ప్రోత్సాహానికి ఇటువంటి శిక్షణలు ఎంతో దోహదపడతాయని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆయా దేవాలయాల్లో అమలు చేసి ఆదర్శ గోశాలలుగా తీర్చిదిద్దాలని సూచించారు.

మైనర్ బాలికలపై దారుణాలపై ఐద్వా ఆందోళన

మహిళల భద్రతలో ప్రభుత్వాలు విఫలం..

నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మైనర్ బాలికలపై జరిగిన దారుణ లైంగిక దాడులు, హత్యలను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనలను నిరసిస్తూ గురువారం జగదాంబ జంక్షన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఆర్.ఎన్. మాధవి, జిల్లా కార్యదర్శి వై. సత్యవతి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న నేరాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నేరస్థులకు రాజకీయ అండ లేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేసి, వేగవంతమైన దర్యాప్తు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల వ్యాప్తి కూడా మహిళలపై హింసాత్మక నేరాలకు కారణమవుతోందని పేర్కొంటూ, వాటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, పునరావాసం కల్పించడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై దాడులను సహించబోం..

(7వ పేజీ తరువాయి)

కమ్మ వారే) అత్యంత గొప్పదైన మన భారతీయ సంస్కృతిమీద, మన దేవతలమీద, మన హిందూ మతం మీద, మన దేశం మీద ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు, ఏ కులానికి, ఏ మతానికి చెందినవారు చేసినా - ఇటు సమాజం బుద్ధి చెప్పాలి అటు చట్టం--అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి యావజ్జీవం లేక ఉరి శిక్ష విధించాలి. అవసరమైతే ప్రభుత్వం చట్టాల్ని సవరించాలి. ఆ వ్యాఖ్యల్ని సమర్థించేవారికి కూడా అదే స్థాయిలో గుణపాఠం నేర్పాలి. బలవంతపు మత మార్పిడుల్ని, ప్రలోభాల ద్వారా మత మార్పిడుల్ని సమర్థించటం... మన సంస్కృతిమీద, మన దేశ సార్వభౌమత్వం మీద నల్ల కళ్లద్దాలు, సూట్ బూటు ధరించి మైక్ పట్టుకుని సగం వచ్చి రాని ఇంగ్లీష్ లో మిగతా తెలుగులో ఇష్టారాజ్యంగా నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దాడి చేయటం కొందరికి ఫ్యాషన్‌గా హీరోయిజంగా మారింది.
ఇలా ఒక పథకం ప్రకారం, తమ ఆర్థిక లాభం కోసం మతం మారిన ఓసీ కులాల్లోని కొన్ని కుటుంబాల వారు... మన దేశానికి, హిందూ మతానికి వ్యతిరేకంగా కన్వర్ట్ అయిన మిగతా కులాల వారితో విషం కక్కించే కార్యక్రమాన్ని తెర వెనక ఉండి నడిపిస్తున్న విషయాన్ని గమనించాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేరుగా రావణ్‌ని, ప్రకాశ్‌రాజ్‌ను సమర్థించటం, హైలైట్ చేయటం అంటే, ఇది నేరుగా మన హిందుత్వం మీద, మన సనాతన ధర్మం మీద, మన దేవతల మీద, మన దేశం మీద వారు చేస్తున్న దాడి మాత్రమే.
హైందవ సమాజాన్ని, భారతీయ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలన్న ఇలాంటి ఆలోచనల్ని మతపరమైన ఉగ్రవాదంగా భావించాలి. చట్టం వేసే శిక్షలతోపాటు సమాజం కూడా వీరందరినీ వెలివేయాలి.
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతోపాటు కేంద్రంలో అధికారపార్టీ బీజేపీ ఈ దేశద్రోహం, సంఘ విద్రోహ కుట్రల మీద చట్టపరంగా అన్ని చర్యలూ తీసుకోవాలి' అని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు.

విశాఖ ఎయిర్‌పోర్టు కొనసాగింపుపై సీపీఎం పోరుబాట

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత విశాఖ ఎయిర్‌పోర్టును మూసివేయకుండా డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుగా కొనసాగించాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయం ఏచూరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి జీఎంఆర్ సంస్థకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. విశాఖ ఎయిర్‌పోర్టు మూసివేత వల్ల వేలాది మందికి ఉపాధి కోల్పోవడంతో పాటు పర్యాటకం, రవాణా, సేవారంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ప్రయాణికులపై అదనపు సమయం, ఖర్చు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా వంటి ప్రధాన నగరాలకు దేశీయ విమాన సర్వీసులను విశాఖ నుంచే కొనసాగించాలని, భోగాపురం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ సేవలకు వినియోగించాలని సూచించారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజల పక్షాన నిలబడి ఎయిర్‌పోర్టు కొనసాగింపుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై జూలై 10 నుంచి 13 వరకు బైక్ ర్యాలీలు నిర్వహించి ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దామనాపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

గూడెంకొత్తవీధి, జులై 9, ప్రభాతవార్త:

మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని దామనాపల్లి, గొన్నూరు వీధిలో బోరు తవ్వకం పనులకు ఎంపీపీ బోయిన కుమారి గురువారం శంకుస్థాపన చేశారు. గొన్నూరు వీధిలో చాలాకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు గతంలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించిన అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో ఎట్టకేలకు బోరు ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ బోరు ద్వారా తమ తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగుతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీసా కార్యదర్శి మాదిరి చంటిబాబు, మాజీ ఎంపీపీ బాలరాజు, వైస్ ఎంపీపీ దేముడు పాల్గొన్నారు. అలాగే కూటమి నాయకులు పల్లం నాయుడు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సాగిన లక్ష్మణరావులతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు, మండల కార్యదర్శి వంతల చంటిబాబు, సోషల్ మీడియా ప్రతినిధి పాతూను లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయిన వెంకట్, సత్తిబాబు, పలువురు కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవగాహనతోనే గంజాయి, సైబర్ నేరాలకు అడ్డుకట్ట

గూడెం కొత్తవీధి, జులై 9, ప్రభాతవార్త :

మండల కేంద్రంలో స్థానిక ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో గంజాయి వినియోగం, సైబర్ నేరాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. గంజాయి రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గుర్తు తెలియని ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే సంబంధిత అధికారులకు లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించారు. గతంలో కన్న ఇప్పుడు 60 శాతం వాహనదారులకు లైసెన్సులు ఉన్నాయని పేర్కొన్నారు,లైసెన్సులు ఉన్న ప్రతిఒక్కరు హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు అత్యంత ముఖ్యమని ఎస్సై సురేష్ తెలిపారు. పోలీసు సిబ్బంది, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి

అన్ని రాజకీయ పార్టీలతో కలెక్టర్ టి.నిశాంతి సమీక్ష

పాడేరు,జూలై 9, ప్రభాతవార్త:

జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణకు రేపటితో గడువు ముగియనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ,జిల్లా సంయుక్త కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ లతో కలిసి సంయుక్తంగా గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు, గైర్హాజరైన వారి పేర్లను ఒకసారి తొలగించిన తర్వాత తిరిగి నమోదు చేసే అవకాశం ఉండదని తెలిపారు.అందువల్ల అర్హులైన ఒక్కరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.అవసరమైన ప్రాంతాల్లో 24 గంటల పాటు లాజిస్టిక్ సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీఎల్‌ఏలకు తగిన సూచనలు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన ఎన్యూమరేషన్ ఫారాల సేకరణను పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు.ఇప్పటికీ ఫారాలు అందని వారిని గుర్తించి, సంబంధిత సచివాలయ సిబ్బందిని సంప్రదించి ఫారాలను రీ-జనరేట్ చేయించుకుని అందజేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

పాడేరు,జూలై 9, ప్రభాతవార్త:

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవం గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగంలో జిల్లా కన్వీనర్ తిరుపల్లి యోగి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట పతాకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ గిరిజన రాష్ట్ర ప్రముఖ ఎంఎంఎల్ పాత్రుడు మాట్లాడుతూ 1949లో కొద్దిమంది విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ జ్ఞానశీ, శీలం, ఏకత అనే మూడు ఆశయాలను ఆచరిస్తూ నిరంతరం విద్యారంగ సమస్యలపై యుజమం చేస్తోందన్నారు అదేవిధంగా జెండా ఆవిష్కరణ తరువాత గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఆవరణంలో విద్యార్థులతో మొక్కలు నాతారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేష్, కళ్యాణ్ మధు సూర్య వెంకట్ మత్స్యరాజు మహేష్ ప్రదీప్ నారాయణ దేవరాజ్, అలాగే పూర్వ ఏబీవీపీ నాయకులు ఎం.గోపాలపాత్రుడు, పీ.కొండబాబు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వాలు తోడ్పాటు

అరకులోయ, జూలై 9, ప్రభాతవార్త :

చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు చదువుకుని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తాయని ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్ సాగర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశం మందిరంలో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే యువ పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం జెడ్ (జీరో ఎఫెక్ట్, జీరో డిఫెక్ట్) సర్టిఫికెట్ ఉచితంగా జారీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చే అర్హులైన యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 3 లక్షల వరకు రుణ సదుపాయంతో పాటు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఐఈ సిబ్బంది, చిన్నతరహా పరిశ్రమం ప్రతినిధులు, వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో తొలి గాల్‌బ్లాడర్ శస్త్రచికిత్స విజయవంతం

అరకులోయ, జూలై 9, ప్రభాతవార్త :

ఆరుకులోయ ఏరియా ఆసుపత్రిలో గురువారం తొలిసారిగా గాల్‌బ్లాడర్ (పిత్తాశయం) తొలగింపు శస్త్రచికిత్స (కోలిసిస్టెక్టమీ) విజయవంతంగా నిర్వహించారు. బహుళ పిత్తాశయ రాళ్లతో బాధపడుతున్న అరకులోయ కి చెందిన మహిళ , చికిత్స కోసం ఎస్.కోట, విశాఖపట్నంలోని పలు ఆసుపత్రులను సంప్రదించినప్పటికీ శస్త్రచికిత్స జరగలేదు. చివరికి అరకులోయ ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి జనరల్ సర్జన్ డాక్టర్ లగుడు రాము విజయవంతంగా కోలిసిస్టెక్టమీ శస్త్రచికిత్స నిర్వహించి, రోగి పిత్తాశయంతో పాటు 12 పిత్తాశయ రాళ్లను తొలగించారు. దింతో విజయవంతమైన గాల్ బ్లాడర్ శస్త్రచికిత్స తో ఆరుకులోయ ఏరియా ఆసుపత్రిలో తొలిసారిగా ఈ తరహా శస్త్రచికిత్స నిర్వహించబడటం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. గిరిజన ప్రాంత ప్రజలకు ఆధునిక శస్త్రచికిత్స సేవలు స్థానికంగానే అందుబాటులోకి వచ్చినట్లు ఈ సందర్భంగా డాక్టర్ ఎల్. రాము తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించే వరకు పోరాటం

అరకులోయ, జూలై 9, ప్రభాతవార్త :

కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అరకులోయ సిఐటియు మండల కమిటీ సమావేశం, స్థానిక గిరిజన సంఘం భవనంలో మండల కో కన్వీనర్ దాడి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కనీస వేతనం పెంపుకై ఈనెల 30 వ తేదీన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేస్ కార్మికులతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఈ నెల 31 వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా ను జయప్రదం చేయాలని కోరారు. గత ఐదు నుండి ఏడు సంవత్సరాల వరకు కార్మికులకు వేతనాలు పెరగలేదని ధరలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 26 వేల రూపాయలు జీతం పెంచుతున్నట్లు ప్రకటన చేయాలని అన్నారు. కార్మికులతో సంతకాల సేకరణ నిర్వహించి కలెక్టర్ సమర్పించాలని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కే మగ్గన్న , రైల్వే, టూరిజం, జిసిసి, ఐటీడీఏ, హాస్టల్ వర్కర్స్, అంగన్వాడి, బిల్డింగ్ తదితర యూనియన్ నాయకులు, వెంకటలక్ష్మి, భవాని, సంగీత, నిర్మల, మహేష్, కొండలరావు, కమంద్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో చెట్టు కూలి ఇల్లు ధ్వంసం

తప్పిన ప్రమాదం ..సురక్షితంగా బయటపడ్డ కుటుంబం

గూడెం కొత్తవీధి, జులై 9, ప్రభాతవార్త:

మండలంలోని దేవరపల్లి గ్రామంలో నిన్న రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవటంతో గ్రామానికి చెందిన బీజేపీ మండల కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ బాబు నివాసంపై ఉదయం 6 గంటల ప్రాంతంలో భారీ వృక్షం విరిగి పడటం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటి పైకప్పు పూర్తిగా దెబ్బతింది. అయితే ప్రమాదం సంభవించిన సమయంలో కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన అనంతరం బాధితుడు ఈ విషయాన్ని స్థానిక వీఆర్వో దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జరిగిన నష్టాన్ని నమోదు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కురుస్తున్న బారి వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఈఈగా పదోన్నతి పొందిన జ్యోతిబాబుకు సన్మానం

గూడెంకొత్తవీధి, జులై 9, ప్రభాతవార్త:

పంచాయతీరాజ్ శాఖలో డీఈఈగా పనిచేసి ఇటీవల ఈఈగా పదోన్నతి పొందిన కె. జ్యోతిబాబును జీకే వీధి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైసిపి పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, అరికట్ల ఆంజనేయులు (అంజి), కుందేరి రామకృష్ణ పూలమాల వేసి దుషాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ, గిరిజన సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. బాల్యంలో ఎదురైన ఎన్నో కష్టాలను అధిగమించి ఇంజనీర్‌గా ఎదిగి, ప్రభుత్వ సేవలో విశేష కృషి చేసి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని నాయకులు అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.

గూడెంకొత్తవీధి సచివాలయాన్ని సందర్శించిన జేసీ

గూడెం కొత్తవీధి, జులై 9, ప్రభాతవార్త:

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, శతశాతం అర్హులైన ఓటర్ల నమోదును పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జే.సీ తిరుమణి శ్రీ పూజ అధికారులను ఆదేశించారు. గూడెం కొత్తవీధి మండలంలోని స్థానిక గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ఓటర్ల నమోదులో పురోగతిని ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువతీ యువకుల పేర్లను తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారంతో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను సాధించాలని తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావుతో పాటు సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక ఎంపీటీసీ పసుపులేటి నాగమణి ద్వారా విజ్ఞప్తి చేశారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పండ్ర పాల్, సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు గ్రూప్-1 అధికారి బాలకృష్ణకు ఐఏఎస్ హోదా

పాడేరు,జూలై9,ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పట్టణం తలారిసింగిగ్రామానికి చెందిన గుడిసా బాలకృష్ణకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్(ఐఏఎస్)హోదా కల్పిస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గ్రూప్ -1 అధికారిగా ఉన్న బాలకృష్ణ ప్రస్తుతం రాష్ట్ర స్టాంపులు,రిజిస్ట్రేషన్ శాఖలో ఆడిస్నల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (ఏఐజి) విధులు నిర్వహిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు అధికారులకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ఐదుగురు అధికారుల్లో బాలకృష్ణ ఉండటంతో ఏజెన్సీ ప్రజలు,కుటుంబ సభ్యులు,స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గిరిజన ప్రాంతం పాడేరు చెందిన బాలకృష్ణకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ ఉన్నత పదవిలో రాణించడంతో గిరిజన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న అంతరాష్ట్ర ముఠా అరెస్టు

దుంబ్రిగుడ, జులై 9 ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగుడ మండలంలోని అంతరాష్ట్ర ముఠా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బోందుగుడ గ్రామ సమీపంలో ప్రత్యేక వాహన తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న 21కిలోల గంజాయిని పట్టుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సైతెలిపిన వివరాలు తమ పోలీసు బృందంతో గురువారం నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలలో భాగంగా బొందుగుడలో గ్రామ సమీప శీ లో తనిఖీ చేపట్టామన్నారు. ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా బెంగుళూరుకు గంజాయిని తరలిస్తూ సాంట్రో కారుతో ఫైలట్ వాహనంగా ఉపయోగిస్తున్న అపాచి మోటారు బైకుపై అడ్డగించి తనిఖీ చేశామన్నారు ఈ తనిఖీలో సాంట్రో కారులో 11 ప్యాకెట్లు 21కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమిండ్కు తరలించిడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న తెదేపా కార్యకర్తను పరామర్శించిన ఎంపీ శ్రీ భరత్

ఆరిలోవ, జులై 9, ప్రభాతవార్త

ఉత్తర నియోజకవర్గం జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం, రామచంద్రనగర్‌లో నివాసముం టున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పంపన ధవళేశ్వర్ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో స్వయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. మానసిక ధైర్యంతో ఎలాంటి వ్యాధినైనా అధికమించవచ్చునని డీలపడవద్దని, మనోబలంతో క్యాన్సర్ను ఎదురుకోవచ్చునని ధైర్యం చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి ధవళేశ్వర్ కామాక్షి దంపతులు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలని, కష్టకాలంలో కూడా పార్టీకి వెన్నుదన్నుగా నిలబడ్డారన్నారు. ఆయనకు ఆ భగవంతుడు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చి ఆదుకోవాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు వార్డ్ అధ్యక్షులు గారపాటి సతీష్, కూటమి నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

నేటి నుంచి విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో రాష్ట్ర సమాచార కమిషనర్ పర్యటన

విశాఖపట్నం, జూలై 09 ప్రభాతవార్త

సమాచార హక్కు చట్టం-2005 అమలును సమీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అధికారిక పర్యటన ప్రారంభించారు.ఈ పర్యటనలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజా ప్రాధికార సంస్థలలో సమాచార హక్కు చట్టం అమలుపై తనిఖీలు నిర్వహించనున్నారు. 10 వ తేదీ ఉదయం 10 గంటల నుంచి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సహా పలు ప్రజా ప్రాధికార సంస్థల్లో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 18(4), 19(8)(ఖ), (ఎ) ప్రకారం తనిఖీలు నిర్వహిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం తనిఖీలు కొనసాగించి సాయంత్రం రాష్ట్ర అతిథి గృహానికి చేరుకుని బస చేస్తారు. జూలై 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఇతర ప్రజా ప్రాధికార సంస్థల్లో సమాచార హక్కు చట్టం అమలుపై తనిఖీలు నిర్వహిస్తారు. మధ్యాహ్న విరామం అనంతరం తనిఖీలు కొనసాగించి సాయంత్రం రాష్ట్ర అతిథి గృహానికి చేరుకుంటారు.ఈ పర్యటన సందర్భంగా సమాచార హక్కు చట్టం అమలు, రికార్డుల నిర్వహణ, స్వచ్ఛంద సమాచార వెల్లడి, ప్రజలకు సమాచార సేవల అందుబాటు తదితర అంశాలను రాష్ట్ర సమాచార కమిషనర్ సమీక్షించనున్నారు. సంబంధిత శాఖల అధికారులు అవసరమైన రికార్డులు, సమాచారంతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సమాచార కమిషన్ సూచించింది.

బూత్ స్థాయి అధికారులకు సహకరించాలి

అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి దొన్నుదొర

దుంబ్రిగుడ, జులై 9, ప్రభాతవార్త:

సర్ ప్రక్రియలో అధికారులు గడువులోగా గిరిజన ఓటర్లను చైతన్యం చేసి శతశాతం పూర్తి చేయడానికి అధికారులకు సహకరించాలని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి దొన్నుదొర అన్నారు. మండల కేంద్రంలోని పోతంగి సచివాలయ పరిధి 177, 178, 179, 181 పోలింగ్ కేంద్రాలతోపాటు అరుకు సచివాలయంలో ఆయన సందర్శించి సర్ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో కూటమి నాయకులు, కార్యకర్తలను భాగస్వాములు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో గిరిజనులకు ఇచ్చిన ఫారాల సమర్పిం చడంలో జాప్యం జరుగుతుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఇది వరకే నమోదు ప్రక్రియలో వేగవంతం చేస్తున్నారని, బీఎల్ ఓలు సహకరించి శతశాతం ఓటర్లను చేర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు రామునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

పద్మనాభం శాఖా గ్రంథాలయ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేసిన కార్యదర్శి

పద్మనాభం, జూలై 9,ప్రభాతవార్త

మండలంలో పద్మనాభం గ్రామంలో ఉన్న మండల స్థాయి శాఖా గ్రంథాలయాన్ని గురువారం విశాఖపట్నం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో పుస్తకాలు, రికార్డులు, వార్తా పేపర్లు అమరికను చూసి ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.అలాగే గ్రంథాలయ నిర్వాహణలో ఆయన పలు సూచనలు అందజేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి వి ఎస్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

డప్పు కళాకారుడి ఆర్థిక ఇబ్బందులకు మానవతా దృక్పథంతో ఆర్థికంగా చేయూత

విశాఖ సీపీ చేతులు మీదుగా ఆర్థిక సహాయం అందజేత -ఉద్యోగులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమం : సీపీ శంక బ్రత బాగ్చి

మాధవధార, జూలై 08, ప్రభాతవార్త

మాధవదారులో ఇటీవల జరిగిన గ్రామదేవతల అమ్మవార్ల పండుగలలో డప్పు వాయించిన డప్పుల కళాకారుడు కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని అనారోగ్య పరిస్థితులతో ఇబ్బందులు పడుతుండడం స్థానిక ప్రజలు ద్వారా అమ్మవార్ల పండుగ కమిటీ పెద్దలు, రైల్వే ఉద్యోగి,ప్రిన్స్ యూత్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు వావిలిపల్లి మురళీకృష్ణ తెలుసుకున్నారు.ఈ మేరకు డప్పు కళాకారుడి ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు మానవతా దృక్పథంతో రూ.25,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ నగదును కుంచుమాంబ అమ్మవారి దేవాలయం ఆవరణలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సీపీ శంక బ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావంతో మెలగాలని,ప్రస్తుత సమాజంలో ఒకరికొకరు సాయం చేసుకోవాలని సూచించారు.ఉద్యోగులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని,కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలనే మానవతా దృక్పథం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని వావిలిపల్లి మురళీకృష్ణను అభినందించారు.కార్యక్రమంలో పలువురు స్థానికులు ఉన్నారు.

విశాఖలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు

మాధవధార, ప్రభాతవార్త

విశాఖలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పరిశీలించారు. గురువారం జిల్లాకు విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. దీనిలో భాగంగా ఉత్తర నియోజకవర్గంలోని 30వ పోలింగ్ స్టేషన్ పరిధిలో 36వ వార్డులో 30వ పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి, స్థానిక ఓటర్లతో మాట్లాడారు.జూలై 9 నాటికి మొత్తం 2,84,341 ఫారాలలో 2,84,283 మంది ఓటర్లకు పంపిణీ చేశారని, 1,90,699 ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు వివరించారు.బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు, ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డు వివరాలతో పాటు తమ తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు కార్డుల వివరాలను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.వారి వెంట జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, సంబంధిత ఈఆర్వోలు జ్ఞానవేణి,ఆర్ డి ఓ,ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

ఆనందపురం సీఐగా యర్రం నాయుడు

వాసునాయుడుకు గాజువాక బదిలీ

ఆనందపురం, జూలై 9, ప్రభాతవార్త

ఆనందపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వి.వి.సి.ఎం. యర్రం నాయుడును నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న చింతా వాసునాయుడును గాజువాక లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. సీఐగా బాధ్యతలు స్వీకరించనున్న యర్రం నాయుడు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే పారదర్శక పోలీసింగ్ అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై రాజీ లేకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతో ఆనందపురం పరిధిలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని కొత్త సీఐ యర్రం నాయుడు తెలిపారు.

గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన చైర్మన్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ శుభాకాంక్షలు

ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని ఆకాంక్ష

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త



ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బోనబోయిన కౌశిక్ కృష్ణను విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బ్యాంకు అభివృద్ధితో పాటు ఖాతాదారులకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సంస్థను ముందుకు తీసుకెళ్లడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి విజయాలు సాధించాలని కౌశిక్ కృష్ణకు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్లు, బ్యానర్ల ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, జూలై 9,ప్రభాతవార్త

ఈనెల 11వ తేదీన జరగబోయే ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం జిల్లా కలెక్టరు ఛాంబర్ లో ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లు , బ్యానర్లను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జూలై 11వ తేదీ నుండి జూలై 18వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలలో, ఉపకేంద్రాల స్థాయిలలో ర్యాలీలు, అవగాహన సమావేశాలు విస్తృతంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. 2026 సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన పిల్లల మధ్య సరైన వ్యవధి పాటిద్దాం - ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులపై దంపతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా నూతనంగా అందుబాటులోకి వచ్చిన తాత్కాలిక పద్ధతులైన ఛాయా నోటి మాత్రలు, అంతర ఇంజెక్షన్లు, ఇ.సి.పి మొదలగు వాటిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి, అర్హులైన దంపతులచే వాటిని వాడించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని, లక్కీ డిప్ కార్యక్రమం ద్వారా వివిధ రకములైన తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులను విజయవంతంగా వాడుచున్న దంపతులను ఎంపిక చేసి, వారికి నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం. హైమావతి , జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్ర శేఖర్, జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

అనకాపల్లి, జూలై 9, ప్రభాతవార్త

స్థానిక లక్ష్మీదేవి పేటలో వెంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయం 14వ వార్షికోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదా లు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారం భించి భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులు గొర్లి రాము, ఏపూరి రమేష్, ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మల్ల శివ నాయుడు, కే నాయుడు, ఈశ్వరపు రమేష్, ఎచ్చెర్ల శ్రీనివాస్, కర్రి గోపి, పోలమర్శెట్టి నూకరాజు, గొర్లి వెంకటరమణ, అంబటి మోహన్ రెడ్డి, పోలమరశెట్టి విజయ్, రేబాక ఇంద్ర కుమార్, కోటిపల్లి శ్రీను, మళ్లీ రమణబాబు, కాంద్రేగుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కి బాలకృష్ణ ఫ్యాన్స్ వినతిపత్రం

అనకాపల్లి, జూలై 9 ప్రభాతవార్త

స్థానిక మెయిన్ రోడ్ అనకాపల్లి జిల్లా కోర్టుకు దగ్గరలో నూతనంగా నిర్మించిన బాలకృష్ణ బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ ఉషశ్రీకి వినతిపత్రం అందజేసి సహకరించవలసిందిగా బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు టౌన్ అధ్యక్షులు మల్ల సంతోష్ విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న బాలకృష్ణ బస్ స్టాప్ శిథిలావస్థలో ఉండటంవల్ల శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ సూచనలు మేరకు నూతనంగా బాలకృష్ణ బస్ స్టాప్ నిర్మాణం చేయాలని ఫ్యాన్స్ కు ఆదేశించారని, ఫ్యాన్స్ సాకారంతో నాలుగు లక్షలు ఖర్చు చేసి ఆధునీకరణ గా బస్ స్టాప్‌ను నిర్మాణం చేసి శాసనసభ్యులు చేత ప్రారంభోత్సవం చేసామని, మాకు అనకాపల్లి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పిలా గోవింద సత్యనారాయణ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి భీమరశెట్టి రామ్కి తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ సహకారం అందించారని 15 రోజుల్లో నిర్మాణం పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులో తీసుకువచ్చామని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన బస్ స్టాప్ వద్ద మాత్రమే బస్సులు ఆటోలు ఆగేవిధంగా ఆర్టీసీ డిపో కి, ట్రాఫిక్ పోలీసులకు వినతి పత్రాలు అందించామని నాయుడు సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్ల గణేష్, పెతకంశెట్టి శ్రీనివాసరావు, మద్దాల భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలనలో కూటమి నాయకులు

(నక్కపల్లి,ప్రభాతవార్త)



మండలంలోని నక్కపల్లి, నక్కపల్లిలో ఉన్న వివిధతో పాటు ఉపమాక గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొంటున్నారు. గురువారం నక్కపల్లి గ్రామ పంచాయితీలలో బిఎల్ఓతో పాటు పరిశీలన చేస్తున్నారు. అందుబాటులో లేని వారికి ఫోన్ ద్వారా సమాచారం వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా నూటికి నూరు శాతం పరిశీలన పూర్తి చేయాలని బిఎల్ఓలకు అధికారులు ఆదేశించిన మేరకు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిశీలన పెద్ద ఎత్తున పూర్తి చేస్తున్నారు. ఈ ప్రత్యేక పరిశీలనలో కూటమి నాయకులు కోసూరి శ్రీనివాస రావు, కర్రి వెంకట సత్యనారాయణ (కేవీ), పాము గణేశ్వరరావు పంచాయతీ కార్యదర్శిలు, పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలో దోసలపాడు గ్రామంలో గురువారం ఉదయం సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామ బి.జే.పి నాయకులు పక్కుర్తి అప్పలరాజు ఆర్థిక సహాయంతో పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎం.పీ.టీ.సి.పక్కుర్తి రమణ, మాజీ సర్పంచ్ ప్రకాష్,టీ.డీ.పీ నాయకులు రాజబాబు,ఆవాల రమణ,జనసేన నాయకులు గోవింద్,పాఠశాల అభివృద్ధికమిటీ చైర్మన్ బుద్దాల శ్రీను ఉపాధ్యాయులు చిన్నారావు చేతులమీదుగా విగ్రహావిష్కరణ గావించారు. అనంతరం పాఠశాల విద్యార్థులందరికీ కంచాలు,వాటర్ బాటిల్స్,నోట్ బుక్స్ స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు.విశ్రాంత పోలీస్ ఉద్యోగులు బుద్దాల శ్రీను ఆర్థిక సహకారంతో సామగ్రిని పంపిణీచేశారు.

పాకలపాడు రోడ్డు ఆధునీకరణకు శ్రీకారం

గొలుగొండ జులై 9, ప్రభాతవార్త

మండలంలో రావణాపల్లి జంక్షన్ నుండి పాకలపాడు గ్రామం వరకు తారు రోడ్డు ఆధునికరణ పనులకు కూటమి నాయకులు గురువారం శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణ పనులను అనకాపల్లి జిల్లా టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపా అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రోడ్డు 1.7 కిలోమీటర్లు ఆధునికరణకు 40 లక్షల రూపాయలు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషితో మంజూరయ్యాయని అన్నారు. గత కొన్ని నీళ్లుగా పూర్తి అధ్వానంగా మారిన బీటీ రోడ్ గత పాలకులు ఐదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేశారని భారీ గోతులు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వాటి తర్వాత గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టిందని ఆయన అన్నారు. చింతపల్లి రోడ్డు నుంచి పాకలపాడు రోడ్డు వరకు పూర్తి ఆధునికరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, భీమిరెడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచులు కొల్లు రాంబాబు, కొల్లి సత్యనారాయణ, కామిరెడ్డి రామన్న, ఆర్ అండ్ బి శాఖ డి ఈ విద్యాసాగర్, జేఈ ప్రసాద్, పాకలపాడు, రామనాపల్లి గ్రామ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చీడిగుమ్మలలో జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ

గొలుగొండ జులై 9 ప్రభాతవార్త

గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కార్యక్రమం చీడిగుమ్మల ఎన్టీఆర్ సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ డైరెక్టర్ సిహెచ్ రాజేశ్వరరావు గురువారం సందర్శించారు. శిక్షణ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం ఐకేపీ ఏపీఎం కరుణానిధి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం శక్తిగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు కామరెడ్డి గోవింద, వెలుగు సీసీలు, శిక్షణ అధ్యాపకులు పాల్గొన్నారు.

గోడ పత్రిక విడుదల

(నక్కపల్లి, ప్రభాతవార్త)

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) అనకాపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ నెల జూలై 20, 21, 22 తేదీలలో మూడు రోజుల పాటు అనకాపల్లి పట్టణంలో నిర్వహించనున్న "జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల" గోడ పత్రికలు, కరపత్రాలను నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో గురువారం జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజాన దొరబాబు మాట్లాడుతూ 1925వ సంవత్సరంలో స్థాపించబడి, ప్రస్తుతం 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సిపిఐ దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో దేశ పురోభివృద్ధికి, సకల శ్రామిక ప్రజల హక్కుల సాధనకు అగ్రభాగాన నిలిచి పోరాడి ఎన్నో విజయాలు సాధించిందని గుర్తుచేశారు. నేడు దేశంలో నెలకొన్న ఆర్థిక, సామాజిక అంతరాలు, రాజకీయ వ్యాపారం, కుల, మత, ప్రాంతీయ, భాషాద్వేషాలు మొత్తం దేశ స్వాతంత్ర్యానికి, సార్వభౌమత్వానికి, సెక్యులర్ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారుల, స్థానిక పరిశ్రమల సమస్యలపై పోరాటం చేయనున్నమని, అనకాపల్లి జిల్లాలోని తీరప్రాంత మత్స్యకారుల సమస్యలపై, స్థానిక పరిశ్రమల్లో జరుగుతున్న దోపిడీపై సిపిఐ నిరంతరం పోరాడుతుందని దొరబాబు స్పష్టం చేశారు. మత్స్యకారుల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని, తీరప్రాంతాల్లోని మత్స్యకారుల సాంప్రదాయక జీవనోపాధి దెబ్బతినకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై అన్నారు. ఆధునిక వసతులు, వేట సామాగ్రిపై సబ్సిడీలు, సముద్రపు కోతకు గురవుతున్న గ్రామాలకు రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని కోరారు ఉపాధి విషయంలో జిల్లాలోని ఫార్మా, ఇతర రసాయన పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య వ్యర్థాల వల్ల సముద్రపు సంపద అంతరించి మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలలో ఇక్కడి యువతకే 75% ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొంది బాబ్జి, మత్స్యకార నాయకులు రాజు, కాశి, జగ్గా పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డు నుండి తరలించి పచ్చదనానికి చర్యలు

కలెక్టర్ ఆదేశాల పాటిస్తున్న అధికారులు

కశింకోట, జూలై 9 , ప్రభాతవార్త

శారదా నది పరివాహ ప్రాంతంలో కసింకోట సమీపంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ కాపులపాడు వద్దకు తరలించి పచ్చదనాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శారద పరివాహక ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డ్ తరలించే పనులను జిల్లా పంచాయతీరాజ్ అధికారి సందీప్,డీ.డీ.ఓ మంజుల వాణి లు పరిశీలించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ శారద పరివాహక ప్రాంతంలో ఉన్న దంపింగ్ను యుద్ధ ప్రాతిపదికన తరలించి అక్కడ వాతావరణానికి అనుకూలంగా పచ్చదనం పెంచడానికి మొక్కలు నాటాలని మండల అధికారులకు సూచించారు. యుద్ధ ప్రాతిపదికన మండల అధికారులు పనులు చేపట్టడంతో జిల్లా పంచాయతీరాజ్ అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ డంపింగ్ యార్డ్ తరలించే పనిలో భాగంగా 40 మంది పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ ఎంపీడీఓ వెంకట లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి జగన్మోహనరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను సత్కరించిన వైకాపా నాయకులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు సేవలందించే విషయంలో కష్టపడి పని చేస్తున్నారని అటువంటి వైద్యులు ఇక్కడ దొరకడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని పాయకరావుపేట నియోజకవర్గ వైకాపా ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆసుపత్రిలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీల్ తోపాటు గైనిక్ వైద్యురాలు అనూషలను సత్కరించారు .వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, పొడగట్ల పాపారావు,మాజీ ఉపసర్పంచ్ వీసం రాజు, ముద్ద శ్రీను, విజయవాడ దుర్గ గోవిందు ఎలమంచిలి మధు, నున్న సత్తికొండ, తదితరులు ఉన్నారు.

శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

ఎలమంచిలి, జూలై 9, ప్రభాతవార్త

పట్టణ పరిధిలోని,మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రాజశేఖర్ తెలిపారు. అనకాపల్లి ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 33/11 కేవీ పురుషోత్తపురం, ఎలమంచిలి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో అత్యవసర నిర్వహణ పనులు చేపట్టడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. విద్యుత్ తీగల మార్గంలో ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, ఆర్డీఎస్ఎస్, పీఎంఐ పనులను నిర్వహిం చడం కొరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పట్టణ పరిధిలోని ధర్మవరం, దిమిలి రోడ్, కాకివానివీధి, మండలంలో పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం, రేగుపాలెం, రాంభద్రపురం, వెంకనాయుడుపాలెం, నాయనమ్మపాలెం, లైన్ కొత్తూరు, కట్టుపాలెం, సోమలింగపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు పూర్తిగా అంతరాయం కలగనుందని వెల్లడించారు. ఈ పనుల సమయంలో ఆయా గ్రామాలకు ఎటువంటి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా సౌకర్యం ఉండదని కావున సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఏటికొప్పాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం కిట్ల పంపిణీ

ఎలమంచిలి, జూలై 9, ప్రభాతవార్త



మండలంలోని ఏటికొప్పాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించిన 'సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠశాల యూనిఫాం కిట్ల'ను మండల పరిషత్ అధ్యక్షుడు రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు (శేషు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషు మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా దీనిని గుర్తుపెట్టుకుని విద్యార్థులందరినీ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. జగన్నాథరావు, ఉపాధ్యాయులు డి. ప్రసన్నకుమార్, డి.వి.ఎస్. మూర్తి, జి. రమణి, ఎం. కవిత , మండల జనసేన అధ్యక్షుడు అన్నం బాబ్జి, శానా నానాజీ, పలువురు కూటమి నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో బాధ్యతగా పనిచేయాలి

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



గ్రామాల్లో ప్రతిష్టాత్మక జరుగుతున్న ఓటర్ల జాబితాల ఇంటింటి పరిశీలనలో ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని మండల బిజెపి అధ్యక్షులు పోలినాటి నానాజీ పిలుపునిచ్చారు. గురువారం మండల పార్టీ కార్యాలయము నందు పార్టీ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు పోలినాటి నానాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఐఆర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కోసూరి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొల్లాటి అప్పారావు, ఘట్టం నానాజీ, మైనార్టీ మోర్చా హుస్సేన్ షేక్ మదీనా, బంగారు శివ, పిక్ సురేష్, రాజు, కెవి రమణ, జగన్నాథం, గోవిందులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

నక్కపల్లి రూరల్/అడ్డు రోడ్డు ప్రభాతవార్త



మండలంలోని ఉపమాక ఎలిమెంటరీ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న బుక్స్, షూస్, బెల్టు, యూనిఫామ్ లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మాత్యులు నారా లోకేష్, విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యా వ్యవస్థ భారతదేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా పలు సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. గతానికి భిన్నంగా విద్యార్థులకు న్యాయమై నటువంటి సన్నబియ్యం అందించడం ద్వారా క్వాలిటీతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు కొరత లేకుండా డీఎస్సీ ద్వారా వేలాది మంది కొత్త ఉపాధ్యాయులు ను తీసుకోవడం ద్వారా మన స్కూల్ కి నూతనంగా ఒక టీచర్ ను కూడా నియమించడం జరిగిందని తెలియచేస్తూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం కోసం ఉపాధ్యాయుల కష్టపడి పని చేయాలని కోరారు. ఈ సంవత్సరంలో మాజీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, స్కూల్ చైర్మన్ గొల్లపల్లి కనకరాజు, నాయకులు తోలేటి శ్రీను, వెంకట అప్పారావు, జనసేన నాయకులు తోట అప్పారావుమామిడి గోవిందు, కర్రి గురూజీ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై వినియోగదారుల ఫోరం ప్రత్యేక దృష్టి

ఏపీ ఈపీడీసీఎల్ సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ

(నక్కపల్లి, ప్రభాతవార్త)

విద్యుత్ వినియోగదారు లు సమస్యల పరిష్కారం కోసం వినియోదారుల సమస్యల పరిష్కార (న్యాయ స్థానం) ఫోరం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీ ఎల్) వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ హామీ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ లో బుధవారం సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార (న్యాయస్థానం) వేదికలో పాల్గొని అవగాహన కల్పించారు. ఈ వేదికలో వినియోగదారుల నుంచి అందిన దరఖాస్తులను ఫోరం చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ వేదికలో పాల్గొన్న టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల టిడిపి అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, వేంపాడు పిఎసిఎస్ చైర్పర్సన్ వెలగా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయినవై రమణ, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు సహా మండల వ్యాప్తంగా పలు. గ్రామాల నుంచి విద్యుత్ వినియోగదారులు పాల్గొని సంబంధిత గ్రామాల సమస్యలపై వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. దీనిలో ప్రధానంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో తలెత్తిన విద్యుత్ లో వోల్టేజీ సమస్యలను పరిష్కరించాలని, ప్రజా ప్రతినిధులు సహా విద్యుత్ వినియోదారులు పలువురు సిజిఆర్ఎఫ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇందులో ప్రధానంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పాడైపోయిన స్తంభాల స్థానే కొత్త స్తంభాల ఏర్పాటు చేయాలని, వేంపాడు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మండలంలోని మెరక గ్రామాలకు జరిగే విద్యుత్ సరఫరాను గొడిచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ కు మార్పు తదితర సమస్యలనుయు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ వినియోగదారులు పలువురు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ వేదికలో తమకు అందిన వినతులపై సకాలంలో విచారణ జరిపి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఈపీడీసీఎల్ విశాఖ పట్నం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార వేదికలో మండల వ్యాప్తంగా విద్యుత్ ధరల నుంచి వివిధ సమస్యలపై 22 వినతులు అందినట్లు తెలిపారు. ఈ వేదికలో తమకు అందిన సమస్యలను పరిశీలించిన త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈపీడీసీఎల్ కంపెనీ పరిధిలో ఉన్న అన్ని జిల్లాల్లో 2026లో 447 వరకు ఫిర్యాదులు అందాయని, వీటిలో ఇప్పటికే 293 సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మరో 154 సమస్యలకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నట్లు వినియోగదారుల సమస్యల పరిష్కారవై వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమం అనంతరం మండలంలోని చుక్కలవాని లక్ష్మీపురంలో గ్రామంలో వ్యవసాయ బోరులకు ఈపీడీసీఎల్ నిబంధనల మేరకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని వ్యవసాయ విద్యుత్ వినియోగదారుడు దాట్ల భరత్ కుమార్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ విద్యుత్ వినియోగదారుల ఫారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన సమీప సిహెచ్ఎల్ పురంలోని రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మీదట అక్కడ తలెత్తిన వ్యవసాయ విద్యుత్ సమస్యపై వినియోగదారుడు దాట్ల భరత్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వ్యవసాయ విద్యుత్ రైతు భరత్ కుమార్ కు సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిజి అర్ఎఫ్ సాంకేతిక సభ్యురాలు ఎం. విజయ రాముండి, ఆర్థిక విభాగం సభ్యులు ఎస్. సుబ్బారావు, స్వతంత్ర విభాగం సభ్యులు ఎం.మురళీ కృష్ణ, అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ, పాయకరావుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.వి. లక్ష్మీనారాయణ, సత్యవరం అసిస్టెంట్ ఇంజనీర్ నక్కపల్లి జూనియర్ ఇంజనీర్ ఓ. రమేష్ సహా ఏపీ ఈపీడీసీఎల్ పాయకరావుపేట సబ్ డివిజన్ ఏపీ ట్రాన్స్కో సిబ్బంది పాల్గొన్నారు.

గొర్ల బాబురావుకు ఘనంగా నివాళులు

నక్కపల్లి ,ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ సంఘాల నాయకులు స్వర్గీయ గొర్ల బాబురావు చిత్రపటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ చేతుల మీదుగా పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబురావు కుమారుడు శ్రీకాంత్‌కు ధైర్యం చెప్పారు. మాజీ సర్పంచ్ అమ్మాజీ కుమారుడు శ్రీకాంత్ కుటుంబాన్ని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దగ్గర తీసుకెళ్తానని ఈ సందర్భంగా వారికి తెలిపారు. అనంతరం ఎలమంచిలి మధుతో పాటు గ్రామానికి చెందిన పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోరామకృష్ణ మాట్లాడారు. రామకృష్ణను కలిసిన వారిలో విజయవాడ గోవిందు, దుర్గ, కొల్లి గిరి, గొర్ల బాబ్జి,గోవింద్, రాజు, ప్రసాద్ అలియాస్ డాక్టర్, రమేష్,నాగ ప్రసాద్, మిస్టర్ అనిల్, మదన్, మణికంత, రాంబాబు, జిబిఆర్ యూత్ ఉన్నారు.

దేశాభివృద్ధికి బీజేపీ సిద్ధాంతాలే దిక్సూచి

కొరుప్రోలు చెన్నారావు జన్మదిన వేడుకల్లో నాయకుల అభినందనలు

అచ్యుతాపురం, జూలై 8 ప్రభాతవార్త

అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరుప్రోలు చెన్నారావు జన్మదిన వేడుకలు బుధవారం అచ్యుతాపురంలోని అట్లాస్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. కేక్ కట్ చేసి శుభాకాం క్షలు అందజేస్తూ ఆయన సేవలను కొనియాడారు. కొరుప్రోలు చెన్నారావు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు తనను ఎంతో ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను సర్వోన్నతంగా భావిస్తూ అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ సమైక్యత, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీగా బీజేపీపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రైతు సంక్షేమం, మహిళా సాధికారత వంటి రంగాల్లో మరింత పురోగతి సాధించి భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలిచే సామర్థ్యం కలిగి ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణలో భారతీయ జనతా పార్టీ సమర్థవంతమైన పాత్ర పోషిస్తోందనే విశ్వాసంతోనే తాను పార్టీలో చేరినట్లు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం ప్రోత్సాహం, సహకారంతో ప్రజలకు మరింత చేరువై పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కొరుప్రోలు చెన్నారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జూన్‌లో చెప్పిందే ఇప్పుడు జరుగుతోంది..

లక్కోజు శివరామ విశ్వకర్మ వ్యాఖ్యలు

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త

ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తతలు నెలకొంటాయని తాను గతంలో చేసిన జ్యోతిష్య అంచనాలు నిజమయ్యాయని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ విశ్వకర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ నెలలో ఇచ్చిన ఇంటర్వ్యూలో శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ జూన్, జూలై నెలల్లో మళ్లీ యుద్ధ వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తాను చెప్పానని తెలిపారు. ప్రస్తుతం ఇరాన్-అమెరికా పరిణామాలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తన అంచనాలకు అనుగుణంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయని, దీనివల్ల భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని కూడా ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

బాబురావు ఆశయాల కోసం ప్రతి ఒక్కరం పని చేద్దాం..

రాష్ట్ర వైకాపా కార్యదర్శి వీసం.. బుచ్చిరాజు పేటలో ఘనంగా వైఎస్సార్ జయంతి

నక్కపల్లి,ప్రభాతవార్త

అనేకమంది పేద ప్రజల కోసం నిరంతరం నేనున్నాను అని అంటూ ధైర్యం చెబుతూ గ్రామ అభివృద్ధి కోసం పనిచేసిన స్వర్గీయ గొర్ల బాబురావు ఆశయాల సాధన కోసం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరితోపాటు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఏర్పాటు చేసిన దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టినరోజు కేకులు కట్ చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్ధిల్లాలి, అమర్ రహే బాబురావు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబురావు కుమారుడు శ్రీకాంత్ను పరిచయం చేస్తూ నా కొడుకు ఎంతో శ్రీకాంత్ కూడా అంతేనని అన్నారు.

బాబురావు ఎప్పుడు కూడా గ్రామం కోసం ఆలోచించే వ్యక్తిని గ్రామంతో పాటు అనేక మంది కోసం నిత్యం ఆలోచిస్తూ వారి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసే వారిని అటు కార్మిక వర్గంలోని ఇటు గ్రామంలోని మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. బాబురావు లేదు అనే మాట ఈరోజు కూడా మర్చిపోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మంచి నాయకుడిని ఈ ప్రాంత ప్రజలు కోల్పోయారని తను లేని లోటును ఏ ఒక్కరు భర్తీ చేయలేరని పేదవాడి కోసం పనిచేసే వ్యక్తినే పేరు ఉందని రామకృష్ణ అన్నారు. ఈ గ్రామంలో బాబురావు కుటుంబీకులు విజయవాడ గోవిందు, దుర్గ తో పాటు మధు ఇటువంటి కష్టపడే కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండడం అదృష్టమని ,వారి ఆధ్వర్యంలో శ్రీకాంత్ను ఆ కుటుంబాన్ని చూసుకుంటామని రామకృష్ణ అన్నారు. బాబురావు కుటుంబం మీద గ్రామమంతా చూపించిన ఆదరణ మరువలేనిదని అన్నారు. శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు నక్కపల్లి మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవ విజయంతో మొదటిగా బుచ్చిరాజుపేట ఉండేటట్లు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తప్పనిసరిగా చేరుకుంటుందని అన్నారు. బుచ్చిరాజుపేట గెలుపుతోనే ప్రారంభమవుతుందని అన్నారు. ప్రజల కోసం పోరాడిన కుటుంబానికి అండగా ఉంటామని వారు ఏ కష్టం వచ్చినా నా కొడుకుతో సమానంగా ఉన్న శ్రీకాంత్ కోసం తలుపులు తెరిచే ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ గోవిందు, దుర్గలు మాట్లాడుతూ మా బాబాయ్ గొర్ల బాబురావు ఆశయాల సాధన కోసం అందరం పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, ఎంపిటిసి గంట తిరుపతిరావు, అల్లా చిన్నబ్బాయి, తల్లా భార్గవ్ తో పాటు విజయవాడ గోవిందు, దుర్గ, కొల్లి గిరి, గొర్ల బాబ్జి, గోవింద్, రాజు, ప్రసాద్ అలియాస్ డాక్టర్, రమేష్, నాగ ప్రసాద్, మిస్టర్ అనిల్, మదన్, మణికంఠ, రాంబాబు, గొర్ల బాబురావు యూత్ సభ్యులు ఉన్నారు.

లైబ్రరీ సెస్ బకాయిలు చెల్లించాలి

ఆనందపురం శాఖా గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఆనందపురం, జూలై 9, ప్రభాతవార్త

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు గురువారం ఆనందపురం శాఖా గ్రంథాలయాన్ని వార్షిక తనిఖీ నిర్వహించారు. 2025--26 సంవత్సరానికి సంబంధించిన గ్రంథాలయ కార్యకలాపాలు, నిర్వహణ, రికార్డులను పరిశీలించిన ఆయన గ్రంథాలయ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనందపురం గ్రామపంచాయతీ కార్యదర్శి రఘునాథ బాబును కలిసి గ్రామపంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను వీలైనంత త్వరగా జమ చేయాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి సెస్ నిధులు ఎంతో కీలకమని పేర్కొంటూ, బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ రికార్డులు, పుస్తకాల నిర్వహణ, ఇతర పరిపాలనా అంశాలను పరిశీలించిన కార్యదర్శి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం శాఖా గ్రంథాలయాధికారి బి.వి.ఎస్. అప్పారావు పాల్గొన్నారు.

10న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త

11 కేవీ కాపు జగ్గరాజుపేట ఫీడర్ పరిధిలో కండక్టర్ మార్పిడి, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూలై 10 (శుక్రవారం) ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె. నాయుడు తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం కాపు జగ్గరాజుపేట, విఘ్నాన్ కళాశాల విద్యాసంస్థలు, వైష్ణవి గార్డెన్స్, ఎల్.ఎన్. గార్డెన్స్, ఎల్.ఎమ్. గార్డెన్స్, వసుంధర గార్డెన్స్, డాక్‌యార్డ్ కాలనీ తదితర ప్రాంతాల్లో అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కొమ్మాది పాఠశాలలో మానసిక వికలాంగ విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్‌లకు ఆర్థిక సహాయం

పీఎం పాలెం, ప్రభాతవార్త

కొమ్మాది ప్రభుత్వ పాఠశాలలో గురువారం మానసిక వికలాంగ విద్యార్థులకు నోట్‌బుక్స్ కొనుగోలు, యూనిఫామ్‌లు కుట్టించుకునేందుకు ప్రధానోపాధ్యాయులు తమ సొంత నిధులతో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒకటో తరగతిలో కొత్తగా చేరిన సుమశ్రీ, దీక్షిత్ కుమార్, కె. రూబీ, రిషిక విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, యూనిఫామ్‌ల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ పట్నాయక్ మాట్లాడుతూ, పాఠశాలలో చేరిన మానసిక వికలాంగ విద్యార్థులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అవసరమైన నోట్‌బుక్స్, యూనిఫామ్ స్టిచింగ్ చార్జీలకు కూడా తన వంతు సహాయం అందిస్తామని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు విద్యకు దూరం కాకుండా అన్ని విధాలా ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందిస్తూ, విద్యార్థుల సంక్షేమానికి ప్రధానోపాధ్యాయులు చేస్తున్న సేవలను ప్రశంసించారు.

భీమిలి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఓటరు సర్వే వేగవంతం చేయాలి : చిక్కాల విజయబాబు

పీఎం పాలెం, ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం పీఎం పాలెం ప్రాంతంలో ఎస్ఐఆర్ ఓటరు సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి చిక్కాల విజయబాబు మాట్లాడుతూ, ఓటరు సర్వే శాతం తక్కువగా ఉన్న బూత్‌లలో స్థానిక బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేసి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా 262 నుంచి 279 వరకు ఉన్న బూత్‌లలో సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆరో వార్డు తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యం వహించారు. కార్యక్రమంలో 54వ యూనిట్ ఇన్‌చార్జి రెడ్డి సత్యనారాయణ, యూనిట్ నాయకులు కుప్పక రామకృష్ణ, మామిడి రమణ, పోతిన నాయుడు, పోతిన రాము, కొల్లి బాబ్జి, షేక్ రియాజ్, పాపారెడ్డి, సుంకర నూకరాజు, గొర్రెల రామకృష్ణ, పతివాడ లక్ష్మి తదితరులు పాల్గొని బూత్‌ల వారీగా సర్వే పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణపై చర్చించారు.

కొమ్మాది మోడల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

పీఎం పాలెం, ప్రభాతవార్త

జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ గురువారం కొమ్మాది మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి తరగతి గదిని సందర్శించి బోధన ప్రమాణాలు, విద్యా ర్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. విద్యార్థుల సంసిద్ధత పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేసి వాటి దిద్దుబాట్లను పరిశీలించారు. అనంతరం బోర్డుపై పాఠ్యాంశాలను రాసి విద్యార్థులతో చదివించి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేశారు. అలాగే పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా విద్యార్థులకు వడ్డించి, ఆహార నాణ్యతను పరిశీలించేందుకు రుచి చూశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ పట్నాయక్‌తో జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, పాఠశాలలోని ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాల్లో మెరుగైన స్థాయికి చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, నాణ్యమైన బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాసంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

పడవ ప్రమాద ఘటనల నివారణకు మందస్తు చర్యలు చేపట్టాలి

ప్రభుత్వం, మత్స్య శాఖ, పోర్ట్ అధికారులకు మర పడవల సంఘం మాజీ నేత అల్లిపిల్లి అప్పారావు విజ్ఞప్తి

విశాఖపట్నం, జూలై 9 ప్రభాతవార్త

నడి సంద్రంలో పడవ ప్రమాదం, గల్లంతు ఘటనల వెనుక ప్రధానగా మత్స్యశాఖ షిప్ సర్వే అధికారుల దొల్లతనం, వైఫల్యాలు దాగి ఉన్నాయని మేకనైజిడ్ ఫిషింగ్ బోర్డు వర్కర్స్ యూనియన్ మాజీ నాయకులు అల్లిపిల్లి అప్పారావు ఆరోపిస్తున్నారు. రెండేళ్లకోసారి డబ్బులు తీసుకొని బోట్ నెంబర్ రిజిస్ట్రేషన్ రెన్యువల్, బోట్ ఫిట్నెస్ సర్వే లను తూతూ మంత్రంగా చేస్తుండడం వల్లే తుఫాన్ సమయాల్లో సముద్ర అలల ధాటిని తట్టుకోలేక పడవ ప్రమాదాలు జరుగుతున్నాయని ఏపీ మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ వర్కర్స్ యూనియన్ మాజీ ఉపాధ్యక్షుడు అల్లిపిల్లి అప్పారావు ఈమెరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తను వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గా పని చేసే కాలంలో దివంగిత కార్మిక నాయకుడు ఎంవి భద్రం, కోలా గురుమూర్తిల ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్‌లో గల మత్స్యకారుల మరబోట్లు ప్రమాద నివారణకై పలుమార్లు పోర్ట్ అథారిటీకి, స్టేట్ గవర్నమెంట్ ఫిషరీస్ డిపార్ట్మెంట్‌లకు అనేక మార్లు ఈ విషయమై వినతి పత్రములు ఇవ్వడం జరిగినదన్నారు అప్పట్లో మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్స్ ప్రతి సంవత్సరం పోర్టు వారి ఆధీనంలో పోర్ట్ డిప్యూటీ కన్సర్వేటరీ సర్వే అనేది నిర్వహించేవారు, ఆ సర్వేలో ఉద్దేశం ఏమిటంటే మేకనైజ్డ్ బోట్స్‌లో ఫైర్ నియంత్రణ పరికరాలు అలాగే లైఫ్ సేవింగ్స్, లైవ్ జాకెట్స్, లైఫ్ బోయస్, లైఫ్ బోయ సెల్ఫ్ ఇగ్నేటింగ్ లైట్స్ నిర్వహించడం పై రాష్ట్ర ప్రభుత్వం చే శిక్షణ ఇవ్వబడిన డ్రైవర్, ఉన్నారా? లేదా?అలాగే బోటు బాడీ కండిషన్ ఎలాగ ఉంది, సముద్రం లో నీటి ఒత్తిడిని తట్టుకోగలదా? అనే విషయాలపై పోర్టుకు సంబంధించిన కన్జర్వేటివ్ అధికారి సమక్షంలో సర్వే జరిపి, పిమ్మట బోటుకు పోర్ట్ ట్రస్టు సర్టిఫికెట్ ఇవ్వడం జరిగేదిని పేర్కొన్నారు. బోట్ ఇన్సూరెన్స్ రావాలన్న, ఈ పోర్టు వారు ఇచ్చిన సర్వే రిపోర్ట్ ఆధారం, ఈ సర్వే రిపోర్ట్ లేకపోతే, బోటు ప్రమాదంలో నష్టం జరిగితే, ఎటువంటి నష్టపరిహారం ఇన్సూరెన్స్ వారి ద్వారా ఇచ్చేవారు కాదు, క్రమేపి కొంతకాలం అయిన తర్వాత ఈ బోట్ సర్వే పోర్టు ద్వారా చేసుకోవడం ఇబ్బందికరంగా ఉందని, కొంతమంది బోట్ యజమానులు ఒక గ్రూపుగా ఏర్పడి గ్రూపు సిండికేట్ అని చెప్పి, వాళ్లలో వాళ్లు డబ్బులు కొంత కలెక్ట్ చేసుకుని బోట్ ప్రమాదంలో మునిగిపోతే ఆ బోటు యజమానికి కొంత మొత్తం ఇవ్వడం బాగుంటుందని నిర్ణయం చేయడం వల్ల, ఈ పోర్ట్ సర్వేకి బోట్లు పూర్తిగా వెళ్లడం ఆపివేయడం జరిగిందన్నారు. దానివలన సముద్రపు చేపలవేటలో నావిగేషన్ రూల్స్ రెగ్యులేషన్స్ తెలియక పోవడం చేతకాని, బోటులు మునిగిపోవడం, బోటులు అగ్నిప్రమాదం గురికావడం, బోటులో మత్స్యకారులు అధిక సంఖ్యలో మరణించడం జరుగుచున్నదని ఆయన అభిప్రాయం పడ్డారు. మరబోటుల ఫిట్నెస్ సర్వేలు, బోట్ డ్రైవింగ్ శిక్షణ లపై అటు పోర్టు గాని, ఇటు ఫిషరీస్ డిపార్ట్మెంట్ గానీ, శ్రద్ధ పెట్టకపోవడం వల్ల సరిఅయిన పర్యవేక్షణ లేకపోవడం చేత,ముందు జాగ్రత్త చర్యలు పాటించపోవటం వలన, మత్స్యకారులు ప్రాణాలను కాపాడుకోవడానికి, అగ్నిప్రమాదాలు నివారించుటకు అవకాశం లేకుండా పోతుందన్నారు. సముద్రం మధ్యలో రాత్రి సమయములో పెద్ద వాణిజ్య ఓడలు ప్రయాణంలో కేవలం కుడి,ఎడమ లైట్స్, షిప్ పొడవు, వెడల్పు తెలిపే లైట్స్ మాత్రమే వెలిగి ఉంటాయి, అవి శిక్షణ పొందే బోట్ డ్రైవర్ కి మాత్రమే తెలిసి ఉంటాయి, దానివలన ట్రావెలింగ్ ఫిషింగ్ బోట్ దానికి దూరంగా వెళ్ళిపోయి, ప్రమాదాల బారినుండి కాపాడుకోగలుగుతారన్నారు ట్రైనింగ్ డ్రైవర్ ఉంటే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని అన్నారు.బోట్లో ఈ లైఫ్ సేవింగ్స్ మనిషి ప్రాణాలు కాపాడడానికి, నావిగేషన్ రూల్స్ ,నైట్ టైం వచ్చే షిప్పు ఎంత దూరంగా ఉందిఅన్నది తెలుస్తుందన్నారు. ఇవన్నీ కూడా పాటించేటట్టు పోర్ట్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ చర్యలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని. మనుషులు ప్రాణాలు కాపాడుకోగలుగుతామన్నారు.ముఖ్యంగా అప్పట్లో మేము ఈ విషయం మీద 1982,1984 మధ్యలో కలెక్టర్ ఆఫీస్ వద్ద సుమారు 17 రోజులు రిలే నిరాహార దీక్ష చేయడం జరిగిందని ఈ సమస్యల మీద అప్పట్లో కలెక్టర్ ఎస్సీ ప్రసాద్ ఇటు మా మెకానిజడ్ ఫిషింగ్ వర్కర్స్ ను బోటు యజమానులను,పిలిచి ఆయన చాంబర్లో మీటింగ్లు పెట్టి విషయాలు తెలుసుకొని పూర్తిగా అవగాహన చే సుకొని ఇటువంటి ప్రమాదాల జరగడానికి వీల్లేదు నివారించాలని, పోర్ట్ ట్రస్టు వారికి అలాగే ఫిషరీస్ డిపార్ట్మెంట్ వారికి ఆదేశాలు జారీ చేస్తూ, ఫిషింగ్ హార్బర్ మౌత్ దగ్గర చెక్ పోస్ట్ పెట్టి ,వారి పర్యవేక్షణలో మెకానిజెడ్ ఫిషింగ్ బోర్డ్స్ లో ఈ లైఫ్ సేవింగ్ ఎక్విప్మెంట్స్ ,అగ్ని ప్రమాద నివారణ పరికరాలు,అలాగే డ్రైవర్లకుశిక్షణ సర్టిఫికెట్స్ ఉండేటట్లు చెక్ చేసి బోట్లు పంపించమని చెప్పి, అప్పట్లో పోర్ట్ వారికి ఏపీ మెసేజ్ డిపార్ట్మెంట్ వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.అది కొంతవరకు నడిచింది గాని క్రమేపి దానిపై పోర్టుట్రస్టు శ్రద్ధ చూపించక పోవడం వల్ల అది కనుమరుగైపోయినదని చెప్పారు.అప్పట్లో ఇన్సూరెన్స్ లింక్ ఉంది కాబట్టి బోట్ సర్వే అనేది చేసుకునేవారని, తర్వాత బోట్ యజమానులు సిండికేట్ పెట్టి డబ్బులు కలెక్ట్ చేసుకుని బోర్డు మునిగిపోతే ఎంతో కొంత డబ్బులు ఇవ్వడానికి వాళ్ళ నిర్ణయించుకున్న తర్వాత, పూర్తిగా బోటు భద్రతలమీద శ్రద్ధ అనేది చూపించడం మానేశారు, ఈ లైఫ్ సేవింగ్ జాకెట్స్ గాని ఈ ఫైర్ నివారణ పరికరాలు, లేకుండా వాళ్ళ మటుకు వాళ్లే బోట్లునడుపుకొని వేట కొనసాగిస్తున్నారు, ఇటువంటి ప్రమాద సమయాలు జరిగేటప్పుడు ప్రాణాలకు కోల్పోవాల్సివస్తుందన్నారు ఇకమీదైనా మరపడవల భద్రత వేటకు వెళ్లే మత్యాకారుల ప్రాణ సంరక్షణలపై దృష్టి సారించి పాత పద్ధతిని మరలా అమలు చేయాలని, స్టేట్ గవర్నమెంట్ ఫిషరీస్ డిపార్ట్మెంట్ పోర్ట్ అధికారులను కోరారు. ఇటువంటి భద్రతా నిబంధనలను తీసుకొని రాగలిగితే మత్స్యకారుల ప్రాణాలుకుల, ప్రభుత్వం భరోసాఇచ్చినవారవుతారు, కాకినాడ,మచిలీపట్నం, విశాఖపట్నంలలోని ప్రభుత్వ మత్స్యపరిశ్రమిక శిక్షణ కేంద్రములో బోట్ డ్రైవర్లకు పూర్తి స్థాయిలో శిక్షణలు ఇప్పించడం వల్ల భవిష్యత్తులో పడవ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అప్పారావు రాష్ట్ర ప్రభుత్వంను కోరారు.

జర్నలిస్టుల పిల్లల విద్యకు గంట్ల శ్రీనుబాబు చేయూత

-నలుగురు విద్యార్థులకు రూ.40 వేల ఆర్థిక సాయం

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త

జర్నలిస్టుల పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి జాతీయ జర్నలిస్టుల సంఘం (ఎన్ఏజే) కార్యదర్శి, ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. అక్కయ్యపాలెంలో జరిగిన కార్యక్రమంలో బీటెక్, ఎంఎల్‌టీ, ఇంటర్ చదువుతున్న నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, గత 15 ఏళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు, విద్యా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది వందలాది మంది విద్యార్థులకు, అవసరమైన జర్నలిస్టు కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

వర్షాకాల సన్నద్ధతపై దక్షిణ కోస్తా రైల్వే జీఎం ప్రత్యేక సమీక్ష

నీరు నిలిచే సబ్‌వేల వద్ద భద్రతా చర్యలను పరిశీలించిన సందీప్ మాథుర్

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త

వర్షాకాలంలో నీరు నిలిచే ప్రమాదం ఉన్న లిమిటెడ్ హైట్ సబ్‌వేల (ఎల్‌హెచ్ఎస్) వద్ద భద్రతా చర్యలను దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విశాఖపట్నం డివిజన్ పరిధిలోని పెందుర్తి-సింహాచలం నార్త్, గోపాలపట్నం-విశాఖపట్నం రైల్వే మార్గాల మధ్య ఉన్న సబ్‌వేల వద్ద వర్షపు నీటి నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా డీజిల్, విద్యుత్ మోటార్లు, సంప్ వ్యవస్థ, సహజ నీటి పారుదల, సీసీటీవీ నిఘా, పంప్ షెడ్లు, క్రాస్ డ్రైనేజీ, భద్రతా గొలుసులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాట్లను పరిశీలించారు. వర్షాకాలం మొత్తం అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచిన వెంటనే తొలగించి సబ్‌వేలను ప్రజల వినియోగానికి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని జీఎం ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలను నిరంతరం పర్యవేక్షిస్తూ భారీ వర్షాల సమయంలో సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచి ఇంజినీరింగ్, విద్యుత్, ఆపరేటింగ్ విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జగన్నాథ రథయాత్ర భక్తులకు ప్రత్యేక రైళ్లు

విశాఖ-పూరీతో పాటు జగదల్పూర్-పూరీ మధ్య ప్రత్యేక సర్వీసులు ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త :

పూరీలో జరిగే జగన్నాథ రథయాత్ర ఉత్సవాలకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ కోస్తా రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. జూలై నెలలో ఎంపిక చేసిన తేదీల్లో విశాఖపట్నం--పూరీ, జగదల్పూర్-పూరీ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం-పూరీ ప్రత్యేక రైలు (08551) జూలై 15, 23 తేదీల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ-విశాఖ ప్రత్యేక రైలు (08552) జూలై 17, 25 తేదీల్లో తెల్లవారుజామున 2.30 గంటలకు బయలుదేరి ఉదయం 11.05 గంటలకు విశాఖ చేరుతుంది. అదేవిధంగా జగదల్పూర్--పూరీ ప్రత్యేక రైళ్లు కూడా జూలై 15, 23 తేదీల్లో నడవనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లలో సాధారణ, స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేశారు. రథయాత్రకు వెళ్లే భక్తులు ఈ ప్రత్యేక రైలు సర్వీసులను వినియోగించుకోవాలని దక్షిణ కోస్తా రైల్వే విజ్ఞప్తి చేసింది.

రెండు రోజుల పర్యటనకు విశాఖ రానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

జేఎన్‌టీయూ-జీవీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొననున్న గవర్నర్

విశాఖపట్నం, జూలై 9, ప్రభాతవార్త

రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం విశాఖపట్నం రానున్నారు. రాత్రి 9.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని నగరంలోని ఓ హోటల్‌లో బస చేయనున్నారు. జూలై 11న ఉదయం 11 గంటలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే జేఎన్‌టీయూ-జీవీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.55 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు.

బాబురావు ఆశయాల కోసం ప్రతి ఒక్కరం పని చేద్దాం: రాష్ట్ర వైకాపా కార్యదర్శి వీసం

బుచ్చిరాజు పేటలో ఘనంగా వైఎస్సార్ జయంతి

నక్కపల్లి ,ప్రభాతవార్త

అనేకమంది పేద ప్రజల కోసం నిరంతరం నేనున్నాను అని అంటూ ధైర్యం చెబుతూ గ్రామ అభివృద్ధి కోసం పనిచేసిన స్వర్గీయ గొర్ల బాబురావు ఆశయాల సాధన కోసం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరితోపాటు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఏర్పాటు చేసిన దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టినరోజు కేకులు కట్ చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్ధిల్లాలి, అమర్ రహే బాబురావు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబురావు కుమారుడు శ్రీకాంత్ను పరిచయం చేస్తూ నా కొడుకు ఎంతో శ్రీకాంత్ కూడా అంతేనని అన్నారు. బాబురావు ఎప్పుడు కూడా గ్రామం కోసం ఆలోచించే వ్యక్తిని గ్రామంతో పాటు అనేక మంది కోసం నిత్యం ఆలోచిస్తూ వారి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసే వారిని అటు కార్మిక వర్గంలోని ఇటు గ్రామంలోని మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. బాబురావు లేదు అనే మాట ఈరోజు కూడా మర్చిపోలేకపోతున్నామని ఆవేదన వ్

జనసేన సైనికులు బాధ్యతాయుతంగా పనిచేయాలి: డి.సిఎం పవన్

విజయవాడ,జులై 9,ప్రభాతవార్తప్రతినిధి: జనసేన సైనికులు బాధ్యతయుతంగా ప్రజా సమస్యలపై పనిచేయాలని ఏపీ డిప్యూటీ సీఎం, జెఎస్పీ వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ అన్నారు.క్షేత్ర స్థాయి నుంచి పార్టీ నిర్మాణాత్మకంగా పనిచే యాలన్నారు.పార్టీ నిర్మాణాన్ని బలీయంగా నిలి పేందుకు అన్ని దశల్లో మనం తీసుకున్న కార్య చరణ పకడ్బందిగా అమలు చేయాలన్నారు.సర్ ప్రక్రియకు మద్దతును ఇస్తూనే మన ఓటర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రత్యర్థులు కుట్రలు తిప్పి కొట్టాలన్నారు. కచ్చితమైన ఓటరును కాపాడుకోవాలన్నారు.పార్టీ నిర్మాణంతో పాటు,కూటమి పక్షాలతో ఐక్యంగా వ్యవహరిం చాలన్నారు.నగరంలోని ఒక ప్రముఖ హోటల్ సభా ప్రాంగణంలో జనసేన పార్టీ కీలక సమా వేశం జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన ఏర్పాటైంది.ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజ రయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ

సమావేశంలో ప్రధానంగా చర్చ జరగింది.ఈ సమావేశం ప్రారంభంలో . పవన్ కల్యాణ్ మాట్లా డుతూ మనలను లక్ష్యంగా చేసుకుని సాగే దుష్ప్ర చారాలను బలీయమైన రీతిలో తిప్పికొట్టాల న్నారు. రావణ్ అంశంపై చట్టం వాస్తవాలను బట్టబయలు చేస్తుందన్నారు.యూట్యూబ్ ఛానళ్ల పేరుతో జర్నలిస్టులుగా చెప్పుకుని కొందరు, ఎనలిస్టులుగా మరికొందరు, కులమతాల సభల పేరిట ఇంకొందరు ఇటీవలి కాలంలో ఇష్టారా జ్యంగా మాట్లాడుతున్నారు. వారిపై కేసులు నమోదు చేస్తే అప్రజాస్వామికం, వాక్ స్వాతంత్రం హక్కు అనే వాదనల్ని తెరపైకి తెస్తున్నారు. ఇలాంటి వారిలో ఎక్కువమంది ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతు న్నారు. ఇలాంటి చర్యలకు చట్టపరంగానే అడ్డుకోవటంతో పాటు వారి వాదనల్ని తిప్పికొ ట్టాలన్నారు, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుగ్గా ఉండేలా కార్యాచరణ పవన్ నిర్దేశించారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జనసేనాని పార్టీ వర్గాలను ఆదేశించారు. ఇం దులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో నిర్వహించనున్న జనగళం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీకి చెందిన ఒక మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరయ్యేలా కార్యచరణ ఉండాలన్నారు.జనగళంతో పాటు మరికొన్ని ప్రజా కార్యక్రమాల బాధ్యతలనూ పార్టీ నేతలకు సూచించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాలపై పర్యవేక్షణ పెంచాలని దిశానిర్దేశం చేసారు. నియోజకవర్గాలలో సర్ కార్యక్రమాన్నీ పర్యవేక్షించి.. ఓట్లు మిస్ కాకుండా చూసేలా పవన్ సూచనలు చేసారు. ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా జనంలోకి తీసుకుని వెళ్ళాలన్నారు. గత రెండేళ్లలో పల్లె పండుగ వంటి కార్యక్రమాల ద్వారా రూ.16,695 కోట్ల ఉపాధి నిధులు వినియోగించామని. 7 వేల కి.మీ. సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500పశువుల నీటితొట్టెలు నిర్మించామన్నారు. స్వచ్ఛ గ్రామం, ఆరోగ్య గ్రామం లక్ష్య సాధన దిశగా పారిశుధ్య సేవలతో పరిశుభ్ర వాతావరణం అందించాం. పల్లె పండుగ విజయాలను స్ఫూర్తిగా కొనసాగిస్తూ రైతు పంట సకాలంలో మార్కెట్‌కు చేరుస్తున్నాం. లక్ష ఎక రాల్లో ఉద్యానవన పంటల సాగుకు సంకల్పిం చాం. 2025లో ఐదు జాతీయ పంచాయతీ అవార్డులు సాధించి దేశంలో రెండో స్థానంలో నిలిచామన్నారు.

గొల్లవానిగుంటలో రాష్ట్ర అంధుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తిరుపతి క్రీడ, జులై 9 ప్రభాతవార్త: తిరుపతిలోని గొల్లవాని గుంటలో బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర బ్లైండ్ క్రికెట్ టోర్నమెంట్‌కు టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ రవి నాయుడు కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ బ్లైండ్ క్రికెట్ క్రీడాకారులు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ జాతీయ పతాకాన్ని అంతర్జాతీయ వేదికలపై రెపరెపలాడిస్తున్న గొప్ప క్రీడాకారులని కొనియాడారు. గతంలో బ్లైండ్ క్రికెట్‌కు తగిన గుర్తింపు లేకపోయినా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి, బ్లైండ్ క్రికెట్ సంఘం ప్రతినిధులు రవీంద్రబాబు, శరత్ బాబు తదితరులను అభినందిస్తూ, సాధారణ క్రికెటర్లకు ఇచ్చే గౌరవంతోనే బ్లైండ్ క్రికెటర్లను కూడా గౌరవించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ టోర్నమెంట్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 8 పురుషుల జట్లు నుండి 118 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. 12వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించబడాలని ఆకాంక్షిస్తూ, ఇలాంటి రాష్ట్ర స్థాయి పోటీలు దివ్యాంగ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకువస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యురాలు శ్రీమతి పనబాక లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్లైండ్ క్రికెటర్ల ప్రతినిధులు, స్వర్గీయ ఎన్టీ రామారావు హయాంలో దివ్యాంగులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో టికెట్ లేకుండా దర్శన సౌకర్యం ఉండేదని, అదే విధానాన్ని తిరిగి అమలు చేయాలని పనబాక లక్ష్మిని కోరగా, ఆమె దీనిపై సానుకూలంగా స్పందిస్తూ తిరిగి అమలులో తెచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలియజేశారు.

రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యంగా తిరుపతిని రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు రవి నాయుడు ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఏఎస్పి ఆర్ల శ్రీనివాస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు, ఆంధ్రప్రదేశ్ బ్లైండ్ క్రికెటర్ అసోసియేషన్ సభ్యులు, తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శశిధర్, కోచులు, బ్లైండ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

విజయవాడ, జులై 9,ప్రభాతవార్తప్రతినిధి: ప్రజల విద్య, వైద్యం ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖల మంత్రి డా.డోలా. శ్రీ బాల వీరాం జనేయస్వామి అన్నారు. గురువారం అమరావతి సచివాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు. ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమర్థవంతంగా పనిచేసే సంరక్షణ ఆర్థిక వ్యవస్థను రూపొందించడం అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కి ముఖ్య అతిథిగా మంత్రి డా. స్వామి హాజర య్యారు. ఈ వర్క్ షాప్‌లో... పేదరిక నిర్మూలన, ఆకలి లేని స్థితి, మంచి ఆరోగ్యం మరియు శ్రేయస్సు, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, తగిన పని మరియు ఆర్థిక వృద్ధి, అసమానతను తగ్గించడం, సుస్థిర నగరాలు మరియు సమాజాలు, శాంతి, న్యాయం మరియు బలమైన సంస్థలు, లక్ష్యాల సాధన కోసం భాగస్వామ్యం అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాం జనేయస్వామి మాట్లాడుతూ ప్రజల విద్య, వైద్యం ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పి 4 తో రాష్ట్రంలో నిరుద్యోగం, పేదరికం నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. వీజీ బీ రామ్ జీ నుంచి యువతకు నైపుణ్య శిక్షణ వంటి వాటితో అందరికీ ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ కార్యాలయాల ద్వారా కౌసల్యం కార్యక్రమంతో గ్రామాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించి నైపుణ్య శిక్షణ ఇచ్చిన అనంతరం వారికి వర్క్ ఫ్రొం హోం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. రాష్ట్రం అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలి. వృద్ధులకు సైబర్ క్రైమ్స్ మోసాల పట్ల అవగాహన కల్పించాలి. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా శ్రీ బాల వీరాం జనేయస్వామి అన్నారు. ఈ వర్క్ షాప్ లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో హైటెన్షన్

టిడిపి, వైసిపి నేతల చర్యలతో ఉద్రిక్తత

మాజీ ఎంపీ గోరంట్ల, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి అరెస్ట్

అనంతపురం క్రైమ్ జులై 9 ప్రభాతవార్త: నువ్వా.. నేనా.. అంటూ టిడిపి, వైసిపి నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలతో అనంతపురం జిల్లా రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఎప్పుడు, ఏమి జరుగుతుందోనని నగరమంతా ఉత్కంఠతో అట్టుడికింది. మడకశిర తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాప్తాడు వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిల మధ్య బిగ్ వార్ జరుగుతోంది. ఇందులో భాగంగానే వైసీపీ నేత పై టీడీపీ నేత ఎమ్మెస్ రాజు అక్రమాస్తుల నిరూపణ కోసం గురువారం డెడ్ లైన్ విధించగా ఉదయం నుండి ఉద్రిక్తతకు దారి తీసింది. పూర్తి వివరాల మేరకు సుమారు పక్షం రోజులుగా ఒకరిపై ఒకరు చేసుకున్న ఘాటైన విమర్శలు, ప్రతి విమర్శలతో, పదునైన వ్యాఖ్యానాలు, మాటలు తూటాల్లా పేలాయి. మీడియా సమావేశాలే వేదికగా చేసుకున్న ఇరు పార్టీల నేతల మధ్య సాగిన ఆరోపణలు చివరకు వ్యక్తిగత దూషణల దాకా దారితీసింది. ఈ నేపథ్యంలో తొలుత కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తన అనుచరులతో సర్ మీటింగ్ కోసం ప్రత్యేక బస్సుల్లో అనంతపురం నగరానికి వస్తున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య తో వైసిపి నాయకులు కార్యకర్తలు తమ బస్సులను అడ్డగించి తమపై దాడికి ప్రయత్నించారంటూ ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఆ పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా ఎస్పీ జగదీష్ కు ఫిర్యాదు చేశారు. ఇందుకు కౌంటర్ గా మరిసటి రోజే ప్రకాష్ రెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు. తాను తన వాహనంలో ప్రయాణిస్తుండగా బుక్కరాయ సముద్రం సమీపంలో సురేంద్రబాబు తన ఎస్ఆర్ కన్స్ట్రక్షన్ కు సంబంధించిన టిప్పర్ తో తనను హత్య చేసేందుకు పెద్దగా కుట్ర పన్నారని, తన వాహన డ్రైవర్ చాకచక్యంతో కుట్ర నుండి తప్పించుకున్నామని ఘాటుగా ఆరోపించారు. ఎమ్మెస్ రాజు ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే అక్రమాస్తులు కూడగట్టారని, అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేసారు. ఈ కుట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రొద్బలంతోనే ఇదంతా జరిగిందని విమర్శించారు. ఎందుకు స్పందించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్ర బాబు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ లు రీ కౌంటర్ ఇచ్చారు. జిల్లాలో ఈ వ్యవహారంతో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నగరంలోని శ్రీ నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఇంటి వద్ద, అలాగే ఆ సమీపంలోనే వున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసం వద్ద పోలీసు అధికారులు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో వైపు పోలీసులు ప్రకాష్ రెడ్డి నివాసంలో తనిఖీలు చేపట్టారు. మారణ ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముందుగానే ఏర్పాటు చేసుకున్న రాళ్ల కుప్పలను అక్కడి నుండి తొలగించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని దాడులకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడే ఉన్న ప్రకాష్ రెడ్డి తండ్రి, కొందరు వైసిపి శ్రేణులు మహిళా నాయకురాళ్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు అక్కడికి చేరడంతో పరిస్థితిని అదుపు చేయడం కోసం పోలీసులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని, అతన్ని కలిసేందుకు వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ను అరెస్టు చేశారు. పోలీసు సిబ్బంది ఇద్దరినీ బలవంతంగా పోలీసు జీపులు ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తుననినాదాలు చేస్తూ పోలీసులను అడ్డుకోవ డంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఉద్రిక్త పరిస్థితుల నడుమ అతి కష్టంపై పోలీసులు వాహ నంలో ఎక్కించుకొని స్టేషన్ కు తరలించారు. దీంతో ఉదయం నుండి కొన్ని గంటలపాటు కొన సాగిన ఉత్కంఠకు తెరపడింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు.

విజయవాడలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విజయవాడ, జులై 9, ప్రభాతవార్త : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను గురువారం ఉదయం విజయవాడ యంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్‌లు ప్రారంభించారు. విజయవాడలోని పడమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 9వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనటం వల్ల దేహదారుడ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు, యువత ప్రతిరోజూ గంటసేపైనా తమకిష్టమైన ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలలో పాల్గొనటం వల్ల పేరుప్రఖ్యాతులు వస్తాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వం ఉద్యోగవసతి కల్పిస్తుం దన్నారు. క్రీడలలో రాణించి దేశానికి పేరుతీసు కు రావాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్రం లోని వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రషస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడుతున్న యంపి కేశినేని చిన్ని,ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ తదితరులు

విమాన సర్వీసులు పెంచాలి

ఎడ్వయిజరీ కమిటీ ప్రతిపాదన

విమానాశ్రయ ఎడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యంపి బాలశౌరి

దుబాయ్, శ్రీలంకకు సర్వీసులు ఏర్పాటు చేయాలి

గన్నవరం(కృష్ణా), జులై 9, ప్రభాతవార్త : గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి దేశీయ, అంతర్జాతీయ విమానసర్వీసులు మరిన్ని ఏర్పాటు చేయాలని విమానాశ్రయ అడ్వయిజరీ కమిటీలో ప్రతిపాదించారు. గన్నవరం విమా నాశ్రయ అడ్వయిజరీ కమిటీ సమావేశం గురు వారం విమానాశ్రయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చైర్మన్, బందరు యంపి వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కోచైర్మన్ విజయవాడ యంపి కేశినేని చిన్ని, వైస్‌చైర్మన్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌లు పాల్గొని పలు అంశాలపై చర్చిం చారు. ఈసందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ నూతన టెర్మినల్ భవనం దసరానాటికి పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఇక్కడి నుండి సింగపూర్, షార్జాకు ఉన్న సర్వీసులకు అదనంగా శ్రీలంకకు నేరుగా విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని కమీటిలో ప్రతిపాదించినట్లు తెలిపారు. దుబాయ్‌కి ఎమిరేట్స్ విమానసర్వీసు ప్రారంభం అయితే అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలకు కనెక్టివిటీ ఉంటుందన్నారు.ఈవిషయాన్ని ఇప్పటికే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్ళినట్లు బాలశౌరి వివరించారు. వారణాసి, ముంబాయి, కోల్‌కత్తా, కొచ్చిన్, గోవా, తదితర నగరాలకు ఇక్కడి నుండి విమాన సర్వీసులు ప్రారంభించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. గన్నవరం విమానాశ్రయం నుండి విజయవాడ పశ్చిమ బైపాస్‌కు ఏడు కిలోమీటర్ల మేర నాలుగలేన్ల రహదారి నిర్మాణానికి డిపిఆర్ సిద్ధమవుతుందని యంపి తెలిపారు. కోచైర్మన్ కేశినేని చిన్ని మాట్లాడుతూ విమానాశ్రయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కమిటీలో చర్చించినట్లు తెలిపారు. ఇక్కడి నుండి కొచ్చిన్, అహ్మదాబాద్‌తోపాటు దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. వైస్‌చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలి ౖ ఉందన్నారు. నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించినప్పటికీ ఇంకా కొందరు రైతులు న్యాయం కోసం ఎదురుచూ స్తున్నా రన్నారు. ఎమిరేట్స్ వంటి అంతర్జాతీయ విమానయాన సంస్థలు సర్వీసులు ప్రారంభిస్తే విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో జిల్లాఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో ఎపికి రెండో ర్యాంకు

విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి: ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో ఏపీకి రెండో ర్యాంకు లభించింది. రోడ్ల నాణ్యత విషయంలో ఏపీ మంచి ప్రమాణాలు పాటిస్తోందని కితాబు పలికింది. నిరంతర సమీక్ష, క్షేత్రస్థాయిలో నాణ్యత పరిశీలన వల్ల ఏపీకి ర్యాంకు దక్కింది. కొన్ని రోడ్ల నాణ్య తను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా పరిశీలించారు. వైఎస్సార్సీపీ హయాంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ 19వ ర్యాంకులో ఉంది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో ఏపీకి రెండో ర్యాంకు రావడం పట్ల "ఎక్స్" వేదికగా హర్షం వ్యక్తం చేసారు.అధికారులను అభినందించారు.

14 అసంపూర్తి వంతెనల వినియోగానికి నిధులు మంజూరు

విజయవాడ,జులై 9,ప్రభాతవార్తప్రతినిధి: సుదీర్ఘకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన 14 వంతెనలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటి నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి రూ.90.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధుల విడుదలకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సమస్యలు పరిష్కారం కోసం 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా

చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళ కాలం గడచిపోయినా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు ఏ ఒక్కటి నెరవేరలేదని ఫ్యాప్టో నాయకులు ధ్వజమెత్తారు. ఈ పరిస్థితుల్లో ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని నిర్ణయించి ఈ నెల 14వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా, నిరసన, పికెటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో నేతలు పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా ఎన్జీఓ భవనంలో గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఎఫ్యాప్టో నాయకులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో ఛైర్మన్ మణిగండన్, సెక్రటరీ జనరల్ ముక్తర్ అహ్మద్, నరోత్తమ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, జగదీష్, చెంగల్రాయమండడి, చిట్టిబాబు, చలపతి, ముక్తా రహమత్, ఎస్పీ భాషా, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

72 అడుగుల మట్టి మహా గణపతిని ఏర్పాటుకు భూమిపూజ

విజయవాడ, జులై 9, ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడలో 72 అడుగుల భారీ మట్టి మహా గణపతిని ఏర్పాటు చేసేందుకు భూమిపూజ నిర్వహించారు. డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఏడాది విజయవాడలో ప్రతిష్ఠించనున్న పర్యావరణహిత పంచముఖ మట్టి మహా గణపతి విగ్రహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహ నమూనాను ఆవిష్కరించారు. భక్తి, సంప్రదాయాలతో పాటు ప్రకృతి పరిరక్షణ కూడా కలిసి నడవాల్సిన అవసరం ఉందని ఎంపీ తెలిపారు.ప్రతి సంవత్సరంలాగే డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణ హిత మట్టి మహా గణపతి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

స్టాల్స్ సందర్శించిన ఎం.రాజేశ్వరి

నెల్లూరు, జులై 9, ప్రభాతవార్త-కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఎం రాజేశ్వరి, వారి బృందం ఎన్ఆర్ఎల్ఎం కార్యక్ర మాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శనలో భాగంగా స్వయం సహాయక సంఘ సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించి ప్రశంచారు. ప్రదర్శించిన ఉత్పత్తులు ఉదయగిరి ఉడెన్ కట్లరీ, చెక్కనగిషీలు, వాటి ప్యాకింగ్ అద్భుతంగా, ఉన్నాయని ప్రశంచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. నాగరాజకుమారి, వివిధ రకాల మహిళా వ్యాపారవేత్తలు, డిఆర్డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు విపిఆర్ ఆర్థిక చేయూత

ఉచితంగా తోపుడు బండ్ల పంపిణీ

కోవూరు (నెల్లూరు),జులై 9, ప్రభాతవార్త : స్వశక్తితో జీవనం సాగించే ఒంటరి మహిళలు, వృద్ధ చిరువ్యాపారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి చిరువ్యాపారాలు చేసుకుంటున్న ఒంటరి మహిళలు, వృద్ధులు ఉపాధి కోసం అద్దెకు తోపుడు బండ్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.

9 మండలాలకు 6వేల క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు

మిగిలిన మండలాల్లో కన్పించని సబ్సిడీ విత్తనాల జాడ

చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త: రైతులకు ఖరీఫ్ పంటలు సాగు చేసుకోవడానికి సీజన్ ప్రారంభానికి ముందు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ వేరుసెనగ విత్తనాల జాడ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నప్పటికీ కన్పించకపోవడంతో జిల్లా రైతాంగం సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం అల్లాడుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో సైతం సాధారణ వర్షపాతం నమోదు అయి వుంటే జులై 15 నాటికి రైతులు వేరుసెనగ విత్తనాలను తమ పొలాల్లో విత్తి పూర్తి చేయాల్సివుంది. అయితే ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో జులై నెలాఖరు నాటి వరకు వేరుసెనగ విత్తనాలను పొలాల్లో విత్తవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలోని వేరుసెనగ సాగు చేసే రైతులకు పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ 27,225 క్వింటాళ్ళ సబ్సిడీ విత్తనాలను కేటాయించింది. అయితే గత నెలన్నర రోజుల నుండి జిల్లాలోని కేవలం 9 మండలాలకు మాత్రమే 6 వేల క్వింటాళ్ళ సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు మాత్రమే వచ్చాయి. మిగిలిన మండలాల్లోని రైతులు సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం కష్టకష్టాలు పడుతున్నారు. అయితే ప్రభుత్వం కుప్పం, పలమనేరు మండలాల పరిధిలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లి, బైరెడ్డిపల్లి, వి.కోట, పలమనేరు మండలాలతో పాటు జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం మండలాలకు మాత్రమే 6 వేల వేరుసెనగ సబ్సిడీ విత్తనాలను సరఫరా చేసింది. మిగిలిన మండలాల్లో ఇప్పటి వరకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాల జాడ కన్పించడం లేదు.

అన్న క్యాంటిన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

విజయవాడ, జులై 9, ప్రభాతవార్త : అన్న క్యాంటిన్‌ను ఎన్టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆకస్మిక తనిఖీ చేసారు. విజయవాడ కృష్ణలంకలో ఉన్న క్యాంటిన్‌ను గురువారం మధ్యాహ్నం కలెక్టర్ తనిఖీ చేసి క్యాంటిన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, భోజనం వడ్డించే విధానం, లబ్దిదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆహార నాణ్యత, రుచి పై లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటిన్‌లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు. ఆహారం రుచికరంగా ఉండటంతోపాటు, నాణ్యత విషయంలో రాజీపడే ప్రశ్నేలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం సామాన్య ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఈక్యాంటిన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

10skl13:10skl13.qxd 09-07-2026 23:46 Page 1

బీచ్ ఏరియాలో బెల్ట్ షాపులు నడిపితే కఠిన చర్యలు

- మెరైన్ సీఐ రాము హెచ్చరిక

సంతబొమ్మాళి, జూలై 9, ప్రభాత వార్త :

శ్రీకాకుళం జిల్లాలో కళింగపట్నం బీచ్ నుండి బారువ బీచ్ వరకు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మెరైన్ సీఐ రాము హెచ్చరించారు. బీచ్ ప్రాంతంలో ప్రశాంత వాతావరణాన్ని భంగపరిచేలా ఎవరైనా అక్రమ మద్యం విక్రయాలు చేపడితే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల భావనపాడు బీచ్‌కు పర్యాటకుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీచ్‌కు వచ్చే కుటుంబాలు, మహిళలు, చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, బీచ్‌లో ఎటువంటి మరణాలు జరగకుండా పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారని చెప్పారు. బెల్ట్ షాపుల నిర్వహణ, అక్రమ మద్యం విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందిస్తే వెంటనే దాడులు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రాము పేర్కొన్నారు. బీచ్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు

వీరఘట్టం, జూలై 9, ప్రభాతవార్త :

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీఐ బి.వెంకటరాజు ఆదేశాల మేరకు బుధవారం మండలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సంత నర్సిపురం, మహాదేవవలస, చలివేంద్రి గ్రామాల్లో నాటు సారా అమ్మకాలపై ఆరా తీశారు. అలాగే బెల్ట్ షాపులు ఎవరైనా నిర్వహిస్తున్నారా అనేదానిపై నిఘా పెట్టారు. అదేవిధంగా మండల కేంద్రంలోని వైన్ షాపులలో సరుకులు నాణ్యతపై తనిఖీలు నిర్వహించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సై వి.ఎన్.రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

నరసన్నపేట, జూలై 9, ప్రభాతవార్త:

నరసన్నపేట మండలం ఉర్లాం పరిసర విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం అంతరాయం కలగనుంది. 13 బై 11 కేవీ ఉర్లాం స్టేషన్‌లో 11 కె.వి చోడవరం, 11 కెవి ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్స్‌పై ఆర్డీఎసఎస్ వర్క్ నిమిత్తం ఈ ఫీడర్స్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. అనగా నడగాం, ఉర్లం హైస్కూల్, గొణపపేట, కామేశ్వరిపేట, కొల్లివానిపేట, తోటాడ, బాదాం, చెన్నాపురం, తెలగవలస, పారసెల్లి, ముద్దాడపేట, చోడవరం, శివరాంపురం లోకల్, లుకలాం పంప్ హౌస్, జల్లువానిపేట, కొత్త పాలవలస, పాలకొండ పేట, నరసింగు రాయుడుపేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కావున తదితర ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించగలరని టెక్కలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.నరసింహకుమార్ తెలియజేశారు.

బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శిగా రాజేంద్ర నియామకం

రణస్థలం, జూలై 9 (ప్రభాతవార్త):

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శిగా రణస్థలం మండల కేంద్రం జే ఆర్ పురానికి చెందిన దన్నాన రాజేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నెరవేరుస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తనకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు బీజేపీ రాష్ట్ర రథసారధి పి.వి.ఎన్. మాధవ్, ఆంధ్రప్రదేశ్ సంఘటనా మహామంత్రి మధుకర్ జీ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు ప్రకటించారు.

ఐటీడీఏ కార్యాలయంలో రూపుదిద్దుకున్న సవర ఆర్ట్స్ చిత్రాలు



సీతంపేట, జూలై 9 ప్రభాతవార్త

ఐటిడిఏ కార్యాలయంలో సవర ఆర్ట్స్ చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. పిఓ, ఏపీవో అకౌంటెంట్ ఛాంబర్‌లో సవర చిత్రలేఖనం వాల్ పెయింటర్లను చూపర్లని ఆకట్టుకుంటున్నాయి. ఐ టి డి ఏ కార్యాలయానికి వివిధ పనుల మీద వస్తున్న వారు ఈ చిత్రలేఖనం చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీలకు సంబంధించి అన్ని పండగలు ఈ చిత్రలేఖనం ద్వారా తెలియపరచడం పలువురిని ఆకట్టుకుంటున్నాయి.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

కవిటి, జూలై 9, ప్రభాతవార్త

కరువు భత్యం బకాయిలు వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని, పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 కవిటి మండలం అధ్యక్షులు శ్రీరామమూర్తి బిసాయి అన్నారు. వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండలంలో వివిధ పాఠశాలలు సందర్శించి ఏపీటీఎఫ్ 1938 కవిటి మండల బృందం ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు చేశారు. ఏపీటీఎఫ్ బృందం పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయగలమని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరామ్మూర్తి బిసాయి, భాగ కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి బల్ల ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శమల్ల రాజబాబు, మొర్రి గోపి, గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రంగారావు, కార్యవర్గ సభ్యులు అనుపోజు హిమకుమార్, పర్రి సాయిరాజ్, కేశవ పురియ, త్రిలోచన బిసాయి, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్ కార్యకర్త మొగలిపురి ధిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లింగయ్య కుటుంబానికి పరామర్శ

కంచిలి, జూలై 9 ప్రభాతవార్త

కంచిలి పంచాయితీ గొల్ల కంచిలి కాలనీకి చెందిన కొల్లి లింగయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, వైఎసఆర్ పార్టీ నాయకులు పరామర్శించారు. లింగయ్య తమ్ముడు కొల్లి తాతయ్య వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు. అనారోగ్యంతో మృతి చెందడం విషయం తెలుసుకున్న ఎంపీపీ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొల్లి ఈశ్వరరావు, మడ్డు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రోజు విడిచి రోజు నీరు సరఫరా

ఆముదాలవలస, జూలై 9 (ప్రభాతవార్త)

మున్సిపాలిటీలో రోజు విడిచి రోజు మంచి నీరు సరఫరా చేయనున్నట్లు కమిషనర్ తమ్మినేని రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో అలమాజీపేట వద్ద ఏఐబి స్కీం మంజూరైందని, ఈ పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలు మంజూరు చేయబడునని, పంశధార నదిలో ఇన్సులేషన్ బావుల గ్యాలరీ నిర్మించబడునందున సుమారు 20 అడుగుల త్రవ్వి గ్యాలరీ నిర్మించుచున్నారని అందులో నీటిని బయటకు దాటడం జరుగుతున్నది. కావున దీని వలన ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్టేషన్‌కి సరపడినంత నీరు అందడం లేదని, దీనివలన 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా చేయబడునని కమిషనర్ రవి తెలిపారు.

గురుకులంలో నేరుగా ప్రవేశాలు

కంచిలి, జూలై 9, ప్రభాతవార్త:

కంచిలి బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశానికి అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.వి.రమణయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదవ తరగతి ఎస్సీ 59 ఓసి 1, ఆరవ తరగతి ఎస్సీ 34 ఓసి 2, 7వ తరగతి ఎస్సీ 22, ఓసి 2, 8వ తరగతి ఎస్సీ 8, ఓసి 2, 9వ తరగతి ఎస్సీ 14, ఓసి 2, 10వ తరగతి ఎస్సి 7, ఓసి 2, ప్రథమ సంవత్సరం ఎంపీసీ ఎస్సీ 4, బైపిసి ఎస్సి 19, ఓసి 1, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఎస్సీ 13, ఓసి 1, బైపిసి ఎస్సి 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన వారు సోమవారం నేరుగా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

పంచాయతీ రాజ్ మినిస్టీయల్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం

ఇచ్ఛాపురం, జూలై 9, ప్రభాతవార్త:

ఇచ్ఛాపురం తాలూకా యూనిట్ పంచాయతీ రాజ్ మినిస్టీయల్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా పి.నాగేశ్వ రరావు వ్యవరించారు. అధ్యక్షుడుగా కే.రామారావు, సెక్రటరీగా ఎం.శ్రీధర్, ఉపాధ్యక్షురాలిగా నిరో రౌలో, జాయింట్ సెక్రటరీగా పి.కిరణ్ కుమార్, కోశాధికారిగా ఎం.చంద్ర మౌళి, జిల్లా కౌన్సిలర్‌లుగా కే.శ్రీనివాస్ రెడ్డి, టి.తిరుపతి బాబులను ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయించారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన కలెక్టర్‌కి సన్మానం

వీరఘట్టం, జూలై 9 ప్రభాతవార్త

ఆయోగ్ ఆశావాహ జిల్లాల డెల్టా ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన పార్వతీపురం మన్యం జిల్లాకు నాయకత్వం వహించిన జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డిని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. నీతి ఆయోగ్ ప్రకటించిన డెల్టా ర్యాంకింగ్‌లో ఆరోగ్యం మరియు పోషకాహారం విభాగంలో దేశంలోనే ప్రథమ స్థానం, అలాగే మౌలిక సదుపాయాల విభాగంలో ద్వితీయ స్థానం సాధించడం మన్యం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం, వివిధ శాఖల అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వల్లే ఈ అరుదైన విజయాలు సాధ్యమయ్యాయని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్ల కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి చూపిన ప్రత్యేక చొరవ, కార్యదీక్ష ఫలితంగానే జాతీయ స్థాయిలో మన్యం జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి జిల్లాను దేశానికి ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు.

ప్రతి నీటి చుక్కనూ వినియోగించుకోవాలి

-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూలై 9 ప్రభాతవార్త:

జిల్లా రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా వంశధార ప్రాజెక్టు నుంచి 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన ఈ నీటితో ఆయకట్టు పరిధిలోని అన్ని చెరువులను తక్షణమే నింపుకోవాలని ఆయన రైతులకు సూచించారు. సాగునీటి సరఫరాలో ఎలాంటి వ్యత్యాసాలు రాకుండా, ప్రతీ ఎకరానికి నీరందేలా ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో రైతులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని కోరారు. నీటి వృధాను అరికడుతూ, లభ్యతగా ఉన్న ప్రతి నీటి చుక్కనూ అత్యంత పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకుని ప్రస్తుత పంట కాలాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా రైతాంగానికి మంత్రి విజ్ఞప్తి చేశారు.

దేశద్రోహ చర్యలను ప్రోత్సహిస్తున్న వైకాపా మాజీ మంత్రులపై కేసులు నమోదు చేయాలి : పేడాడ

ఆమదాలవలస, జూలై 9 (ప్రభాతవార్త) :

సనాతన ధర్మ వ్యతిరేకి, మావోయిస్టు భావజాల ప్రచారకుడు ప్రశ్న రావణ్‌కు మద్దతుగా నిలిచిన వైసీపీ మాజీ మంత్రులపై కేసులు నమోదు చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్ రావు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎచ్చె బాలరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎదుట విలేకరులతో రామ్మోహన్ రావు మాట్లాడుతూ కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరామునిపై, మన పవిత్ర గ్రంథాలపై, సనాతన ధర్మంపై అత్యంత దారుణమైన, అనుచితమైన వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా, సమాజంలో అశాంతిని రేకెత్తించేలా, దేశ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించేలా మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్న ప్రశ్నా రావణ్‌పై ఇప్పటికే పోలీసులు తీవ్రమైన అభియోగాలతో కేసులు నమోదు చేశారనీ అన్నారు. ఇలాంటి దేశ వ్యతిరేక, మత విద్వేష పూరిత విచారణ దశలో ఉన్న తీవ్రమైన కేసులలో నిందితుడిగా ఉన్న వ్యక్తికి, వైసిపి నాయకులు బహిరంగంగా మద్దతు ఇవ్వడం అత్యంత బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు, రాష్ట్రానికి మాజీ మంత్రులుగా ఉన్నవారు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ తెలిపారు.కానీ దానికి భిన్నంగా, వైసిపి నాయకులు సమాజంలో మత విద్వేషాలను, ఉగ్ర-మావోయిస్టు భావజాలాలను రెచ్చగొట్టేలా మాట్లాడిన వ్యక్తి వెనుక నిలబడటం సిగ్గుచేటనీ,అందుకే ప్రశ్నా రావణ్‌కు బహిరంగంగా మద్దతు తెలిపిన వైసిపి నాయకులు, అంబటి రాంబాబు, పేర్ని నాని, కొడాలి నాని పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి జనసేన మండల అధ్యక్షులు పైడి మురళి మోహన్, బగాది తేజేశ్వరరావు, మజ్జి రాంబాబు, కాకితాపల్లి రాంబాబు, సిర్లాపు గణేష్,తోట సునీత, పంచిరెడ్డి శ్రీనివాసరావు,మజ్జి దిలీప్,పైడి ధనుంజయ్, గంద్రెడ్డి వాసు నాయుడు, తోట అప్పలరాజు, తురుమళ్ళ రమణ, పైడి మల్లేష్, సంకు శరత్,ఊటపల్లి అప్పారావు, బెండి నారాయణరావు, మురాల మిన్నారావు,మహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరాకు దరఖాస్తులు

టెండర్ ధరఖాస్తులకు చివరి తేది ఈనెల 17

వీరఘట్టం, జూలై 9, ప్రభాతవార్త:

పార్వతీపురం మన్యం జిల్లాలలోని 14 కస్తూరిభా గాంధీ బాలిక విద్యాలయాలు మరియు 9 ఎ.పి.ఎం.ఎస్, జెడ్ పిహెచఎస్‌లకు, అనుబంధంలో ఉన్న బాలికల వసతి గృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరాకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్టు సమగ్ర శిక్ష అదనపు పధక సమన్వయకర్త (ఎపిసి) బి.రాజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ధరఖాస్తు రుసుము కూరగాయలు, పండ్లు మరియు చికెన్ సరఫరా కొరకు రూ.50 వేలు (తిరిగి చెల్లించబడదు) ఏ పి సి మరియు ఎఫఏఓ సమగ్ర శిక్ష పార్వతీపురం వారి పేరు మీద, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పార్వతీపురం బ్రాంచ్ నందు చెల్లుబాటు అయ్యే విధంగా డిడి తీయాలని సూచించారు. ఈఎండి/సెక్యూరిటీ డిపాజిట్ రూ.3,46,488లు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఈఎండి/డిడి తెలియవలసిన పేరు ఎపిసి మరియు ఎపఎఓ, సమగ్ర శిక్ష, పార్వతీపురం వారి పేరున యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పార్వతీపురం బ్రాంచ్. టెండర్ దరఖాస్తులను ఈనెల 09 నుండి జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్ష పార్వతీపురం కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, కార్యాలయపు పని వేళలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను పొందవచ్చునని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు.

బీఎల్‌వోల పనితీరు పర్యవేక్షణ

టెక్కలి, జూలై 9, ప్రభాతవార్త:

టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర ప్రక్రియలో వెనుకబడి ఉన్న పోలింగ్ స్టేషన్‌లలో బిఎలఓల పని తీరును మండల ప్రత్యేక అధికారిని ఎం.శైలజ పర్యవేక్షించారు. కార్యక్రమంలో టెక్కలి ఎంపీడీవో ఎమ్.రేణుక, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సి.ఎఫ్‌లు పాల్గొన్నారు.

మండలంలో 3800 ఎకరాలలో పిఎండిఎస్ సాగు

వీరఘట్టం, జూలై 9, ప్రభాతవార్త :

మండలంలోని 3800 ఎకరాల్లో పిఎండిఎస్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య తెలిపారు. గురువారం మండలంలోని కంబర, చిట్టపులివలస గ్రామాలలో వేసిన నవధాన్యాలు సాగును ఆమె స్వయంగా పరిశీలించారు. కంబర గ్రామంలో దాదాపు 200 ఎకరాలు, అలాగే చిట్టపులివలస గ్రామంలో 110 ఎకరాలు సాగుని చూడడం జరిగిందన్నారు. అంతేకాకుండా అరటి మరియు మామిడి జీడి తోటల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. దీనితోపాటు కంబరలో కొత్తగా ఏటీఎం మోడల్ విత్తే విధానాన్ని కూడా పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

ఆహారంలో నాణ్యత, పరిశుభ్రత పాటించాలి

సీతంపేట, జూలై 9, ప్రభాతవార్త:

గురుకుల పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఆహారంలో నాణ్యత, పాఠశాల పరిసరాలు పరిశుభ్రత పాటించాలని ఐటీడీఏ ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయడు స్పష్టం చేశారు. గురువారం మల్లి గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వసతి గదులు హాస్టల్ రూమ్స్ పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతతో, వంటశాల, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం మలేరియా కేసులు మండలంలో అధికంగా ఉన్నందున జ్వరం మలేరియా లక్షణాలు ఉన్న విద్యార్థులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలన్నారు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావుకి సూచించారు.

ప్రసవ వేదనతో భాధపడినట్లైతే డాక్టర్‌ను సంప్రదించాలి

-పశువైద్యాధికారి కిరణకుమార్

టెక్కలి/కోటబొమ్మాళి, జూలై 9, ప్రభాతవార్త :

పశువులు ప్రసవ వేదనతో ఇబ్బంది పడినట్లు అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని మండలం నిమ్మాడ పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణకుమార్ అన్నారు. టెక్కలి మండలం తిర్లింగి గ్రామానికి చెందిన బుద్ద శ్రీనివాసరావుకు సంబంధించిన సంకరజాతి అవు బుధవారం సాయంత్రం నుంచి ప్రసవ వేదనలో ఇబ్బంది పడడంతో అక్కడ ఉన్న సిబ్బంది రాత్రి వరకు ప్రయత్నించిన విఫలం కావడంతో రాత్రి డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన తిర్లింగి గ్రామానికి వెళ్లి ఆవును పరీక్షించి లోపల రెండుతలల దూడ ఉందని, ఆ దూడ కూడా ప్రాణంతో లేదని భావించి సాధారణ ప్రసవానికి ప్రయత్నించినప్పటికీ ప్రసవం కాలేదు. ఇక లాభం లేదనుకొని శస్త్రచికిత్స చేసి రెండుతలల వింత దూడని బయటకు తీశారు. ఈ దూడకు ఒక మెడ, రెండు చెవుళ్లు, రెండు తలలు, నాలుగు కళ్ళు, రెండు నాలుకలతో వింతగా ఉంది. ఈ పరిస్థితిలో పుట్టిన దూడను డైసెఫాలిక్ హెడెడ్‌ోటస్ లేదా ఫీటల్ మాసప్టర్ అంటారని ఆయన తెలి పారు. ఇది పిండం ఎదుగుదల జరిగినప్పుడు జరిగిన జన్యుమార్పిడిలో లోపాల వల్ల ఇలాంటివి పుడతాయని ఆయన తెలిపారు. అయితే సమయానికి ఆవుకు శస్త్రచికిత్స చేయడం వల్ల ఆవు ప్రాణాపాయం నుంచి బయటపడింది.

ఈ రోడ్డుకు మోక్షం ఎపుడో..?

పాలేశ్వరస్వామి ఆలయం-వడ్డివాడ మధ్య గుంతల మయం

మొద్దు నిద్రలో ఆర్ అండ్ బి అధికారులు

సంతబొమ్మాళి, జూలై 9, ప్రభాతవార్త:

డోలా-పోలాకి మీదుగా నౌపడ (డీపీఎన్) రోడ్డు పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించి ఏడాది గడిచిన ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాలేశ్వరస్వామి ఆలయం నుంచి వడ్డివాడ వరకు రహదారి గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ అదుపు తప్పే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, రాత్రివేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని వారు చెబుతున్నారు. ప్రతిరోజూ పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ మార్గాన్నే వినియోగిస్తున్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా గుంతలు మరింత లోతుగా మారి ప్రయాణికులకు ఇబ్బందులు పెరిగాయని స్థానికులు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణ పనులకు సమయం పట్టినా కనీసం గుంతలు పూడ్చడం, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి అత్యవసర చర్యలు వెంటనే చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

108 వాహనంలో ప్రసవం

సరుబుజ్జిలి, జూలై 9, ప్రభాతవార్త :

ఎల్ ఎన్ పేట మండలం గౌరీపాలంగూడ గ్రామానికి చెందిన గర్భిణి ఎస్.అనిత (29)కు ప్రసవ నొప్పులు అధికమవ్వడంతో 108 కి ఫోన్ చేయగా కొద్ది క్షణాలలో చేరుకున్న 108 వాహనంలో ఆమెను ఎక్కించి ఎల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుని పోయి చూపించగా అక్కడ సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకుని వెళ్లమన్నారు. దీంతో అక్కడనుండి 108 వాహనంలో వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రసవ నొప్పులు అధికమవ్వడంతో 108 సిబ్బంది ఈఎంటి ఎం.శంకర్ నారాయణ, పైలెట్ పుచ్చ రామారావు సహకారంతో ప్రసవ చర్యలు చేపట్టారు. దాంతో సవర అనితకు సాధారణ ప్రసవం జరగగా అది మూడవ కాన్పు ఆడబిడ్డ జన్మించగా ఆ తల్లి బిడ్డలను సురక్షితంగా సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్పించారు. తక్షణమే సరుబుజ్జిలి పీహెచ్సీ సిబ్బంది స్పందించి వైద్యాన్ని అందించారు. దాంతో బిడ్డ తండ్రి రాము మరియు గ్రామస్తులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతి ఆదివారం ఉచిత వైద్యశిబిరం

కోటబొమ్మాళి, జూలై 9, ప్రభాతవార్త:

ఈ జూలై నెలలో ప్రతి ఆదివారం స్థానిక సంతమట్టి వద్ద శ్రీరామకృష్ణ క్లినిక్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు సనపల అభిరామ్ (ఎండి, జనరల్ మెడిసిన్) గురువారం తెలిపారు. బిపి, షుగర్, థైరాయిడ్, కొలెస్ట్రాల్ అన్ని రకాల జ్వరాలు, ప్లేటెల్స్ తగ్గుదల సమస్యలు, గుండెనొప్పి, ఉబ్బసం, ఊపిరితిత్తులు, కిడ్నీ, పక్షవాతం, పిట్స్, మైగ్రేన్, కీళ్ళవాతం, వాంతులు, విరోచనాలు, కామెర్లు, గ్యాస్ట్రిక్, లివర్ సంబంధిత వ్యాధులను పరీక్షించనున్నట్లు తెలిపారు. డాక్టర్ ఫీజు, షుగర్ పరీక్షలు ఉచితంగా చేయబడతాయని, మిగిలిన రక్తపరీక్షలు, ఈసీజీకి 25 శాతం రాయితీ ఇవ్వబడుతుంద

10 -7 Pg9th cheli.qxd:10 -7 Pg9th cheli.qxd 1/1/02 6:21 AM Page 1

కాఫీతో చాక్లెట్ తోడు.. చురుకుపాలు సైదోడు !

కాఫీలో ఉండే కెఫీన్ ఏకాగ్రత, అప్రమత్తత పెంచడానికి పనిచేస్తుంది. డార్క్ చాక్లెట్‌లో ఫ్లేవనాల్స్, థియోబ్రోమిన్‌రక్తప్రసరణ, మూడ్‌పై సానుకూల ప్రభావం కలిగిస్తుంది. అవి రెండూ కలిపి సేవిస్తే చురుకుదనం మీ వశమౌతుంది. మీకెప్పుడైనా తల బరువెక్కినట్లో, కళ్లలో మందకొడితనం ఆవహించినట్లు ఉంటేనే ఏదో తెలిసిన మందులు వాడేయాలను అనుకోవద్దు. ఒక కప్పు కాఫీతో పాటు చిన్న ముక్క డార్క్ చాక్లెట్ తింటే చాలా ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. రుచితో పాటు దీని ప్రయోజనాల వెనక ఆసక్తికరమైన సైన్స్ కూడా ఉందని వివరిస్తున్నారు. కాఫీ, డార్క్ చాక్లెట్ రెండు ఉత్తజాన్ని చురుకుదనాన్ని పెంచేవని అందరికీ తెలిసిందే. కాఫీ నిద్రమత్తును తగ్గించి అప్రమత్తతను పెంచుతుంది. అందుకే పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు, చదువుకునే సమయంలో లేదా ప్రయాణాల్లో చాలా మంది కాఫీ తాగడం సహజం కదా.. కెఫీన్ నేరుగా నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి ఏకాగ్రతను పెంచేందుకు సాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెప్పెమాట. డార్క్ చాక్లెట్ కేవలం రుచికరమైన స్నాక్ మాత్రమే కాదు. ఇందులో ఫ్లేవనాల్స్, థియోబ్రోమిన్ అనే సహజ పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరచడంలో సాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెదడుకు రక్త సరఫరా మెరుగుపడితే చురుకుదనం పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే డార్క్ చాక్లెట్ మూడ్‌ను ఉల్లాసంగా ఉంచడంలో కూడా తోడ్పడుతుంది. కాఫీ, డార్క్ చాక్లెట్ రెండింటిలోని పదార్థాలు కలిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. కాఫీలోని కెఫీన్ తక్షణ ఉత్సాహాన్ని అందిస్తే, డార్క్ చాక్లెట్‌లోని థియోబ్రోమిన్ నెమ్మదిగా ప్రభావం చూపుతుంది. దీంతో ఒక్కసారిగా ఎనర్జీ పెరిగుతుంది. అప్పుడప్పుడు ఆస్వాదించదగిన చిట్కా. కాఫీ ఎక్కువగా తాగడం వల్ల కొందరిలో నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఆందోళన వంటి సమస్యలు వస్తున్నాయనీ అంటుంటారు. ఏ ఆహారాన్నైనా మితంగా తీసుకోవడమే మంచి పద్ధతి. ఆహార సమతుల్యత పాటించవచ్చు.

సమన్వయాన్ని పెంచే స్విస్ బాల్ !

ఉదాహరణకు బాల్‌పై సిట్-అప్స్, ప్లాంక్స్ ప్రయత్నించి చూడండి. గర్భిణులు, వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేవారు, డెస్క్ ఉద్యోగులు.. ఈ స్విస్ బాల్‌పై వ్యాయామం చేయడం వల్ల వెన్ను కండరాలు బలపడతాయి. గర్భిణులకు ప్రసవ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయి. రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా ఉందా? అయితే,మీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారాలంటే స్విస్‌బాల్‌తో వ్యాయామాలు మొదలుపెట్టండి. ఒత్తిడీ బరువు తగ్గాలి.. ఆరోగ్యం మెరుగుపడాలి. ఇకనైనా వర్కవుట్లు చేద్దాం అని చాలాసార్లే అనుకుంటాం. కానీ అమలు చేయం. ఈ స్విస్ బాల్‌ని ఇంటికి తెచ్చుకుని చూడండి. బోలెడన్ని ప్రయోజనాలు.

స్విస్‌బాల్‌తో పొట్ట, వీపు, పొత్తికడుపునకు ప్రయోజనం ఇచ్చే కసరత్తులు సులువుగా చేయొచ్చు. దీతో శరీరాన్ని బ్యాలెన్స్ చేయ గలరు. మెరుగైన పోశ్చర్ కూడా వస్తుంది.

పట్టుదలతోనే ఆకాంక్షల తీరు !



ఉద్యోగమనేది జీవితంలో ఒక భాగమేననుకొన్న ఓ భారతీయ విద్యాని పట్టు విడవకుండా చేసిన ప్రయత్నమే ఆమెకు ఓ ఉద్యోగానికి దారి చూపించింది. పట్టుదలతో శ్రమించి, ఈ కాలపు అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉద్యోగం సంపాదించిన ఒక భారతీయ యువతి కథ. యువతకు ఆదర్శంగా నలిచింది. న్యూయార్క్ యూనివర్సిటీ (ఎన్‌వైయూ) నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన దివ్య బన్సాల్. పట్టువదలని విక్రమార్కుడి వలె చేయని ఉద్యోగ ప్రయత్నంలేదు. ఎక్కని కంపెనీ గుమ్మం లేదు. ఎన్నో సార్లు తన దరఖాస్తు తిరస్కరించబడినా మళ్లీ మళ్లీ ప్రయ్నుస్తూనే ఉంది. వీసా స్పాన్సర్‌షిప్ వంటి సమస్యలున్నా తొలి ప్రయత్నమే మనకు అనుకూలించకపోయినా ప్రయత్నం చూస్తూ ఉంటే ఉద్యోగం తప్పక వస్తుందని ఆమె తోటి విద్యార్థులకు చెబుతుంది. దివ్య ఉద్యోగం 420 కంపెనీలకు దరఖాస్తులు పంపింది. అయితే వందలాది దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, ఆమెకు కేవలం మూడే ఇంటర్వ్యూలకు పిలుపు వచ్చింది. తనవన్నీ విఫల ప్రయత్నాలని అనుకోలేదు. నిరాశ చెందకుండా పట్టుదలతో ప్రయత్నించి చివరికి రెండు ఉద్యోగ ఆఫర్లను సొంతం చేసుకుంది. రెండు చేతుల్లోనూ ఆఫర్లు పెట్టుకొని వాటిలో 'ది బెస్ట్' ఎంచుకోవడం ఆమె చేతుల్లోనే ఉంది. తాను న్యూయార్క్‌లో జీవితాన్ని నిర్మించుకోవడానికే వచ్చానని, కేవలం కెరీర్ కోసం ఉద్యోగంతో పాటు తనకు ఇష్టమైన నృత్యం జీమ్, ఇంట్లో వంటకాలు, ఆత్మీయులతో సమయం గడపడం వంటి వాటికి సమాన ప్రాధాన్యత ఇస్తానని తన జీవిత ఆకాంక్షలను చెబుతోంది.

అన్నమయ్య

నారాయణ సూరి, లక్కమాంబ దంపతులకు వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో వైశాఖ పూర్ణిమినాడు కడపి జిల్లా తాళ్లపాకలో జన్మించాడు అన్నమయ్య. ఎనిమిదేళ్లకే ఎవరికీ చెప్పకుండా తిరుమలకు బయల్దేరాడు. ఆ యాత్రలో ఆకలిగొన్న అన్నమయ్యకు అలమేలు మంగమ్మ వృద్ధురాలిగా కనిపించి పాయసం అందించింది. తిరుమల చేరి స్వామిని దర్శించుకున్నాక.. అలమేలు మంగమ్మను కీర్తిస్తూ శ్రీ వేంకటేశ్వర శతకం రచించాడు. ఆ మహాక్షేత్రంలోనే ఉంటూ స్వామిని దర్శించుకుంటూ కాలం గడపసాగాడు. అన్నమయ్య ఆచూకీ తెలిసిన తల్లిదండ్రులు తిరుమల వెళ్లి అన్నమయ్యను తాళ్లపాకకు తెచ్చుకోగలిగారు. కానీ ఆయనలో స్వామి ధ్యాస తగ్గలేదు. భార్యవల్ల దారికి వస్తాడని వివాహం చేశారు. ఒకటి కాదు రెండు పెళ్లిళ్లు చేసుకున్నా.. శ్రీ వేంకటేశునిపై అపార భక్తి తగ్గలేదు. కనుకనే.. తిరుమల వెంకన్నను స్వామీ నీకు తిరుమల లడ్డూ కావాలా? అన్నమయ్య పాట కావాలా? అనడిగితే ఆ కోనేటిరాయడు రెండోదే కోరుకుంటాడు. ఆయన పాట స్వామికి అంత ఇష్టం మరి. దక్షిణాదిన పదకవితాశైలి, భజన సంప్రదాయాలకు ఆద్యుడు అన్నమయ్య. తన జీవితకాలంలో వేలాది కీర్తనలు రచించాడు. వియజ నగర సామ్రాజ్య ప్రతినిధి అయిన సాళువ నరసింగ రాయలు..తనపై కూడా కీర్తనలు రచించమని కోరగా తిరస్కరించాడు అన్నమయ్య. శ్రీహరిని స్తుతించిన ఈ నోరు మానవమాత్రులను కీర్తించదు అన్నాడు. ఆ మాటలకు ఆగ్రహించిన నరసింగరాయలు అన్నమయ్యను చెరసాలలో బంధించాడు. స్వామి అనుగ్రహంతో రాజుకు జ్ఞానోదయమై అన్నమయ్యను విడుదల చేయడమే కాదు, క్షమించమని ప్రాధేయపడ్డాడు. అన్నమయ్య సంకీర్తనల ప్రవాహం సెలయేరులా ప్రవహించింది. తిరుమల హుండీకి ఎదురుగా ఉన్న రాతి పలకల గదిలో సంకీర్తనల భాండాగారం బయటపడింది. అలా వేలాది అన్నమయ్య కీర్తనలు, మరెన్నో అమూల్య సంకీర్తనల సంపద అందుకోగలిగాం. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ మొక్కటే.. కీర్తనలో సమాజంలోని అసమానతలను చీల్చి చెండాడాడు అన్నమయ్య నిందార రాజు నిదురించే నిద్రయ ఒక్కటే. అంటూ రాజు, బంటులకు తేడా ఏముందని ప్రశ్నించాడు. ఏనుగు మీద అయినా, శునకం మీద అయినా సూర్య కిరణాలు ఒకేరీతిలో పడతాయి అన్నాడు. పంచభూతాలకు లేని ఈ పట్టింపులు నీకెందుకు? అంటూ ఆనాడే చురక పెట్టాడాయన. అన్నమయ్య పరమ భక్తుడే కాదు గొప్ప సంఘసంస్కర్త ఆధ్యాత్మిక విప్లవ చైతన్యమూర్తి.

మీట నొక్కితే చాలు !

బియ్యం, పప్పులు లాంటివి ఎంత జాగ్రత్తగా పదిలపరచినా పురుగు చేరుతుంది. కొన్నిసార్లు బూజుపడుతుంది కూడా. అందుకు ముఖ్య కారణం. తడి చేత్తో కొలత డబ్బాను పట్టుకోవడం. చెయ్యి తుడుచుకున్నాం కదా అనుకుంటాం కానీ.. మిగిలి ఉన్న అతి కొద్ది చెమ్మ వల్ల కూడా పదార్థాలు పడైపోతాయి. మనకు అందుబాటులోకి వచ్చిన 'రొటేటింగ్ రైస్ డిస్పెన్సర్' అలాంటి ఇబ్బందులను తొలగిస్తుంది. ఇందులో కింది భాగంలోని పెద్ద అరలో బియ్యం, పైనున్న చిన్న అరల్లో కందిపప్పు, మినప్పప్పు, రవ్వ లాంటివి నిలువచేయవచ్చు. మీట తిప్పితే చాలు. కావాలనుకున్నది పంపులోంచి నీళ్లలా వచ్చేస్తుంది. చుట్టూ తిరిగే వీలు ఉండటానికి అవసరమైన అర ఎదురుగా వచ్చేట్లు తిప్పి, కావలసినంత పట్టుకుని మీట ఆపితే సరిపోతుంది. గాలి చొరబడక పోవడమే కాదు, వాటర్ ప్రూఫ్, డస్ట్ ప్రూఫ్ ఉండంతో పదార్థాలు తాజాగా ఉంటాయి. నాణ్యమైన ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో తయారయ్యింది కనుక ఆరోగ్య సమస్యలు రావు, పర్యావరణానికీ నష్టం లేదు.

మీ శ్రీమతికి శుభాకాంక్షలు చెప్పారా?



ఏమండోయ్! మీ శ్రీమతి పుట్టిన రోజు ఎపుడో గుర్తుందా! లేదా! అయితే ఇక అంతే అది కూడా గుర్తుంచుకోలేకపోతే మీరేం భర్త అండి. వెంటనే మీ 'మైండ్ బేక్‌'లో నోట్ చేసేసుకోండి. లేకుంటే ఇబ్బందే, ఆ తర్వాత మీ యిష్టం. పుట్టినరోజుకు భర్త ప్రేమతో ఇచ్చే చిరు కానుక కూడా ఎంతో సంతోషాన్నిస్తుంది కదా! ఏమీ ఇవ్వకున్నా ఆ రోజును గుర్తుంచుకుని శుభాకాంక్షలు చెప్పినా చాలనుకునే అల్ప సంతోషలం మనం. కానీ, మగవాళ్లు మాత్రం గుర్తులేదు. పనిలో పడి మర్చిపోయా.. అంటూ రకరకాల కారణాలు చెప్పేస్తుంటారు. మనమూ దాన్ని మర్చిపోయి.. సర్దుకుపోతుంటాం. అయితే, ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోని దేశం ఒకటి ఉందని మీకు తెలుసా? ఇక్కడ భార్య పుట్టిన రోజును మర్చిపోతే ఇక వాళ్ల పని అంతే. 'సమోవా' అనే దేశంలో దీన్ని నేరంగా భావిస్తారట. అమెరికా సమీపంలో ఉండే పాలీనేసియన్ ఐల్యాండ్ దేశం ఇది. అందుకోసం ఇక్కడి ప్రభుత్వం ఏకంగా ఓ చట్టమే చేసింది. పైగా ఆ చట్టం సరిగా అమలవు తుందా? లేదా అనేది చూడడానికి ప్రత్యేకంగా పోలీసు బృందాలను కూడా ఏర్పాటు చేశారట. భార్య పుట్టిన రోజును మొదటిసారి మర్చిపోతే పోలీసులు భర్తకు వార్నింగ్ ఇచ్చి వదిలేస్తారట. అదే పొరపాటు రెండోసారి చేస్తే వాళ్లకు జరిమానా లేదా గరిష్టంగా ఐదేళ్లపాటు జైలు శిక్ష కూడా వేస్తారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. అంతేకాదు, భార్యకు తన హక్కుల గురించి, ఈ చట్టం గురించి అవగాహన కల్పించడానికి దేశమంతా క్యాంపులనూ నిర్వహిస్తారట. ఏదిఏమైనా ఇలాంటి చట్టం మన దేశంలో కనుక ఉండి జైళ్లన్నీ నిండిపోతాయేమో.

'దాదా ది సౌరవ్ గంగూలీ స్టోరీ' ఫస్ట్ లుక్ రిలీజ్

ప్రపంచ వ్యాప్తంగా మే 14, 2027న సినిమా భారీ విడుదల..లెజెండ్రీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ పుట్టిన రోజు సందర్భంగా దాదా ది సౌరవ్ గంగూలీ స్టోరీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బాలీవుడ్ స్టార్ రాజ్‌కుమార్‌రావ్ టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు ఈ రోజు మరింత ప్రత్యేకంగా మారింది. ఇదే సమయంలో ఈ సినిమాను 2027, మే 14న లాంగ్ హాలిడే వీకెండ్ సందర్భంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అధికారికంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో 2002లో ఇంగ్లాండ్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం తర్వాత లార్డ్స్ బాల్కనీలో సౌరవ్ గంగూలీ జెర్సీ ఊపిన ఐకానిక్ మూమెంట్ ను రాజ్‌కుమార్ రావ్‌తో సినిమాటిక్‌గా రీక్రియేట్ చేసినట్లు చూపించారు. దాదా ది సౌరవ్ గంగూల్మీ సినిమా క్రికెట్ ఆట ఆడిన వ్యక్తి మాత్రమే కాకుండా దానిని మార్చిన మనిషి అసాధారణ ప్రయాణాన్ని చూపిస్తుంది. ఒక ప్రతిభావంతుడైన యువ క్రికెటర్‌గా ప్రారంభమై భారతదేశంలో అత్యంత ప్రభావశీలమైన కెప్టెన్లలో ఒకరిగా ఎదిగిన గంగూలీ ప్రయాణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.'దాదా ది సౌరవ్ గంగూలీ' సినిమాకు విక్రమాదిత్య మోత్వానె దర్శకత్వం వహిస్తున్నారు. లవ్ రంజన్, అంకూర్ గార్గ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీసిరీస్, డీబీఎల్ సమర్పణలో, లవ్ ఫిల్మ్స్ నిర్మాణంలో ఈ సినిమా రూపొం దుతోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2027, మే 14న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల కానుంది.

తారా

'వదలా': ట్రైలర్ లాంచ్

జగపతి బాబు, లయ, అక్కెళ్ల వి కృష్ణ, కిషోర్ నాయుడు చిరుమామిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్, చరిత చిత్ర ప్రొడక్షన్ వదలా మిస్టరీ గ్రిప్పింగ్ ట్రైలర్ లాంచ్‌వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు ఎమోషన్స్, మిస్టరీ, సస్పెన్స్ ఫ్యామిలీ థ్రిల్లర్ 'వదలా'తో సర్‌ప్రైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. అక్కెళ్ల వి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించారు. చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమామిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించిన ఈ చిత్రం, ఆకట్టుకునే ఫస్ట్ గ్లింప్స్, మంచి ఆదరణ పొందిన టీజర్‌తో ఆసక్తిని పెంచింది. ఈ సినిమా జూలై 17న థియేటర్లలోకి రానుంది. సినిమాలోగ్రాఫర్ చోటా కె. నాయుడు తన విజువల్స్‌తో సస్పెన్స్ వాతావర ణాన్ని అద్భుతంగా చూపించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జగపతిబాబు మాట్లా డుతూ..'వదలా' సినిమా జూలై 17న వదులుతున్నాం. ఈ సినిమా కథ మీద నాకు చాలా నమ్మకం ఉంది. కచ్చితంగా ఆడు తుందని నమ్ముతు న్నాను. చాలా రోజుల తర్వాత నేను సోలోగా చేసి మొత్తం భారం తీసుకుని, ఇద్దరు హీరోయిన్స్‌తో ఒక ఫ్యామిలీ థ్రిల్లర్ చేస్తే నాకంటూ ఒక గుర్తింపు వస్తుందని చేసిన ప్రయత్నం ఇది. .నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు అయ్యింది. ఇన్నేళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో అంశాలను దృష్టిలో పెట్టుకుని సినిమా తీయాల్సి వస్తోంది. ఓటీటీ, హిందీ డబ్బింగ్... ఇలా చాలా విషయాలు చూడాల్సి వస్తోంది. ఎలా తీసినా ప్రేక్షకులను అలరించడమే అంతిమ లక్ష్యం. హీరోయిన్ లయ మాట్లాడుతూ.. "ట్రైలర్ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. అందరూ చాలా హార్డ్ వర్క్ చేసిన సినిమా ఇది. వదలా టైటిల్ చాలా క్యాచీగా ఉంది. జగపతిబాబు తో మళ్లీ కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది.

'మారెమ్మ' . అందరికీ నచ్చుతుంది: మిట్టపల్లి సురేందర్

'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, 'బావ బావ', మారి సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

సినిమాలో వచ్చిన మొదటి అవకాశం గురించి?

'ధైర్యం' సినిమాకు తొలిసారి పాట రాశాను. ఆ తర్వాత రాజన్నలో కాలిగజ్జె ఘల్లుమంటే, జార్జ్ రెడ్డిలో వాడు నడిపే బండి రాయల్ ఎన్‌ఫీల్డ్, లవ్ స్టోరీలో నీ చిత్రం చూసి, రాజు వెడ్స్ రాంబాయిలో రాసిన పాటలు నాకు మంచి పేరు తీసుకొచ్చాయి.**మారెమ్మలో రాసిన 'మారి' పాట గురించి?**

'మారి' అనేది సినిమాలో హీరో ఆడుకునే దూడ పేరు. ఇలాంటి పాట రాసే అవకాశం రావడం నా అదృష్టం. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు క్లైమాక్స్‌కి వచ్చేసరికి ఆయనతో పాటు నేను కూడా ఏడ్చేశాను.

ఈ మధ్యకాలంలో రాసిన పాటల గురించి?

పెద్ది సినిమాలో రెండు పాటలు రాశాను. ఢిల్లీ ఎపిసోడ్‌లో వచ్చే అలసిపోవద్దురా పెద్ది, అలాగే పెద్ది ట్రైన్‌లో తిరిగి వస్తున్నప్పుడు వచ్చే అనగనగా పాట, జగపతి బాబు ఎపిసోడ్‌లో వచ్చే ఆగిన శ్వాసలో ఆశయం ఉంది పాటలు రాశాను. అవన్నీ కథకు ఆయువు పట్టు లాంటి పాటలు. థియేటర్‌లో ప్రేక్షకులను ఎంతగానో కదిలించాయి.

రవితేజని కలిశారా?

ఈ సినిమా కోసం కాదు. చోర్ బజార్ సినిమాకు పాట రాసినప్పుడు ఆ సినిమాలోని పాటను రవితేజ లాంచ్ చేశారు. ఆ సందర్భంగా ఆయనను కలిశాను.

మారెమ్మ రషెస్ చూశారా?

నేను కథ మొత్తం చదివాను. కథ చదివినప్పుడు నేను ఎలాంటి ఎమోషన్ ఫీల్ అయ్యానో, అదే ఎమోషన్ స్క్రీన్‌పైకి వచ్చింది. దర్శకుడు చాలా అద్భుతంగా తీశారు.

నిర్మాత గురించి? మయూర్ తొలిసారి నిర్మాత అయినప్పటికీ ఎక్కడా రాజీపడకుండా సినిమా తీశారు.

దర్శకుడు గురించి?

దర్శకుడు చాలా టాలెంటెడ్. ప్రతి పాటను దగ్గరుండి రాయించారు. ఆయనకు ప్రతి విషయంలో మంచి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉంటుంది.

మీ స్ఫూర్తి ? సినీ పరిశ్రమలో వేటూరి, చంద్రబోస్ నాకు స్ఫూర్తి.

సంగీతం చేయాలనే ఆలోచన ఉందా?

లేదు. రెండు పడవల ప్రయాణం చేయను. ప్రస్తుతం సినిమా పాటలు రాయడానికే పూర్తి సమయాన్ని కేటాయించాను.

ఇప్పుడు రాస్తున్న సినిమాల గురించి?

ప్రస్తుతం దాదాపు పది సినిమాలకు పాటలు రాస్తున్నాను. ఇడుపుకాయితం, జిల్లేడు చెట్టు, దేత్తడి, డేవిడ్ రెడ్డి ఇలా పలు సినిమాలకు రాస్తున్నాను.

ఆగస్ట్ 14న 'అగధ' వస్తోంది

నిర్మాత గా ఒక చరిత్ర సృష్టించిన ఎం.ఎస్. రాజు , దర్శకునిగా 'అగధ్ధ చిత్రాన్ని ఒక విజువల్ వండర్ గా తీర్చిదిద్దారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ చిత్రం అగధ ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 14, 2026న భారీ స్థాయిలో విడుదల కానుంది.ఆ మధ్య విడుదలైన 'అగధ్ధ టీజర్ ఒక సెన్సేషన్ సృష్టించింది. ప్రేక్షకులు ఈ సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూసేలా చేసింది. టీజర్ లోని విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మిస్టీరియస్ వాతావరణం, గ్రాండియర్ మేకింగ్‌కు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించాయి.'అగధ్ధ గురించి దర్శకుడు ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ, 'అగధ' నా డ్రీమ్ ప్రాజెక్ట్. టీజర్‌లో చూసింది ఈ సినిమా ప్రపంచంలో ఒక చిన్న భాగం మాత్రమే. సినిమాలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఎన్నో అంశాలు ఉన్నాయి. ఇది ప్రతి ఫ్రేమ్ లోనూ ఓ విజువల్ వండర్‌లా అనిపించే సినిమా. అలాగే ఎమోషన్స్ కి టాప్ ప్రయారిటీ ఇచ్చాం. ప్రతి ఆర్టిస్ట్, ప్రతి టెక్నీషియన్ అద్భుతంగా పనిచేశారు. ముఖ్యంగా కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ తమ పాత్రల్లో అసాధారణ నటన కనబరిచారు. ప్రేక్షకులు థియేటర్లలో ఒక కొత్త అనుభూతిని పొందుతారు. నిర్మాత కాశీ విశాలాక్షి బలును మాట్లాడుతూ, "అగధ్ధను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మించాం. టీజర్‌కు వచ్చిన స్పందన మా ఆనందాన్ని మరింత పెంచింది. ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని విశ్వసిస్తున్నాం" అన్నారు.నటి కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ, "మహాదేవి పాత్ర నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. హీరో శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ, 'దర్టీ హరి' తర్వాత మళ్లీ ఎం.ఎస్. రాజు గారితో పని చేయడం సంతోషంగా ఉంది. 'అగధ్ధలో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి" అన్నారు.

ఏ 'టాక్సిక్' మ్యూజిక్ వీడియో 'తబాహీ' రిలీజ్

మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి 'టాక్సిక్' ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ సినిమాలోని తొలి పాట తబాహీ అఫీషియల్ మ్యూజిక్ వీడియోను విడుదల చేశాయి. రాకింగ్ స్టార్ యశ్, కియారా అద్వానీ జంటగా కనిపిస్తున్న ఈ పాటలో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమను అత్యంత స్వచ్ఛంగా, గాఢంగా చూపిం చిన ఈ పాట, అద్భుతమైన విజువల్స్, భావోద్వేగాలతో కూడిన కథనం, మ్యూజిక్ వీడియో విడుదలకు ముందు మేకర్స్ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన ప్రమోషన్ చేశారు. విశాల్ మిశ్రా స్వరపరచి, ఆలపిం చిన ఈ పాటకు హిందీలో రాజ్ శేఖర్ సాహిత్యం అందించారు. ఈ పాటను హిందీతో పాటు కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు, గాయకుడు విశాల్ మిశ్రా మాట్లాడుతూ, 'తబాహీ' సాధా రణ ప్రేమగీతం కాదు. ప్రేమ లోని త్యాగం, ఆవేశం, భావోద్వేగాలను ఈ పాట చూపి స్తుంది. యశ్, గీతూ మోహన్‌దాస్ కలిసి కథ అందించిన ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించగా, తెలుగు, హిందీ, తమిళం, మలయాళంతో పాటు ఇతర భాషల్లో కూడా డబ్ చేసి విడుదల చేయనున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో యశ్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు .ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' చిత్రం ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

'మిస్టర్ మిడిల్ క్లాస్'17న రిలీజ్

శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్స్‌గా నటకిరీటి రాజేంద్ర ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందు తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ మిస్టర్ మిడిల్ క్లాస్. జీకే సిఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. జూలై 17న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో శ్రీకాంత్ వేంకటేశ్వర స్వామి గెటప్‌లో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. మిస్టర్ మిడిల్ క్లాస్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ .అందరూ కలిసి ఎంజాయ్ చేసే ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఈ చిత్రంలో సునీల్, రఘుబాబు, అలీ, వెన్నెల కిశోర్, పృథ్వి, బాబూ మోహన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి సాయి కార్తీక్ మ్యూజిక్, 'గరుడవేగ' అంజి సినిమాటోగ్రాఫర్, డైమండ్ రత్నబాబు డైలాగ్స్ అందిస్తున్నారు.

10vzm15:10vzm15.qxd 10-07-2026 00:10 Page 1

కామ్రేడ్ వెంపటాపు సత్యం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

తెర్లాం, జూలై 9, ప్రభాతవార్త:

బేబీనాయన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిలిబొబ్బిలి నియోజకవర్గం, తెర్లాం మండలం, ఎన్.బూర్జవలస గ్రామంలో గౌరవ శాసనసభ్యులు లిఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతుల మీదుగా కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణ (సత్యం) విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, వెంపటాపు సత్యం ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, శ్రీకాకుళ గిరిజనోద్యమంలో కీలక పాత్ర పోషించారని, గిరిజన ప్రజలను దోచుకునే భూస్వాములకు వ్యతిరేకంగా, భూ-పోరాటాలు చేసి, పేద గిరిజనులకు భూమి పంపిణీ చేశారని అన్నారు.. ఆదిభట్ల కైలాసం గారుతో కలిసి గిరిజన ఉద్యమంలో పోరాడిన గొప్ప నాయకులు అని కొనియాడారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు తెర్లాం మండలం టీడీపీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బిజెపితోనే అభివృద్ధి సాధ్యం

నెల్లిమర్ల, జులై 9, ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీతోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఓటర్ల జాబితా సమీక్ష ప్రక్రియ 'సర్' నియోజకవర్గ ఇన్చార్జ్ బూర్లె శ్రీధర్ అన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్, మహేశ్వరి ఆధ్వర్యంలో వారి స్వగృహం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో నగర పంచాయతీలోని 14వ వార్డుకు చెందిన 30 మంది భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీధర్, పార్టీ నాయకులు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూపార్టీని నమ్ముకుని చేరిన వారందరికీ తాము భరోసాగా నిలుస్తామని, కష్టాల్లోనూ నష్టాల్లోనూ భాగస్వాముల వుతామన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి ఆల్తి నల్లి బాబు, మైపాడ మహేశ్వరి, హేమలత, సురాల సూర్యనారాయణ, నడిపేన నారాయణమూర్తి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల గాంధీనగర్ కాలనీ ప్రాంతానికి చెందిన దురగాని త్రినాధరావు, భారతి,దురగాని రామారావు, రమ, కొత్తకోట్ల అచ్చన్న, సత్యవతి, కే అప్పల నరసమ్మ, సత్యం, పైడిరాజు, బంగారు లోకేష్ తదితరులు బిజెపిలోకి చేరారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, జూలై 9, ప్రభాతవార్త

రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఈ సభలో ఆయన మాట్లాడారు. భూమి హక్కుల పరిరక్షణలో ఇవి ఎంతో కీలకమని, రైతు కుటుంబాలకు భరోసా కల్పించే ముఖ్యమైన పత్రాలుగా నిలుస్తాయని తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతాల్లోని పొలాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి వ్యవసాయ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, పంటల స్థితిగతులు, భూసంబంధిత ఇబ్బందులు తదితర అంశాలపై ఆరా తీశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో రైతుల సమస్యలను తెలుసుకుంటూ, భూమి హక్కులు, వ్యవసాయ భివృద్ధికి సంబంధించిన అంశాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని బంగార్రాజు స్పష్టం చేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద్ , తహసీల్దార్ రమణ , జిల్లా టి ఎన్ టి యు సి అధ్యక్షులు విక్రం జగన్నాథం , మండల కోశాధికారి శ్రీను ,రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి : డీఈవో

నెల్లిమర్ల, జూలై 9, ప్రభాతవార్త

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రేరణ తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యం నాయుడు అన్నారు. జాయిన్ ఫర్ డెవలప్మెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉంగా ఆదినారాయణ తన స్నేహితుల సహకారంతో మండలంలోని సారిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని డీఈవో మాణిక్యం నాయుడు లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని అన్నారు. తను చదువుకున్న పాఠశాలలో ఆదినారాయణ గ్రంథాలయం ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి ఆదినారాయణ సంకల్పం మిగిలిన పూర్వ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకునేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శిగా నిలవాలని ఆయన సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి పద్మావతి, రిటైర్డ్ హెడ్మాస్టర్ బోను మహంతి ఆదినారాయణ, గ్రామస్తులు, గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

పార్వతీపురం, జూలై 9, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, చీణూ చట్టం కింద ఉండే చట్టపరమైన పరిణామాలు మరియు శిక్షల గురించి అవగాహన కల్పించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను వాడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, చదువు మరియు కెరీర్‌పై దృష్టి పెట్టాలని వారికి సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, లేదా 1972 లేదా 112 నంబర్లకు కాల్ చేయాలని సూచిస్తూ, అలాగే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జజూ ఇన్స్పెక్టర్ కె.వెంకట్రావు మరియు జిల్లా నార్కోటిక్ టాస్క్ ఫోర్స్, జజూ సిబ్బంది, అలాగే ఈగిల్ భాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డికి ఘన సన్మానం

పార్వతీపురం, జూలై 9, ప్రభాతవార్త :

నీతి ఆయోగ్ ఆశావాహ జిల్లాల డెల్టా ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మన్యం జిల్లాకు నాయకత్వం వహించిన జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డిని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. నీతి ఆయోగ్ ప్రకటించిన డెల్టా ర్యాంకింగ్‌లో ఆరోగ్యం మరియు పోషకాహారం విభాగంలో దేశంలోనే ప్రథమ స్థానం, అలాగే మౌలిక సదుపాయాల విభాగంలో ద్వితీయ స్థానం సాధించడం మన్యం జిల్లాకు గర్వకారణమని అన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం, వివిధ శాఖల అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వల్లే ఈ అరుదైన విజయాలు సాధ్యమయ్యాయని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్ల కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి చూపిన ప్రత్యేక చొరవ, కార్యదీక్ష ఫలితంగానే జాతీయ స్థాయిలో మన్యం జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి జిల్లాను దేశానికి ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు.

ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు

చీపురుపల్లి , జూలై 9, ప్రభాతవార్త:

రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వేడుకలను గురువారం నాడు చీపురుపల్లి పట్టణంలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పార్టీ కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా పార్టీ ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరాల నాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు బెల్లాన త్రినాథ్ తదితరుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయంలో భారీ కేకు కట్ చేసి వేడుకలు జరిపారు. వైయస్సార్ కార్యాలయంలో రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత, పెద్దలు మాజీ విద్యా శాఖ మాత్యులు గౌరవనీయులు శ బొత్స సత్యనారాయణ గారి జన్మదినోత్సవ వేడుకలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.. పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

తోటపల్లి బ్యారేజి కాలువపై ప్రతిపాదిత జలవిద్యుత్ కేంద్రం స్థలాన్ని పరిశీలించిన జేసీ

గుర్ల, జూలై 9, ప్రభాత వార్త:

సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజి ఎడమ ప్రధాన కాలువపై మే ఎన్ కాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదించిన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం స్థల సేకరణకు సంబంధించి గురువారం పార్వతిపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్. వైశాలి క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేపట్టారు. ఈపర్యటనలో భాగంగా సంయుక్త కలెక్టర్ మొదట తోటపల్లి బ్యారేజి ఎడమ ప్రధాన కాలువ తూము వద్ద ప్రతిపాదిత స్థలాన్ని సంయుక్తంగా పరిశీలించారు. జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ, సాంకేతిక అంశాలు మరియు పరిసర ప్రాంతాల పరిస్థితులపై అధికారులతో చర్చించారు. గతంలో నాగావళి నదిపై నాగూరు గ్రామం వద్ద ప్రైవేటు యాజమాన్యంలో నిర్మించబడి, ప్రస్తుతం విజయవంతంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న జలవిద్యుత్ కేంద్రాన్ని సంయుక్త కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అధునాతన యంత్ర సామగ్రి, వాటి పనితీరును మరియు విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆమె నిశితంగా పరిశీలించారు. తోటపల్లి వద్ద ప్రతిపాదిత ప్రాజెక్టును మరింత సమర్థవం తంగా రూపకల్పన చేసేందుకు ఈ క్షేత్రస్థాయి పరిశీలన ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈపర్యటనలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి, తోటపల్లి ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తంగుడు రఘునాథనాయుడు, మండల తహసిల్దార్ పాము బాల, ప్రైవేటు సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ . కోట క్యాంప్ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' విజయవంతం : ఎమ్మెల్యే కోళ్ల

లక్ష్మవరపు కోట,జూలై 9 ప్రభాత వార్త :

జనియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా ఎల్ కోట క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం విజయవంతమైంది అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు గురువారం జరిగిన . ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి కోళ్ల లలితకుమారి పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె వారి సమస్యలను సావధానంగా అడిగి తెలుసుకున్నారు. ఈ దర్బార్‌లో ప్రజల నుంచి మొత్తంగా 24 వినతులు అందినట్లు అధికారులు వెల్లడించారు.ప్రజా దర్బార్‌లో స్వీకరించిన 24 వినతులలో అత్యధికంగా పెన్షన్ల సమస్యలపైనే ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో పెన్షన్లకు సంబంధించి 12 వినతులు, వ్యవసాయ రంగానికి సంబంధించి 5, రెవెన్యూ శాఖకు సంబంధించి 3 రాగా.. విద్యుత్ శాఖ మరియు పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి రెండేసి చొప్పున వినతులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ఈ వినతులపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తక్షణమే స్పందించారు. ఆయా సమస్యలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆమె కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ఇబ్బందులను తీర్చడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

వివాహేతర సంబంధం పై ప్రశ్నించినందుకే భర్తను హత మార్చిన భార్య

గరివిడి ,జూలై 9 ,ప్రభాత వార్త:

గరివిడి మండలం శివరాం గ్రామంలో సంచలనం రేకెత్తించిన భర్త ను హత్య చేసిన భార్య ఉదంతం లో ప్రధానంగా భార్య వివాహేతర సంబంధాలను ప్రశ్నించేందుకు భార్య తన భర్తను హత్యకు పాల్పడేందుకు కారణంగా తెలుస్తోంది. నిత్యం భార్య చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండటాన్ని సహించ లేని భర్త భార్య ను ప్రశ్నించే వారు.అదే కారణంగా శివరాం కి చెందిన సరస్వతి ఆయన భర్త కుమిలి సత్యం ని పదిలించు కునేందుకు భర్త తో తగాదాకి దిగేది. ఈ నేపథ్యంలో ఈ నెల 8 న ఆమె తన భర్త కుమిలి సత్యం ని కర్ర తో బలంగా తలపై కొట్టడం తో ఆయన మృత్యువాత పడ్డారు. భార్య ప్రవర్తన పై ప్రశ్నించడమే భర్త నేరంగా నేటి మహిళ వ్యవహారం ఉండటం హేయమైన చర్యగా బావించక తప్పదు. మహిళా లోకం సిగ్గు పడేవిదంగా తన పెనిమిటినే తానే హత మార్చే ధోరణి మహిళల్లో చోటు చేసుకోవడం గర్హనీయం. కాగా ఈ హత్యోదంతానికి సంబంధించి చీపురుపల్లి డివిస్పీ సూరాడ రాఘవులు, సి ఐ జి.శంకర రావు, ఎస్ ఐ. బి.లోకేశ్వర రావు శివరాం గ్రామానికి క్లూస్ టీమ్ , వేలిముద్రలు సేకరణ బృందం తో వెళ్లి సంఘటన ప్రదేశ ఇంటిని పరిశీలించారు. నేరానికి పాల్పడిన సరస్వతి ని, కుటుంబీకులను వారు ప్రశ్నించారు. కాగా కేసు ని చీపురుపల్లి సి ఐ జి.శంకర రావు పర్యవేక్షణ లో గరివిడి ఎస్ ఐ బి. లోకేశ్వర రావు దర్యాప్తు చేస్తున్నారు.

తెగులు నివారణ కొరకు విత్తన శుద్ధి చేసుకోవాలి

దత్తిరాజేరు, జూలై 9, ప్రభాతవార్త :

వరి నారుమడిలో తెగుళ్లు రాకుండా ఉండాలంటే విత్తన శుద్ధి తప్పనిసరిగా రైతులుచేసుకోవాలని వ్యవసాయ సహాయక సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు గడసాం గ్రామంలో వరి నారుమళ్లు మరియు పచ్చిరొట్ట పంటను మండల వ్యవసాయ అధికారి గోవిందమ్మ తో కలిసి శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఏడిఏ విత్తన శుద్ధి పై రైతులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి మూడు గ్రాముల కార్బన్డిజం ఒక లీటర్ నీటితో కలిపి ఆ నీటిలో విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి ఈ విధంగా చేయడం ద్వారా విత్తనంలో శిలీంద్రాలు నశించి పైరు ఆరోగ్యంగా పెరుగుతుంది నానబెట్టడం విత్తనం మొలకెత్తేందుకు వీలుగా గోనిసంచెల్లో ఉంచాలి. విత్తనాలు మొలకెత్తిన తర్వాత నాటేందుకు అనుకూలంగా ఉంటాయి ఒక ఎకరా వరిసాగు కోసం ఐదు సెంట్లు భూములు నలుమూలల నాటుకోవాలి పంట ఆఖరి దుక్కులు ఒక ఎకరానికి 1.5 కేజీలు యూరియా 6 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఒక కిలో న్యూరైట్ పోటాస్ నారుమడి పెంపడానికి కావలసి ఉంటుంది అవసరమనిపిస్తే విత్తనాలు నాటిన 15 రోజుల తర్వాత ఒక కేజీ యూరియా అందించాలి కలుపు నివారణ పద్ధతులు విత్తనం ఎదిగే దశలో ఉన్నప్పుడు సమగ్ర కలుపు నివారణ పద్ధతులను పాటించాలి .

కాన్పుల మధ్య ఎడమ తల్లీ,బిడ్డలకు ఆరోగ్యం

కొమరాడ,జూలై 9 ప్రభాతవార్త:

సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా గర్భిణీలకు వైద్య సేవలందించాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. కె.ఆర్.బి పురం పిహెచ్సీ లో పిఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీలకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, అందుతున్న సేవలపై పరిశీలించారు. తనిఖీల వివరాలు, ల్యాబ్ నివేదికలు ఎం.సి.పి కార్డులో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. డా. జగన్ మాట్లాడుతూ గర్భిణీ నమోదు మొదలుకొని ప్రసవానంతరం వరకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు,పర్యవేక్షణ, హైరిస్క్ సమస్యల గుర్తింపు పై దృష్టి సారించాలన్నారు. కాన్పుకు, కాన్పుకు మధ్య నిర్దిత సమయంతో తల్లి, బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. గిరిశిఖర, మారుమూల గర్భిణీలపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులశీ సందర్శించి విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ వివరాలు, సిక్ రిజిస్టర్ పరిశీలించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకొని పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ పి. అనూప్, సూపర్వైజర్స్ జయగౌడ్, శారద, శోభ, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 70 కుటుంబాలు

బొబ్బిలి, జూలై 9 ప్రభాతవార్త:

బొబ్బిలి మండలం పైకి గ్రామం నుంచి వైయస్సార్ ను వీడి టీడీపీ బొబ్బిలి మండల క్లస్టర్ ఇంచార్జ్ బంకురు బాబూరావు ఆధ్వర్యంలో, శంబంగి ధనుంజయ నాయుడు మాజీ ఏఎంసీ డైరెక్టర్ బోదల లక్ష్మి కలిసి సుమారు 70 కుటుంబాలతో బొబ్బిలి కోటలో శాసనసభ్యులు లిఆర్.వీ.ఎన్.కె.కె.రంగారావు బేబీ నాయనసమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది.. ఈ కార్యక్రమంలో బంకురు లక్ష్మి బొబ్బిలి మండలం టీడీపీ మహిళా అధ్యక్షురాలు శంబంగి అప్పలనాయుడు పక్కి టీడీపీ ఉపాధ్యక్షులు బంకురు సత్యన్నారాయణ (పీఏసీఎస్ డైరెక్టర్), బంకురు అప్పలనాయుడు మాజీ వార్డు మెంబరు అలజంగి కృష్ణ మాజీ వార్డు మెంబరు గాడి సింహాచలం మరడ లక్షుంనాయుడు సీర స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

పశుగ్రాసాల సాగుతో పాడి పశుసంపద అభివృద్ధి

సహాయ సంచాలకులు చలపతిరావు

వేపాడ, జూలై 9, ప్రభాతవార్త:

రైతులు పశుగ్రాసాల సాగుతో పాడి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలని శృంగవరపుకోట ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి. చలపతిరావు కోరారు. గురువారం మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల ఆరోగ్యం, అధిక పాల ఉత్పత్తి , మెరుగైన దిగుబడికి నాణ్యమైన పశుగ్రాసం ఎంతో అవసరమని సూచించారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తమ వ్యవసాయ భూముల్లో కొంత భాగం అధిక దిగుబడినిచ్చే పశుగ్రాస పంటలను సాగు చేయాలని, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, సైలేజ్ తయారీ వంటి ఆధునిక పద్ధతులను అవలంబించాలని కోరారు. ఈ కార్యక్రమాల ద్వారా రైతులు పశు పోషణలో మెరుగైన పద్ధతులను అవలంబించి, పాల ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు ఆదాయాన్ని కూడా పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు ల ద్వారా కలిగే ఉపయోగాలను వాటిని పొందే మార్గాలను వివరించారు. అలాగే గ్రామంలో పశు ఆరోగ్య , గర్భ కోస వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించి పశువులకు వైద్య సేవలు అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 20 పశువులకు గర్భకోస వ్యాధులు కి చికిత్సలు, చూలు తనిఖీలు , 10 పెయ్యలు కి నట్టల నివారణ మందులు, 6పశువులకి సాధారణ చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి, పశు వైద్య చికిత్సలయ సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

కొట్యాడ జడ్పీ హై స్కూల్‌లో డైనింగ్ హాల్‌కి శంకుస్థాపన

లక్ష్మవరపుకోట, జూలై 9,ప్రభాత వార్త :

మండలం లోని కొట్యాడ వున్నత పాఠశాల లో విద్యార్థుల కు డైనింగ్ హాల్ లేక ఇబ్బంది పడుతున్నారు మన ఊరు మన బడి కార్యక్రమం లో భాగంగా గ్రామస్థులు పూర్వ విద్యార్థులు మండలం వైసీపీ పార్టీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ తదితరులు ముందుకు వచ్చి డైనింగ్ హాల్ నిర్మాణం లో తాము తమ వంతు సహాయం అందిస్తాం అని మాట ఇవ్వడం జరిగింది అని ఈ రాజు గురువారం డైనింగ్ హాల్ నిర్మాణం కి శంకుస్థాపన ఎచ్ ఎం అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా చేశారు ఈ సందర్భంగా పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యయులు గుమ్మడి శ్రీనివాసరావు 10 వేలు మాజీ సర్పంచ్ కొట్యాడ దేవి మహేష్ లు 10 వేలు మాజీ ఎంపీటీసీ కొట్యాడ రాముడు 10 వేలు డి కృష్ణ 5 వేలు తమ వంతు సహాయం గా అందజేశారు ఈ నిర్మాణం కి సుమారు 6 లక్షలు ఖర్చు అవుతుంది అని పూర్వ విద్యార్థులు గ్రామస్థులు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలి అని అందరు సహాయం చేస్తే ఆగష్టు 15 కల్లా నిర్మాణం పూర్తి అవుతుంది అని ఎచ్ ఎం అప్పలనాయుడు తెలిపారు గ్రామస్థులు స్కూల్ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల గృహ నిర్బంధం చాలా అన్యాయం

సాలూరు, జూలై 9, ప్రభాతవార్త :

మన్యం జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఇంకా ఆదివాని గిరిజనసంఘ నాయకులను ఇంటినుంచి బయటకు రాకుండా రెండు రోజులుగా గృహనిర్బంధం చేయడాన్ని సిఐటియు,ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించాయి.గురువారం అందులో భాగంగా పట్టణంలో రాస్తారో నిర్వహించి నిరసన చేపట్టారు.అనంతరం నాయకులు శంకరరావు,రవి మాట్లాడుతు మన్యం జిల్లాలో కురుపాం ఎమ్మెల్యేకి గిరిజనప్రాంతంలో ఉన్న సమస్యలు తెలియజేయడానికి పాదయాత్రగా వెళ్లడమే నేరమా అని ప్రశ్నించారు.అలాగే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గిరిజన ప్రాంతంలో నేటివరకు పదులు సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని హాస్టల్లో ఆశ్రమ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడం కారణం కాదా అని విమర్శించారు.అంతేకాకుండా నిర్బంధించిన విద్యార్థి ఇంకా గిరిజన సంఘనాయకులను వెంటనే విడిచి పెట్టాలని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. హరిబాబు,భాస్కరరావు, వెంకటరమణ,స్వప్న,పార్వతి,లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

కోనూరు ఉన్నత పాఠశాల టీచర్లకు ఘన సత్కారం

గరివిడి, జూలై 9, ప్రభాత వార్త:

మండలంలోని కోనూరు ఉన్నత పాఠశాల లో పదవ తరగతి లో శత శాతం ఉత్తీ

10-07pg10.qxd:10-07pg10.qxd 1/1/02 6:34 AM Page 1

జెయింట్ల జోరు.. క్వార్టర్ ఫైనల్ పోరు

ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ వరల్డ్ కప్ కీలక దశకు చేరుకుంది. లీగ్ దశలో పోటీపడ్డ 48 జట్లలో కేవలం 8 జట్లే మిగిలాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, రన్నరప్ ఫ్రాన్స్‌తో పాటు యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, బెల్జియం, మొరాకో, నార్వే, ఇంగ్లాండ్ జట్లు క్వార్టర్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఫ్రాన్స్, మొరాకో మ్యాచ్‌తో కీలక దశ ఆరంభం కానుంది. 11న అర్ధరాత్రి స్పెయిన్‌తో బెల్జియం, 12 తెల్లవారుజామున నార్వేతో ఇంగ్లాండ్, 12 ఉదయం అర్జెంటీనాతో స్విట్జర్లాండ్ తలపడనున్నాయి

* కప్ వేటలో దిగ్గజాల ఢీ
* క్వార్టర్ ఫైనల్ కిక్‌ఆఫ్
* విజేతకే సెమీస్ టికెట్
* విజయం వైపు స్టార్స్ రన్
* మెస్సీ, ఎంబాపె, హాలాండ్ ఫైట్

(వార్త క్రీడా విభాగం)

సాకర్ ప్రపంచకప్ లీగ్ దశలో 48 జట్లు పోటీపడితే అందులో నుంచి 32 జట్లు రౌండ్ ఆఫ్ 32కు చేరాయి. అక్కడి నుంచి 16 జట్లు ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాయి. ఇప్పుడు క్వార్టర్‌ఫైనల్లో 8జట్లు అమీతుమీకి సిద్ధమ వుతున్నాయి.సాకర్ ప్రపంచకప్‌పై భారీ అంచనాలు పెట్టుకున్న పెద్ద జట్లలో చాలావరకు నిష్క్రమించాయి.జర్మనీ, పోర్చుగల్,నెదర్లాండ్స్, క్రొయేషియా జట్లు ప్రిక్వార్టర్స్‌లోనే ఆటను ముగించాయి.

డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా తమ స్థాయికి తగ్గట్లే వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆ జట్టు స్టార్ ఆటగాడు లియోనల్ మెస్సీ 5 మ్యాచ్‌ల్లో 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో దూసుకుపోతున్నాడు. 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా తమ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శిస్తూ వస్తోంది. ముఖ్యంగా ఆ జట్టు యువ సంచలనం కైలియన్ ఎంబాపె 5మ్యాచ్‌ల్లో ఏడు గోల్స్‌తో మెస్సీకి సవాల్ విసురుతున్నాడు. నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలండ్, స్పెయిన్ ఆటగాడు లామినే యమాల్ తమ జట్ల విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. మరోవైపు స్పెయిన్, ఇంగ్లండ్‌తో పాటు బెల్జియం తమ స్థాయి ఆటతీరుతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టాయి. ఇక ఎవరూ ఊహించని రీతిలో మొరాకో, నార్వే, స్విట్జర్లాండ్ కూడా ప్రిక్వార్టర్స్‌లో అదరగొట్టి క్వార్టర్స్‌లో ప్రవేశించాయి.

ఫ్రాన్స్ వర్సెస్ మొరాకో

ఫ్రాన్స్- మొరాకో పోరుతో క్వార్టర్స్ సమరం ఆరంభం కానుంది. ట్రైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఫ్రాన్స్‌ను ఆపడం మొరాకోకు సవాలే. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ ఫ్రాన్స్ విజయం సాధించింది. నాకౌట్ తొలి మ్యాచ్‌లో స్పీడన్‌ను చిత్తు చేసిన ఆ జట్టు.. జర్మనీని ఇంటిముఖం పట్టించిన పరాగ్వేపై ప్రిక్వార్టర్స్‌లో కాస్త కష్టపడి నెగ్గింది. ఇక మొరాకోను తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. గొప్ప ఫామ్‌లో ఉంది.తొలి నాకౌట్ మ్యాచ్‌లో బలమైన నెదర్లాండ్స్‌ను మట్టికరిపించిన మొరాకో.. తర్వాత కెనడాపై ఘనంగా గెలిచింది. ఏడు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో మెస్సీతో పోటీ పడుతున్న ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబాపె క్వార్టర్స్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

స్పెయిన్ వర్సెస్ బెల్జియం

బలమైన ఆటగాళ్లతో కూడిన ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. స్పెయిన్ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు కట్టుదిట్టమైన రక్షణతో ఆకట్టుకోగా, బెల్జియం అమెరికాపై 4-1తో విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. స్పెయిన్ సమష్టి ఆటపై ఆధారపడుతుండగా, బెల్జియం జట్టు అటాకింగ్ గేమ్ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

నార్వే వర్సెస్ ఇంగ్లాండ్

ఎర్లింగ్ హాలండ్ నేతృత్వంలోని నార్వే, ఇంగ్లాండ్‌ను ఢీకొననుంది. స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ అద్భుత ఫామ్‌తో నార్వే తొలిసారిగా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా.. జూడ్ బెల్లింగ్‌హామ్, హ్యారీ కేన్ నేతృత్వంలోని ఇంగ్లాండ్ అనుభవాన్ని నమ్ముకుని బరిలోకి దిగుతోంది. బ్రెజిల్‌పై నార్వే సాధించిన విజయం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచగా, మెక్సికోపై ఇంగ్లండ్ విజయంతో నాకౌట్ దశలో తన బలాన్ని చాటుకుంది. హాలాండ్-కేన్ మధ్య గోల్స్ పోటీ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారింది.

అర్జెంటీనా వర్సెస్ స్విట్జర్లాండ్

లియోనెల్ మెస్సీ మ్యాజిక్‌తో అదరగొడుతున్న అర్జెంటీనా... స్విట్జర్లాండ్‌తో తలపడనుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించే దశనుంచి మూడో గోల్స్‌తో అదరగొట్టి ఈజిప్ట్‌పై 3-2 తేడాతో గెలుపుతో క్వార్టర్స్‌కు వచ్చింది. కొలంబియాను పెనాల్టీ షూటౌట్‌లో ఓడించి స్విట్జర్లాండ్ తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. స్విట్జర్లాండ్ కట్టుదిట్టమైన రక్షణతో ప్రత్యర్థికి గట్టి సవాల్ విసరాలని చూస్తోంది. ఈ మ్యాచ్ ఆసక్తి రేపుతోంది.

వింబుల్డన్ ఫైనల్లో ముచోవా, నోస్కోవా

లండన్, జులై 9: వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్ ఆల్ చెక్ రిపబ్లిక్ పోరుగా మారింది. చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్స్ కరోలినా ముచోవా, లిండా నోస్కోవా ఫైనల్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఏడోసీడ్ కోకో గాఫ్‌పై కరోలినా ముచోవా మూడు సెట్ల పోరులో చెమటోడ్చి నెగ్గగా, రెండో సెమీఫైనల్లో లిండా నోస్కోవా అలవోకగా మార్టా కోస్ట్యూక్‌పై గెలుపొందింది.

మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఏడో సీడ్, అమెరికా టీనేజ్ సంచలనం కోకో గాఫ్‌ను మూడు సెట్ల పోరులో ముచోవా ఓడించింది. తొలి సెట్‌ను ముచోవా రెండుసార్లు గాఫ్ సర్వీసును కొల్లగొట్టి 6-2తో అలవోకగా నెగ్గి శుభారంభం చేసింది. అయితే తొలిసారి వింబుల్డన్ సెమీఫైనల్ ఆడిన కోకోగాఫ్ ఆ వెంటనే పుంజుకుంది. బలమైన సర్వీసులతో విరుచుకుపడుతూ ఏస్‌లు సంధించింది. ముచోవా సర్వీసును మూడుసార్లు బ్రేక్ చేసి రెండో సెట్‌ను 6-1తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో ఇరువురు కొదమ సింహాల్లా తలపడ్డారు.ఎవరి సర్వీసులు వారు నిలబెట్టుకోవడంతో సెట్ టైబ్రేకర్ వరకు కొనసాగింది. రెండు సార్లు గేమ్ పాయింట్లను కాచుకుని ముచోవా చివరకు 12-10తో గెలుపొంది ఫైనల్ చేరింది. రెండో గ్రాండ్ స్లామ్ ఫైనల్ చేరడం ముచోవాకు ఇది రెండోసారి. కాగా ఇప్పటివరకు గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాటని లిండా నోస్కోవా.. ఈ సారి ఏకంగా ఫైనల్ చేరింది. రెండో సెమీఫైనల్లో 12వ సీడ్ కోస్ట్యూక్‌పై వరుస సెట్లలో 6-4, 6-4తో అలవోకగా గెలుపొందింది.

వైభవ్ మూడోసారీ

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు.మరోసారి తక్కువ రన్స్‌కే పరిమితమయ్యాడు. రెండో టీ20లాగే జోఫ్రా ఆర్చర్ షార్ట్ పిచ్ బంతికి వైభవ్ దొరికిపోయాడు. తొలి ఓవర్‌లో ఆర్చర్‌ను ఆచితూచి ఆడిన వైభవ్.. రెండో ఓవర్ వేసిన జోష్ టంగ్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాది రిథమ్ అందుకున్నాడు. కానీ తర్వాత ఓవర్‌లో ఆర్చర్ వేసిన షార్ట్‌లెంగ్త్ బంతికి భారీ షాట్ ఆడబోయి వైభవ్ బౌటయ్యాడు. బంతి బ్యాట్ టాప్‌ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేవగా సామ్ కుర్రాన్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో 10 బంతుల్లో ఒక ఫోర్, సిక్స్‌తో కేవలం 15 పరుగులు చేసి వైభవ్ బౌటయ్యాడు. వైభవ్ సూర్యవంశీ గత రెండు మ్యాచ్‌లలో 14, 13 పరుగులు నమోదు చేశాడు. మొత్తంగా తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మొదటి మూడు మ్యాచ్‌లలో 42 పరుగులు చేశాడు.

శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్

బ్రిస్టల్, జులై 9: అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20మ్యాచ్‌లోనూ టీమిండియా టాప్ ఆర్డర్ తడబడింది. ఓపెనర్లు అభిషేక్(16), వైభవ్(15), ఫస్ట్‌డౌన్ ఇషాన్ కిషన్(4) విఫలమైనా శ్రేయాస్ అయ్యర్(49 బంతుల్లో 80 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 రన్స్ చేయగలిగింది.టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 48 రన్స్‌కే 3 కీలక వికెట్లు కోల్పోయి మరోసారి తడబడింది. ఈ దశలో కెప్టెన్ శ్రేయాస్ సమయోచితంగా ఆడుతూ శివమ్ దూబే(22)తో కలిసి వంద మార్కు దాటించాడు. నాలుగో వికెట్‌కు 53 రన్స్ జోడించి ఆదుకున్నాడు.ఆ తర్వాత కూడా ఒక వైపు తిలక్ వర్మ(11), వాషింగ్టన్ సుందర్(5), అక్షర్ పటేల్(1) రూపంలో వికెట్లు పడుతున్నా... శ్రేయాస్ అయ్యర్ ధాటిగా ఆడుతూ 33 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరివరకు అజేయంగా నిలుస్తూ భారత్ స్కోరును 150 మార్కు దాటించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆర్చర్, జోష్ టాంగ్ చెరో రెండు వికెట్లు.. విల్ జాక్స్, అదిల్ రషీద్ చెరో వికెట్ పడగొట్టారు.

విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు
లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి,జులై 9: రెండు సెషన్లలో నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిసాయి. గ్లోబల్ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, రూపాయి స్థిరత్వం, తొలి త్రైమాసిక ఫలితాల సీజన్‌పై సానుకూల అంచనాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 238.22పాయింట్లు పెరిగి 76,741.82వద్దముగిస్తే ఎన్ఎస్ఈ నిఫ్టీ 80.75 పాయింట్లు లేదా 0.34 శాతం లాభపడి 23,962.80వద్ద స్థిరపడింది.దీంతో నిఫ్టీ 23,950 మార్క్‌ను అధిగమించింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 2.25 శాతం, సెన్సెక్స్ 2.28 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.41 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.69 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది.

బీఎస్ఈలో 2,896షేర్లు లాభాల్లో ముగియగా, 1,342 షేర్లు మాత్రమే నష్టపోయాయి. 190 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. పీఎస్‌యూ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు డిమాండ్ సెక్టార్ల వారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి.ఐటీ,ఆటో రంగ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. నిఫ్టీ లాభాలకు ప్రధానంగా సన్ ఫార్మాస్యూటికల్స్ 2.78, భారతి ఎయిర్‌టెల్ 2.49, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్0.83 శాతం చొప్పున మద్దతునిచ్చాయి. రూపాయి,కమోడిటీలువిదేశీ మారక ద్రవ్య మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.41 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ డెలివరీ బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 44 సెంట్లు లేదా 0.56 శాతం పెరిగి 78.46 డాలర్లకు చేరుకుంది.

భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.75 శాతం వద్ద కొనసాగగా, ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.51శాతం పెరిగి 10గ్రాములకు రూ.1,44,449వద్ద ట్రేడయ్యాయి. టిసిఎస్ షేరు స్వల్పంగా 0.07శాతం లాభపడింది. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ షేరు 5.77శాతం క్షీణించింది.ప్రీమియర్ ఎనర్జీస్. ఫినిక్స్ మిల్స్ షేరు 3.34శాతం లాభపడ్డాయి. ఇతర కంపెనీలుఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి రూ.558.29 కోట్ల సౌర పీవీ మాడ్యూల్స్ సరఫరా ఆర్డర్ లభించడంతో ఇన్‌సోలేషన్ ఎనర్జీ షేరు 11.80 శాతం ఎగిసింది. ఈ అండ్ సీ గ్లోబల్ 2.47 శాతం పెరిగింది. డెలివరీ షేరు 2.67 శాతం లాభపడింది. యునో మిండా షేరు 2.22 శాతం పెరిగింది. సోలెక్స్ ఎనర్జీ 2.21 శాతం, రాజేష్ పవర్ సర్వీసెస్ 3.76 శాతం పెరిగింది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ 1.40 శాతం లాభపడింది. ఇక ఐపిఒల పరంగాచూస్తే కుసుమ్‌గర్ ఐపీఓకు మంచి స్పందన లభించింది.1.14 కోట్ల షేర్ల ఆఫర్‌కు 14.57 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ ఇష్యూ 12.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 10న ముగియనుంది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.398 నుంచి రూ.419గా నిర్ణయించారు.లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా ఐపీఓకు మాత్రం మందగించిన స్పందన లభించింది.

2.55 కోట్ల షేర్ల ఆఫర్‌కు వ్యతిరేకంగా కేవలం 38.67 లక్షల షేర్లకు మాత్రమే బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 0.15 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 13న ముగియనుండగా, ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.203 నుంచి రూ.214గా నిర్ణయించారు.

98శాతం వెనక్కివచ్చిన రూ.2వేల కరెన్సీనోట్లు: ఆర్బీఐ

ముంబయి,జులై 9: దేశంలో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో దాదాపు 98.47 శాతం వెనక్కి వచ్చినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించింది. దాదాపు మూడేళ్ల క్రితం ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్బీఐ, తాజాగా ప్రస్తుతపరిస్థితిపై గణాంకాలను విడుదల చేసింది.కరెన్సీ నిర్వహణలో భాగంగా 2023 మే 19న రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మార్కెట్‌లో మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ కేవలం రూ.5,451 కోట్లకు తగ్గిందని ఆర్బీఐ తెలిపింది. రూ.2000 నోట్లను మార్చుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ ఇష్యూ కార్యాలయాల్లో ఇప్పటికీ సౌకర్యం అందుబాటులో ఉంది. నోట్లను ఉపసంహరించుకున్నప్పటికీ, అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని (లీగల్ టెండర్) ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది.



టిసిఎస్ నికరలాభం
రూ.13,349 కోట్లు

ముంబయి,జులై 9: దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ(టీసీఎస్) తొలి త్రైమాసికంలో నికర లాభం 4.6 శాతం పెరిగి రూ.13,349 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీ రూ.12,760 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. కంపెనీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 13.9 శాతం వృద్ధితో రూ.72,275 కోట్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో అది రూ.63,437 కోట్లుగా ఉంది. వరుస త్రైమాసిక ప్రాతిపదికన ఆదాయం 2.2 శాతం పెరిగింది.స్థిరకరెన్సీ ప్రాతిపదికన ఆదాయం 0.4శాతం వృద్ధిని నమోదు చేసింది. టీసీఎస్ ఆదాయం అంచనాలను మించి నమోదవగా, నికర లాభం మాత్రం స్వల్పంగా అంచనాలకు దిగువన నిలిచింది. అంచనాల ప్రకారం కంపెనీ ఆదాయం రూ.71,862 కోట్లు, నికర లాభం రూ.13,394 కోట్లుగా ఉంటుందని భావించారు.ప్రపంచ ఆర్థికఅనిశ్చితులు,ఏఐ ప్రభావం కారణంగా ఈ త్రైమాసికం సవాళ్లతో కూడుకున్నప్పటికీ కంపెనీ పనితీరు అంచనాలకు అనుగుణంగానే ఉందని పేర్కొంటున్నారు. ఎస్‌కెఎఫ్ సంస్థతో 80 కోట్ల డాలర్ల మెగా ఒప్పందం, సర్వీస్‌నౌ తో బహుళ మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆర్డర్ బుక్ 9.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

రూ.12వేల కోట్ల టార్గెట్‌తో ఎస్‌బిఐ ఫండ్స్ ఐపీఓ

ముంబయి,జులై 9:ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ అనుబంధంగా ఉన్న ఎస్‌బిఐ ఫండ్స్ ఐపిఒకు వస్తోంది. జూలై 14 నుంచి సబ్‌స్క్రిప్షన్లు ప్రారంభం కానున్నాయి.రూ.11,693 కోట్ల విలువైన ఈ ఐపీఓకు కంపెనీ ఒక్కో షేరుకు రూ.545 నుంచి 574 వరకు ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో జరగనుండగా, ముఖ విలువ రూ.1 గల గరిష్ఠంగా 20.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది.ప్రైస్‌బ్యాండ్ గరిష్ఠ స్థాయి ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.1.17 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది.ఎస్‌బీఐ వాటాదారులకు ప్రత్యేక కోటాఈ ఐపీఓలో అర్హత కలిగిన ఎస్‌బీఐ వాటాదారుల కోసం మొత్తం ఇష్యూలో సుమారు 1.306 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు. గరిష్ఠ ధర ప్రకారం ఈ రిజర్వేషన్ విలువ దాదాపు రూ.750కోట్లుగా ఉంటుంది.అయితే రిటైల్ ఇన్వెస్టర్లకు కొన్ని ఐపీఓల్లో ఇచ్చే విధంగా ఎస్‌బీఐ వాటాదారులకు ఎలాంటి ధర రాయితీ ఉండదు.వారు నిర్ణయించిన ప్రైస్ బ్యాండ్ పరిధిలోనే బిడ్ చేయాల్సి ఉంటుంది. అర్హత కలిగిన ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం రూ.170 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేయగా,వారికి ఒక్కోషేరుపైరూ.54చొప్పున డిస్కౌంట్ అందించనున్నారు.ఎస్‌బీఐఫండ్స్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల కోసం 2,70,271 ఈక్విటీ షేర్లు,అర్హత కలిగిన ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం సుమారు 29.9 లక్షల ఈక్విటీ షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు.

అధునాతన ఫీచర్లతో నిస్సాన్ టెక్టాన్

ముంబయి,జులై 9: మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో పోటీని మరింత పెంచుతూ నిస్సాన్ భారత్‌లో టెక్టన్ కొత్త మోడల్ విడుదల చేసింది. 2023లో కిక్స్ నిలిపివేసిన తర్వాత నిస్సాన్ నుంచి వస్తున్న తొలి మిడ్‌సైజ్ ఎస్‌యూవీ ఇదే. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న ఎస్‌యువి మోడళ్లకు ఇది పోటీ ఇవ్వనుంది. టెక్టన్‌లో రెండు టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. 1.0 లీటర్ ఇంజిన్ 100 బీహెచ్‌పీ శక్తి, 166 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6 స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ఇచ్చారు. లీటర్‌కు 19.4 కిలోమీటర్ల మైలేజ్ వస్తుందని కంపెనీ చెబుతోంది. 1.3లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 163 బీహెచ్‌పీ శక్తి, 280 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది.ఈ వేరియంట్‌లో 6స్పీడ్ మాన్యువల్, డీసీటీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఉన్నాయి. దీని మైలేజ్ లీటర్‌కు 18.5 కిలోమీటర్లుగా ప్రకటించింది. డిజైన్ పరంగా టెక్టన్‌కు బలమైన లుక్ ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, కనెక్టెడ్ డీఆర్ఎల్స్, 18 అంగుళాల అలాయ్ వీల్స్, కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌లు ఆకట్టుకుంటాయి. లోపల 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను అందించారు.

ఎంఎఫ్‌లోకి ఆనంద్‌రాఠీ వెల్త్

ముంబై, జులై 9: వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆనంద్ రాఠీ వెల్త్ లిమిటెడ్ తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. అధిక ఆదాయం కారణంగా కంపెనీ లాభాలు దాదాపు 60శాతం పెరిగాయి.ఇదే సమయంలో, మ్యూచువల్ ఫండ్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు సెబీకి దరఖాస్తు చేయాలని నిర్ణయించింది. కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం మార్చి త్రైమాసికంలోని రూ.102 కోట్ల నుంచి జూన్ త్రైమాసికంలో రూ.163 కోట్లకు చేరి 59.7 శాతం పెరిగింది.

అదే కాలంలో మొత్తం ఆదాయం రూ.344 కోట్ల నుంచి రూ.422 కోట్లకు పెరిగి 22.6 శాతం వృద్ధిని ఆనంద్ రాఠీ వెల్త్ లిమిటెడ్ నమోదు చేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.